www.visalaandhra.com

బుధవారం
30-10-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 39
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

స్థాపితం : 1952

విశాలాంధ్ర

అక్షరాక్షరం అభ్యుదయం

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

చైనా-బీఆర్ఐ భాగస్వామ్యానికి బ్రెజిల్ దూరం

బీజింగ్: చైనా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బెల్ట్ & రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ)లో భాగం కారాదని బ్రెజిల్ నిర్ణయించింది. బీఆర్ఐలో భాగస్వామి కాని భారత్ తర్వాత రెండవ 'బ్రిక్స్' దేశంగా నిలిచింది. అంతర్జాతీయ వ్యవహారాల కోసం బ్రెజిల్ అధ్యక్షుడికి ప్రత్యేక సలహాదారు సెల్సో అమోరిమ్ ఈ మేరకు తెలిపారు. బీఆర్ఐలో చేరకుండా చైనా పెట్టిబడిదారులతో కలిసి పనిచేసేందుకు ప్రత్యామ్నాయ పద్ధతులను అన్వేషిస్తున్నట్లు వెల్లడించారు. ఒప్పందాలపై సంతకాలు చేయకుండానే చైనాతో బంధాన్ని నూతన స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు స్థానిక వార్తా సంస్థ ఓ గ్లోబోతో అన్నారు. చైనా మౌలిక వసతులు, వాణిజ్య ప్రాజెక్టులను బీమా పాలసీగా అనుకోబమని చెప్పారు. ఆ దేశంలో ఒప్పందాలను కోరుకోవడం లేదన్నారు.

క్యాన్సర్ మందుల ధర తగ్గింపు

న్యూఢిల్లీ: క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే మూడు ప్రధాన మందుల ఎంఆర్‌పీ ధరలు తగ్గాయి. ట్రాస్టుజుమాబ్, ఒసిమెర్టినిబ్, దుర్వాలుమాబ్ అనే మందుల ధరలు తగ్గిస్తూ నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) ఉత్తర్వులు జారీ చేసింది. సామాన్య ప్రజలకు సరసమైన ధరలకు మందులు అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. కేంద్ర బడ్జెట్ 2024-25లోనే వీటికి కస్టమ్స్ సుంకం నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆర్థిక శాఖకు చెందిన రెవెన్యూ విభాగం

- మిగతా 2 లో

ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలు

వర్చువల్‌గా ప్రారంభించిన మోదీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మంగళగిరి ఎయిమ్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం డ్రోన్ సేవలను ప్రారంభించారు. దిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద ఆసుపత్రి నుంచి వర్చువల్‌గా ఆయన ఈ సేవలను ఆవిష్కరించగా, ఏపీ నుంచి సీఎం చంద్రబాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆ శాఖ ఉన్నతాధికారులు జూమ్‌లో పాల్గొన్నారు. అనంతరం ఎయిమ్స్‌లో అధికారులు ప్రయోగాత్మకంగా డ్రోన్ పరీక్ష చేపట్టారు. ఎయిమ్స్ నుంచి నూతక్కి పీహెచ్‌సీ వరకూ డ్రోన్‌ను పంపించారు. ఒక మహిళా రోగి

- మిగతా 2 లో

ఏపీలో భారీగా డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో 32 మంది డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. వీరిలో కొంత మందికి కీలక పోస్టులు కేటాయించగా, మరికొందరికి సాధారణ బదిలీలు చేపట్టింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ శిల్పారామం సొసైటీ సీఈవోగా వి.స్వామినాయుడును, సీసీఎల్ఏ సహాయ కార్యదర్శిగా డి.లక్ష్మారెడ్డిని నియమించారు. ప్రొటోకాల్ డైరెక్టర్‌గా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మూసీ అభివృద్ధి ఆగదు

- మొదటి దశలో 21 కి.మీ. మూసీ అభివృద్ధి
- మాకు దీపావళి అంటే చిచ్చుబుడ్లు... వారికి సారాబుడ్లు
- సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: మాకు దీపావళి పండుగ అంటే చిచ్చు బుడ్లు కానీ వాళ్లకు మాత్రం సారా బుడ్లు అని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అసలు దీపావళి దావత్ అలా చేస్తారు అని మాకు తెలియదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బామ్మర్ది రాజు పాకాల విందు పై సీఎం స్పందించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్ పాకాల ఏం చేయక పోతే ఎందుకు పారిపోయారని, ముందస్తు బెయిల్ ఎందుకు అడిగారని ఆయన నిలదీశారు. ఇంటి దావత్ చేస్తే క్యాసినో కాయిన్స్, విదేశీ మద్యం ఎందుకు దొరికాయని ప్రశ్నించారు. మూసీపై మాట్లాడుతూ... ఎవ్వరు ఎంత అడ్డుకున్నా కూడా మూసీని పునరుజ్జీవం చేసి తీరుతామన్నారు. మొదటి దశ 21 కిలో మీటర్ల వరకు అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. గండిపేట, హిమాయత్‌సాగర్ ల నుండి బాపుఘాట్ వరకు మొదటి దశ పనులు చేపడతామని, నెల రోజుల్లో డిజైన్లు పూర్తి అవుతాయన్నారు. మల్లన్న సాగర్ నుండి గోదావరి జలాలను తెచ్చి గండిపేటలో ఎత్తి పోస్తామని తెలిపారు. దీనికి సంబంధించి ట్రంక్ లైన్ కోసం నవంబర్ మొదటి వారంలో టెండర్లు పిలుస్తామని అన్నారు. బాపుఘాట్ వద్ద ప్రపంచంలోనే ఎతైన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, బాపుఘాట్ వద్ద బ్రిడ్జి కం బ్యారేజి నిర్మాణం చేపడతామని చెప్పారు. అక్కడ అభివృద్ధి కోసం ఆర్మీ ల్యాండ్ కూడా ఆడిగామని, 15 రోజుల్లో ఎస్టీపిలకు టెండర్లు పిలుస్తామన్నారు. మూసిని ఎకో ఫ్రెండ్లీ అండ్ వెజిటేరియన్ కాన్సెప్ట్ తో అభివృద్ధి చేస్తామని, మూసీ వెంట అంతర్జాతీయ యూనివర్సిటీ, గాంధీ ఐడియాలజీ సెంటర్, రీక్రియేషన్ సెంటర్, నేచర్ క్యూర్ సెంటర్ లను ఏర్పాటు చేస్తామని వివరించారు.

కేసీఆర్ పై సీఎం మండిపాటు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఎక్స్పయిరీ అయిన మెడిసిన్ అని, హరీశ్‌ను, కేటీఆర్‌ను ఎలా డీల్ చేయాలో మాకు తెలుసునన్నారు. వాడపల్లి నుండి వికారాబాద్ వరకు పాదయాత్ర చేస్తానని... కావాలంటే దానికి కేటీఆర్, హరీష్ రావులు కూడా రావాలనని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. దారిపొడవునా మూసీ ని అభివృద్ధి చేయాలో లేదో ప్రజలని అడుగుదామని అన్నారు.



గత పాలకుల అప్పులు తీర్చే పనిలో ఉన్నాం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - హైదరాబాద్: గత పాలకులు ఏడు లక్షల కోట్ల అప్పు చేసి ఖర్చులు చేసి పోయారని... వాటిని తీర్చే పనిలో ప్రస్తుత ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం మధిర మండల కేంద్రంలో ఇందిరా పాల ఉత్పత్తి కేంద్రం లోగో ప్రారంభ సభలో ఆయన ప్రసంగించారు. ప్రతి నిమిషం ప్రజల కోసమే ఈ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది, ప్రతిరోజు 18 గంటల పాటు పనిచేస్తున్నాం. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజల అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని డిప్యూటీ సీఎం అన్నారు. సిరిపురంలో 26 కోట్ల అంచనా వ్యయంతో సిరిపురం నుండి నెమలి వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ, పటిష్టత పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మధిర రెడ్డి గార్డెన్స్‌లో ఇందిరా డెయిరీ లోగో ఆవిష్కరించి మహిళా సంఘాల సభ్యులతో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ మధిర అసెంబ్లీ సెగ్మెంట్ సంబంధించి మహిళల చేత పాల వ్యాపారం చేయించేందుకు 2011లో రూపకల్పన చేసుకున్న ఇందిరా మహిళా డెయిరీ ఆకాంక్ష నేడు నెరవేరుతుందన్నారు. దేశం మన వైపు చూసేలా ఇందిరా మహిళా డెయిరీ విజయం సాధించాలని గతంలో ఆహార ధాన్యాలు దొరకకపోవడం వల్ల దేశంలో కోట్ల మంది ప్రజలు ఆకలితో మరణించారని, దీనిని గమనించిన దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయానికి ప్రాధాన్యత కల్పించారని, ఆయన వేసిన పునాదులతో అనేక నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించు కున్నామని, దీని వల్ల నేడు మనకు సరిపోయే ఆహార ధాన్యలే కాకుండా ప్రపంచానికి ఎగుమతి చేసే స్థాయికి మన దేశం ఎదిగిందని అన్నారు. నాగార్జునసాగర్ బహుళార్థ సార్థక ప్రాజెక్టు ద్వారా మధిర నియోజక వర్గం పరిసర ప్రాంతాల్లో ఆయకట్టు నీరు రావడం వల్ల పంటలు పండిస్తూ, పిల్లలను చదివిస్తున్నారని అన్నారు. వ్యవసాయ ఆదాయానికి తోడు పాడి రైతుల ఆదాయం జత చేస్తే కుటుంబాలు మరింత నిలదొక్కుకుంటాయనే ఆలోచనతో ఇందిరా మహిళా మహిళా డెయిరీను 2011 లో రూపకల్పన చేయడం జరిగిందని అన్నారు. మధిర ప్రాంతం పరిధిలో వ్యవసాయాధారిత

- మిగతా 2 లో

హృదయవిదారకం

కొడుకు చనిపోయినట్లు తెలియక మృతదేహంతో 4 రోజులు గడిపిన దివ్యాంగ తల్లిదండ్రులు

హైదరాబాద్: తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో హృదయవిదారక ఘటన చోటు చేసుకుంది. తమ కుమారుడు చనిపోయినట్లు గ్రహించని దివ్యాంగులైన వృద్ధ తల్లిదండ్రులు అతని మృతదేహం పక్కనే నాలుగు రోజులు గడిపారు. కొడుకు వచ్చి భోజనం పెడతాడని ఆకలితో ఎదురు చూశారు. తమ వద్దనే కొడుకు నిర్జీవంగా పడి ఉండటాన్ని గ్రహించలేకపోయారు. ఇంట్లో

- మిగతా 2 లో

అవి కుటుంబ ఆస్తులే

- వైఎస్ బతికుండగా పంచలేదు
- నాకు ఇద్దరూ సమానమే
- నా పిల్లల గురించి తక్కువగా మాట్లాడొద్దు
- వైఎస్ విజయమ్మ బహిరంగ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమ్మగా నాకు (వైఎస్ జగన్, షర్మిల) ఇద్దరూ సమానమేనని... అలాగే రాజశేఖర్ రెడ్డి మాట సమానమేనని, ఆస్తులు కూడా ఇద్దరికీ సమానం అనేది నిజమని వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు. నలుగురు చిన్నబిడ్డలకు సమానంగా ఆస్తి ఉండాలన్న వైఎస్ఆర్ ఆజ్ఞ నిజం అని, ఆస్తులు వృద్ధిలోకి తేవడంలో జగన్ కష్టం ఉందనేది వాస్తవమని విజయమ్మ స్పష్టంచేశారు. కానీ అన్ని ఆస్తులు కుటుంబ ఆస్తులే అన్నది నిజం అని స్పష్టం చేశారు. జగన్ బాధ్యత గల కొడుకుగా కుటుంబ ఆస్తులను సంరక్షించాలనేదీ నిజమని ఆమె తెలిపారు. ఇప్పుడు జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే మనసుకి చాలా బాధేస్తుందన్నారు. ఈ వ్యవహారంలో నేను అడ్డుకోవడానికి ఎంత ప్రయత్నించినా, జరగకూడనివి అన్ని నా కళ్లముందే జరిగిపోతున్నాయని వాపోయారు. ఈ కుటుంబం గురించి ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్ల

- మిగతా 2 లో

రుణమాఫీపై తాత్సారమేంటి?

- రీ షెడ్యూల్ కాని రుణాలకూ వర్తింపజేయాలి
- ఖరీఫ్ సహా రైతు భరోసాను విడుదల చేయాలి
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు
- రైతు సంఘం-సీపీఐ అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

విశాలాంధ్ర-ఖమ్మం: రైతు రుణమాఫీ విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాత్సారంచేయడమే కాకుండా దాటవేత ధోరణిని అవలంభిస్తోందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు విమర్శించారు. రుణమాఫీ విషయంలో గందరగోళం నెలకొందని, రూ.లక్ష లోపు రుణం ఉన్న రైతులకు

- మిగతా 2 లో

సస్పెండ్ చేసిన పోలీసులను విధుల్లోకి తీసుకోవాలి: కూనంనేని

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఇటీవల సర్వీసు నుంచి డిస్మిస్ అయిన పది మంది, సస్పెండైన 37 మంది బెటాలియన్ పోలీసులను తిరిగి సర్వీసులోకి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సెలవులు ఇవ్వకపోవడం, డ్యూటీలో భాగం కాని పనులను చేయించడంతో తీవ్ర నిస్పృహతో బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబాలు రోడ్డెక్కాయని... దీనిని మానవత్వ దృక్పథంతో అర్థం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి కూనంనేని విజ్ఞప్తి చేశారు. డ్యూటీతో సంబంధం లేని మట్టి పనులు, పైపులు ఎత్తించే పనులను, అనధికారికంగా ఆర్డర్లీ సేవలకు వినియోగించే వలసకాలపు ధోరణులను సమూలంగా తొలగించాలని, సివిల్ పోలీసులకు మాదిరిగా ఒకే పోలీసుల విధానం అమలు చేయాలనే బెటాలియిన్ పోలీసుల డిమాండ్ పరిశీలించాలని కోరారు. యూనిఫామ్ సిబ్బంది రోడ్డెక్కడంపై నిబంధనలు ఉన్నప్పటికీ, వారి సమస్యలు న్యాయమైనవేనని... వాటిని దీర్ఘకాలంగా పరిష్కరించకపోవడంతోనే అసంతృప్తి పెల్లుబికిందనే అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. వారి చర్యలను క్షమాగుణంతో అర్థం చేసుకొని డిస్మిస్, సస్పెండ్ అయిన సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, బెటాలియన్ పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం ద్వారా వారి కుటుంబాలలో వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందన్నారు. తద్వారా బెటాలియన్ పోలీసులు మరింత ఉత్సాహంగా విధులు నిర్వహిస్తారని, సమస్య పరిష్కరించకుండా అణిచివేస్తే, గూడు కట్టుకున్న అసంతృప్తి భవిష్యత్తులో కూడా బద్దలయ్యే ప్రమాదం ఉంటుందనే విషయాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. తక్షణమే ప్రభుత్వం న్యాయమైన అంశాలను పరిష్కరించాలని కోరారు.

బీజేపీకి రెబల్స్ తంటా

- బుజ్జగింపులకు లొంగని నేతలు
- అధిష్ఠానానికి తలనొప్పి

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీకి రెబల్స్ బెడద తలనొప్పిగా మారింది. బీజేపీ-శివసేన-ఎన్సీపీ (అజిత్‌పవార్) నేతృత్వంలోని మహాయుతి, కాంగ్రెస్-శివసేన (యూబీటీ)- ఎన్సీపీ (శరద్ పవార్) నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ మధ్య పోరు ఆసక్తిగా మారింది. అయితే, మహాయుతికి పెద్దన్నలా వ్యవహరిస్తున్న బీజేపీతో పాటు కూటమిలోని మిగతా పార్టీలకు రెబల్స్ బెంగ పట్టుకుంది. పొత్తుల్లో భాగంగా పార్టీ సీనియర్ నేతలకు కోరుకున్న స్థానాల్లో బీజేపీ సీట్లు కేటాయించలేకపోయింది. దీంతో వారంతా స్వతంత్రులుగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. కీలక నియోజకవర్గాలైన బొరివలి, ముంబాదేవి, అకోలా పశ్చిమ నియోజకవర్గాల్లో ముఖ్యమైన నేతలు తిరుగుబావుటా ఎగురవేయడం పార్టీ అధిష్ఠానాన్ని చిక్కుల్లో పడేసింది. ముంబైకి చెందిన బీజేపీ సీనియర్ నేత గోపాల్ శెట్టి బొరివలి నియోజకవర్గ టికెట్ ఆశించారు. అయితే, ఆ స్థానాన్ని అదే నియోజకవర్గానికి చెందిన సంజయ్ ఉపాధ్యాయ్‌కు కేటాయించారు. దీంతో గోపాల్ శెట్టి బహిరంగంగానే తన అసహనం వ్యక్తం చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బొరివలి నుంచే బరిలోకి దిగనున్నట్లు ప్రకటించారు. ఆయనను

- మిగతా 2 లో

ఏపీ విజిలెన్స్ కమిషనర్‌గా అనిల్ చంద్ర పునీఠా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ కమిషన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ (1984) అనిల్ చంద్ర పునీఠా నియమితులయ్యారు. ఆయన నియామకానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదం తెలిపారు. పునీఠా నియామకానికి సంబంధించి మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజంపేట సబ్ కలెక్టర్‌గా తొలుత బాధ్యతలు చేపట్టిన అనిల్ చంద్ర పునీఠా ఆ తర్వాత శ్రీకాకుళం కలెక్టర్‌గా, ఉద్యాన, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌గా, పంచాయతీరాజ్,

- మిగతా 2 లో

విద్యుత్ భారాన్ని అడ్డుకున్నాం: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై రుద్దాలనుకున్న రూ. 18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ఆపిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రజల తరపున రెండ్రోజులు సంబురాలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పది సంవత్సరాల్లో ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచని మన ప్రభుత్వానికి భిన్నంగా కేవలం 10 నెలల్లోనే 18,500 కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను ప్రభుత్వం చేస్తే ప్రధాన ప్రతిపక్షంగా వాటిని వ్యతిరేకిస్తూ... ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని ఈఆర్‌సీని ఒప్పించగలిగామని కేటీఆర్ అన్నారు. మొత్తం ఉమ్మడి రాష్ట్ర చరిత్ర నుంచి మొదలుకొని ఇప్పటిదాకా ప్రధాన ప్రతిపక్షం వాదనలోని సహేతుకతను, న్యాయాన్ని విని సంపూర్ణంగా చార్జీల పెంపు ప్రతిపాదనలను ఈ ఆర్ సి తిరస్కరించడం ఇదే మొదటిసారి అని కేటీఆర్ తెలిపారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకను వినిపించిన ఇలాంటి సందర్భం చారిత్రాత్మకం అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలపై అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని సరైన పద్ధతిలో అడ్డుకోవడంలో విజయం సాధించామన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు స్వయంగా తనతో పాటు

- మిగతా 2 లో

ఏఐ రాజధానిగా అమరావతి

సహకరించాలని సత్య నాదెళ్లకు లోకేశ్ వినతి

యాపిల్ వైస్ చైర్మన్-అడోబ్ సీఈవోతోనూ చర్చలు

2లో

యూఎన్ఆర్‌డబ్ల్యూఏపై ఇజ్రాయిల్ నిషేధం

రెండు చట్టాలకు చట్టసభ ఆమోదం

ఇది దుర్మార్గం: ప్రపంచ దేశాలు

జెరూసలేం: గాజాకు జీవనరేఖగా ఉన్న పలస్తీనా శరణార్థుల కోసం ఐరాస సంస్థ (యూఎన్ఆర్‌డబ్ల్యూఏ)పై ఇజ్రాయిల్ నిషేధం విధించింది. ఈ సంస్థ ఇకపై ఇజ్రాయిల్ అధీన ప్రాంతాల్లో మానవతా సేవలను అందించేందుకు వీల్లేకుండా చట్టాలు తెచ్చింది. వీటికి ఇజ్రాయిల్ పార్లమెంటు ఆమోదించింది. గాజాలో వందల మంది పౌరులకు ఆశ్రయం కల్పించే యూఎన్ఆర్‌డబ్ల్యూఏ స్కూళ్లపై ఇజ్రాయిల్ దాడులు చేసిన విషయం తెలిసిందే. గాజాలో ఇజ్రాయిల్ ఇప్పటివరకు 200 మందికిపైగా యూఎన్ఆర్‌డబ్ల్యూఏ ఉద్యోగులను హతమార్చింది. యూఎన్ఆర్‌డబ్ల్యూఏను ఉగ్ర సంస్థగా ముద్ర వేసింది. దౌత్యపరంగా తెగతెంపులు చేసుకొన్నట్లు ప్రకటించింది. పలస్తీనా శరణార్థుల కోసం ఐరాస సంస్థ (యూఎన్ఆర్‌డబ్ల్యూఏ) ఇజ్రాయిల్‌లో ఎలాంటి కార్యకలాపాలను చేపట్టేందుకు వీల్లేదంటూ తెచ్చిన మొదటి చట్టాన్ని ఇజ్రాయిల్ చట్టసభ ఆమోదించింది. అలాగే ఆ సంస్థతో ఇజ్రాయిల్‌కు దౌత్యపరంగా సంబంధాలు ఉండకుండా రెండో చట్టానికీ ఆమోదం లభించింది.

మరిన్ని కష్టాల్లోకి పలస్తీనియన్లు: ఫిలిప్ లజారిని

ఇజ్రాయిల్ తమ సంస్థపై నిషేధం విధించడాన్ని యూఎన్ఆర్‌డబ్ల్యూఏ అధినేత ఫిలిప్ లజారిని ఖండించారు. యూఎన్ఆర్‌డబ్ల్యూఏను అప్రతిష్ఠపాల్జేసే చర్యల్లో ఇది భాగమన్నారు. ఇజ్రాయిల్ కొత్త బిల్లులతో పలస్తీనియన్లు ముఖ్యంగా గాజాలో ఉన్న వారి ఇబ్బందులు మరింత పెరుగుతాయని ఎక్స్ మాధ్యమంగా ఆవేదన వ్యక్తంచేశారు. యూఎన్ఆర్‌డబ్ల్యూఏకు ప్రత్యామ్నాయం లేదంటూ ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ స్పష్టంచేశారు. ఇజ్రాయిల్ ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌తో సహా పశ్చిమాసియాలో పలస్తీనియన్ల శరణార్థులు లక్షల మందికి కనీస సేవలు, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి మౌలిక వసతులను యూఎన్ఆర్‌డబ్ల్యూఏ కల్పిస్తోందన్నారు.

ప్రపంచ దేశాల ఖండన

యునైటెడ్ నేషన్స్ రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ ఫర్ పలస్తీనా రిఫ్యూజీస్ (యూఎన్ఆర్‌డబ్ల్యూఏ)పై ఇజ్రాయిల్ నిషేధం విధించడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రపంచ దేశాలు ఖండించాయి. ఇది అమోదయోగ్యం కాదని... మరణదండన విధించడంతో సమానమని ఆక్షేపించాయి. ఇజ్రాయిల్ ఫాసిస్టు దేశంగా మారిపోవడాన్ని తాజా పరిణామం అద్దం పట్టిందని, దీనిని అడ్డుకుంటామని పలస్తీనా పేర్కొంది. అంతర్జాతీయ చట్టాన్ని ఇజ్రాయిల్ అతిక్రమిస్తోందని టర్కీ వ్యాఖ్యానించింది. ఇజ్రాయిల్ నిర్ణయం దుర్మార్గమైనదని ఐరాసకు చైనా రాయబారి ఫు కాంగ్ అన్నారు. గాజాలోని పలస్తీనా ప్రజలకు జీవనరేఖగా యూఎన్ఆర్‌డబ్ల్యూఏ పాత్ర కీలకమని న్యూయార్క్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయనన్నారు. గాజా పరిస్థితి మరింత దిగజార్చేలా ఇజ్రాయిల్ నిర్ణయం ఉందని రష్యా రాయబారి వసిలీ నెబెన్జియా అభిప్రాయపడ్డారు. యూఎన్ఆర్‌డబ్ల్యూఏ సేవలకు కట్టుబడి ఉన్నట్లు నిరూపించేందుకు ఆ సంస్థకు పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఇజ్రాయిల్‌కు మిత్రపక్షమైన అమెరికాకు పిలుపునిచ్చారు. పలస్తీనియన్ల కోసం ఐరాస పని చేయడానికి వీల్లేకుండా ఇజ్రాయిల్ చేస్తోందని... ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్ అన్నారు. అంతర్జాతీయ చట్టాలను ఇజ్రాయిల్ అతిక్రమిస్తోందని జోర్డాన్ ప్రభుత్వం వ్యాఖ్యానించింది. ఐర్లాండ్, నార్వే, స్లోవేనియా, స్పెయిన్ (యూరోపియన్)తో పాటు ఆస్ట్రేలియా, బెల్జియం, స్విట్జర్లాండ్ దేశాలు కూడా ఇజ్రాయిల్ నిర్ణయం సహించలేనిదిగా వ్యాఖ్యానించాయి. అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడాలని, గాజాలో మానవతా సాయాన్ని అడ్డుకోవద్దని హితవు పలికాయి. యూఎన్ఆర్‌డబ్ల్యూఏపై ఆధారపడే జీవితాలకు విఘాతం కలిగిస్తూ ఇజ్రాయిల్ నిర్ణయం తీసుకున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) డైరెక్టర్ జనరల్ ట్రెడోస్ అధానోమ్ ఘెబ్రియేసెస్ వ్యాఖ్యానించారు. ఏడు దశాబ్దాలుగా పలస్తీనియా ప్రజలకు జీవనరేఖగా ఉన్న యూఎన్ఆర్‌డబ్ల్యూఏపై నిషేధం ఆమోదయోగ్యం కాదని ఆయన స్పష్టంచేశారు.

నయీం ఖాసీంకు హెజ్బుల్లా పగ్గాలు

బీరుట్/జెరూసలేం/దుబాయ్: హెజ్బుల్లా అధినేతగా నయీం ఖాసీం ఎన్నికయ్యారు. లెబనాన్ హెజ్బుల్లా మూవ్‌మెంట్ పగ్గాలను నయీం ఖాసీం చేపడుతున్నట్లు అధికార వర్గాలు మంగళవారం ప్రకటించాయి. ఇజ్రాయిల్ గతనెలలో దక్షిణ బీరుట్‌లో జరిపిన దాడిలో హసన్ నస్రల్లా చనిపోయారు. ఆయన స్థానంలో నయీంకు బాధ్యతలను అప్పగించాది. నస్రల్లా చనిపోయినప్పటి నుంచి ఆపద్ధర్మ నాయకుడిగా నయీం ఖాసీం ఉన్నారు. నస్రల్లాతో కలిసి దీర్ఘ కాలం పనిచేసిన షేక్ నయీం ఖాసీంను హెజ్బుల్లా సెక్రటరీ జనరల్‌గా ఎన్నుకునేందుకు హెజ్బుల్లా (పరిపాలన) షురా మండలి అంగీకరించినట్లు ఇరాన్ అధికారిక ప్రకటన వెల్లడించింది. విజయం వరించేంత వరకు నస్రల్లా విధానాలకు కట్టుబడాలని హెజ్బుల్లా సంకల్పించిన విషయం విదితమే.

ఉత్తర గాజాలో ఇజ్రాయిల్ దాడి: 93 మంది మృతి

ఉత్తర గాజాలోని బెయిత్ లహియా ప్రాంతంలోని ఐదంతస్తుల నివాస భవనంపై ఇజ్రాయిల్ వైమానిక దాడి చేసింది. ఈ దాడిలో 93 మంది చనిపోయారు. మృతుల్లో పిల్లలు ఉన్నారు. పదుల సంఖ్యలో క్షతగాత్రులు ఉన్నాయి. 40 మందికిపైగా ఆచూకీలేరు. అలాగే తూర్పు లెబనాన్‌లోనూ ఇజ్రాయిల్ బలగాలు జరిపిన దాడుల్లో మరొక 60 మంది చనిపోయారు. ఈ మేరకు లెబనాన్ ప్రజారోగ్య శాఖ తెలిపింది. గాజాలో ఇప్పటివరకు 43,020 మంది చనిపోగా, 1,01,110 మంది గాయపడ్డారు. మృతుల్లో 17వేల మంది చిన్నారులు, 11,400 మంది

మహిళలు ఉన్నారు. 174 మంది జర్నలిస్టులు, వెయ్యి మంది వైద్యారోగ్య సిబ్బందిని కూడా ఇజ్రాయిల్ హతమార్చింది. అటు లెబనాన్‌లో 127 మంది పిల్లలు సహా 2,710 మంది చనిపోగా 12,592 మందికి గాయాలయ్యాయి.

ఇజ్రాయిల్‌పై హౌతీల డ్రోన్ల దాడి

యెమెన్‌లోని హౌతీలు ఇజ్రాయిల్‌లోని యాష్కెలాన్ నగరంలోగల పారిశ్రామిక జోన్‌పై డ్రోన్లతో దాడి చేశాయి. ఇజ్రాయిల్ భూభాగాన్ని దాటుకొని ఓ బహిరంగ ప్రాంతంలో డ్రోన్ పడిందని, యాష్కెలాన్‌లో మంగళవారం ఉదయం సైరెన్లు మోగాయని ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. హౌతీలను ఉగ్రవాదులుగా పేర్కొంటూ వారి చర్యలను ఖండించింది. గతేడాది నవంబరు నుంచి ఎర్ర సముద్రంలో రవాణా నౌకలపై హౌతీలు దాడులు చేస్తున్నారు. గాజా, లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా, పలస్తీనియన్లకు సంఘీభావంగా హౌతీలు దాడులు సాగిస్తున్న విషయం విదితమే.

ఉచిత గ్యాస్ బుకింగ్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దీపావళి కానుకగా దీపం-2 పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలెండర్ల కోసం మంగళవారం నుంచి బుకింగ్ ప్రారంభమైంది. ప్రతి రోజు కంటే మూడు రెట్లు ఎక్కువ మంది వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా గ్యాస్ బుక్ చేసుకున్నారు. బుకింగ్ అయిన 48 గంటల్లో గ్యాస్ సిలెండర్ ఇచ్చేలా హెచ్‌పీసీఎల్, ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం కంపెనీలతో ఇప్పటికే ప్రభుత్వం చర్చించింది. సిలెండర్ అందించిన క్షణం నుంచి 48 గంటల్లోపు లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ కానుంది. దీంతో ఉదయం పది గంటల నుంచే వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్ద బుకింగ్‌ల కోసం బారులు తీరారు. ఈ పథకం ద్వారా నాలుగు నెలలకొకటి చొప్పున ఏటా మూడు సిలెండర్లను ఉచితంగా ఇస్తారు. నవంబరు, డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన మొదటి సిలెండర్ బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. ఈ నెల 31 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సిలెండర్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో 1.55 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. దీనిని పొందేందుకు ఎల్పీజీ కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు సమర్పించాలని ప్రభుత్వం సూచించింది. ఈనెల 31 నుంచి 2025 మార్చి 31 లోపు తొలి ఉచిత గ్యాస్ సిలెండర్ పొందే అవకాశం ఉంది. రెండో విడతలో ఏప్రిల్ 1 నుంచి జులై 30 వరకూ, మూడో విడతలో ఆగస్టు 1 నుంచి నవంబరు 31 వరకు, నాలుగో విడత 2025 డిసెంబరు 1 నుంచి 2026 మార్చి 31 వరకు బుకింగ్ చేసుకునే సౌకర్యాని ప్రభుత్వం కల్పించింది. మూడు ఉచిత గ్యాస్ సిలెండర్ పథకానికి 2,684 కోట్లు వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. పట్టణాల్లో 24 గంటల్లోగా, పల్లెల్లో అయితే 48 గంటల్లోనే సిలెండర్ అందించే ఏర్పాటు చేసింది.

ఏఐ రాజధానిగా అమరావతి

- **సహకరించాలని సత్య నాదెళ్లకు లోకేశ్ వినతి**
- **యాపిల్ వైస్ చైర్మన్-అడోబ్ సీఈవోతోనూ చర్చలు**

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కృత్రిమ మేధ (ఏఐ) రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇందుకోసం ప్రపంచ సాఫ్ట్‌వేర్ దిగ్గజం, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల సహకారాన్ని కోరారు. రెడ్ మండ్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయనతో మంత్రి సమావేశమయ్యారు. క్లౌడ్-ఆధారిత ప్లాట్‌ఫాంలను అమలు చేయడం, డేటా అనలిటిక్స్ కోసం ఏఐ ఉపయోగించడం, సైబర్ భద్రతను మెరుగుపర్చడం, స్మార్ట్ సిటీ అభివృద్ధి వంటి డిజిటల్ గవర్నెన్స్ విధానాలకు మైక్రోసాఫ్ట్ సహకారాన్ని కోరుతున్నామని లోకేశ్ తెలిపారు. ఏఐ ప్రాజెక్టులకు అనువుగా ఉన్న

అమరావతిని దేశానికి ఏఐ క్యాపిటల్‌గా తయారు చేస్తామని, ఇందులో భాగంగానే ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, డైనమిక్ టెక్ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యం, ఆవిష్కరణల కోసం ఏపీ ప్రభుత్వంతో కలసి పనిచేయాల్సిందిగా సత్య నాదెళ్లను లోకేశ్ కోరారు. రాష్ట్రంలోని మౌలిక సదుపాయాలు, సాంకేతిక పర్యావరణ వ్యవస్థను పరిశీలించి, పెట్టుబడులకు గల అవకాశాలను పరిశోధించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఏపీలో డిజిటల్ ట్రాన్సఫర్మేషన్, ఏఐ రంగాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని సత్య నాదెళ్ల చెప్పారు.

అడోబ్ సీఈవోతో భేటీ

ఏపీలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా అడోబ్ సీఈవో శంతన్ నారాయణ్‌తో శాన్ ఫ్రాన్సిస్కోలో భేటీ సందర్భంగా లోకేశ్ కోరారు. ఏపీలో అడోబ్ ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, యువతను డిజిటల్ నైపుణ్యాలతో శక్తివంతం చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నామని తెలిపారు. డిజిటల్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫారంలను రాష్ట్రానికి తీసుకురావడానికి అడోబ్ సహకారాన్ని కోరారు. డాక్యుమెంట్ ప్రొడక్టివిటీ, ఏఐ పవర్డ్ టూల్స్‌లో అడోబ్ నైపుణ్యం తమకు ఎంతగానో ఉపకరిస్తుందని మంత్రి లోకేశ్ అన్నారు.

యాపిల్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

యాపిల్ సంస్థ కేంద్ర కార్యాలయాన్ని మంత్రి నారా లోకేశ్ సందర్శించారు. ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) ప్రియా బాలసుబ్రహ్మణ్యంతో శాన్ ఫ్రాన్సిస్కోలోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. 'ఏపీలో ఉన్న నాలుగు ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లలో మీకు అనుకూలమైన ప్రాంతాన్ని అన్వేషించండి. మీరు కోరుకున్న చోట తయారీ కేంద్రం స్థాపనకు అన్ని సదుపాయాలు కల్పించడానికి సిద్ధంగా ఉన్నాం. ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ టెక్నాలజీ, మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దడానికి చిత్తశుద్ధితో యత్నిస్తున్నాం. ఇందుకు మీ సంస్థ సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని లోకేశ్ అన్నారు. లోకేశ్ వెంట ప్రతినిధి బృంద సభ్యులు కార్తికేయ మిశ్రా, సాయికాంత్ వర్మ ఉన్నారు.

బీజేపీకి రెబల్స్ తంటా

(మొదటిపేజీ తరువాయి)

బుజ్జగించేందుకు పార్టీ సీనియర్ నేత ఆశిష్ షెలార్ చర్చలు జరిపారు. అయినప్పటికీ... తన నిర్ణయం మారబోదని గోపాల్‌శెట్టి స్పష్టం చేశారు. ముంబాదేవి నియోజకవర్గంలోనూ ఇదే తరహా పరిస్థితి తలెత్తింది. బీజేపీకి చెందిన షైనా అనే నేత అప్పటికప్పుడు శివసేన (షిండే)లో చేరి ముంబాదేవి స్థానం నుంచి బరిలోకి దిగుతున్నారు. నిజానికి షైనా 'వర్లి' స్థానం నుంచి పోటీ చేయాలని భావించారు. కానీ, బీజేపీ అధిష్ఠానం ఆమెకు ముంబాదేవి నుంచి పోటీచేయాలని ఆదేశించింది. స్థానిక పరిస్థితుల దృష్ట్యా బీజేపీ నుంచి అక్కడ విజయం అంతసులభం కాదని గ్రహించిన షైనా... వెంటనే శివసేనలో చేరి... అక్కడి నుంచే బరిలోకి దిగుతున్నారు. కాంగ్రెస్‌కు చెందిన అమిన్ పాటిల్‌పై పోటీ చేస్తున్నారు. షైనా నిర్ణయం బీజేపీకి తలనొప్పి తెచ్చి పెట్టింది. ఆమె నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన బీజేపీ నేత అతుల్ షా... స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలని నిర్ణయించుకున్నారు. ఒకవేళ అదే జరిగితే... షైనాకు అతుల్‌షా నుంచి ఎదురుదెబ్బ తగిలే అవకాశముంది. ఫలితంగా మహాయుతి ఓట్లు చీలిపోయి... కాంగ్రెస్ అభ్యర్థికి సానుకూల ఫలితం రావొచ్చు. అకోలా పశ్చిమ నియోజకవర్గంలో బీజేపీ సీనియర్ నేత హరీశ్ అలిమ్ చందానీ నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మాజీ మేయర్ విజయ్ అగర్వాల్‌కు ఈ స్థానం కేటాయించడంతో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన హరీశ్... ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఓట్లు చీలిపోయి, ప్రత్యర్థికి అవకాశం ఇచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరోవైపు బాంద్రా తూర్పు నియోజకవర్గంలోనూ మహాయుతికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ఈ స్థానాన్ని ఎన్సీపీ (అజిత్‌పవార్)కు కేటాయించగా... జీశాన్ సిద్ధిఖీని అభ్యర్థిగా ఖరారు చేశారు. ఈ స్థానం ఆశించిన శివసేన (షిండే)కు చెందిన కునాల్ శర్మల్కర్ దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదేస్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. వీళ్లే కాకుండా... సీట్ల పంపకాల్లో పారదర్శకత లోపించిందంటూ మహాయుతికి చెందిన చాలామంది నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చాలాచోట్ల స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగేందుకు సిద్ధం కాగా, మరికొన్ని చోట్ల సహాయ నిరాకరణ చేస్తున్నారు. వారిని బుజ్జగించేందుకు మహాయుతి కీలక నేతలు సంప్రదింపులు జరుపుతున్నారు.

హృదయవిదారకం

(మొదటిపేజీ తరువాయి)

దుర్వాసన వస్తున్నప్పటికీ ఏదో జీవి చనిపోయిందనుకున్నారే తప్ప అది తమ కుమారుడు మృతదేహం నుంచి వస్తుందని తెలుసుకోలేని స్థితిలో నాలుగు రోజులు గడప దాటలేదు. ఇంట్లో నుంచి ఎవరూ బయటకు రాకపోవడం... దుర్వాసన వస్తుండటంతో చుట్టుపక్కల వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఒకవైపు కుళ్లి పోయిన స్థితిలో మృతదేహం... మరోవైపు ఏమి తెలియని స్థితిలో వృద్ధ దంపతులు ఉండటాన్ని చూసిన పోలీసులు చలించిపోయారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియాకు తరలించారు. వృద్ధ తల్లిదండ్రులను ఇంటి నుంచి బయటకు తెచ్చి భోజనం పెట్టించారు. ఆపై వారి పెద్ద కుమారుడైన ప్రదీప్‌కు సమాచారమిచ్చారు. ప్రదీప్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నాగోల్, జైపురికాలనీ, బ్లైండ్స్‌కాలనీలో ఉండే రమణ (59), శాంతకుమారి (64)కి ఇద్దరు కుమారులు కె.ప్రదీప్‌కుమార్, కె.ప్రమోద్‌కుమార్ (32). రమణ, శాంతకుమారి ఇద్దరికి కంటి చూపులేదు.. రమణ గిరిజన సంక్షేమ ఉద్యోగి.. కంటి చూపు లేక వేరే వ్యక్తిని తన ఉద్యోగంలో సహాయకుడిగా పెట్టుకున్నారు. పెద్ద కుమారుడు భార్యతో కలిసి వేరుగా ఉంటారు. వృత్తిరీత్యా పెయింటర్ అయిన చిన్న కుమారుడు ప్రమోద్ కుమార్ తల్లిదండ్రుల వద్ద ఉంటాడు. మద్యానికి బానిస కావడంతో ఇతనిని నాలుగేళ్ల కిందట భార్య వదిలేసింది. ప్రమోద్ కుమార్‌కు తరచూ ఫిట్స్ వచ్చేవి. తండ్రి జీతంపై ఆధారపడి జీవించేవాడు. నాలుగు రోజుల కిందట మద్యం మత్తులో ఇంటికి వచ్చిన ప్రమోద్ కుమార్‌కు ఫిట్స్ రావడంతో మృతి చెందాడు.

అవి కుటుంబ ఆస్తులే

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతున్నారని, అబద్ధాల పరంపర కొనసాగుతోందన్నారు. తెలిసి కొంత, తెలియకుండా కొంత మాట్లాడుతున్నారని, అవి ఎక్కడెక్కడికో పోతున్నాయన్నారు. నా పిల్లలిద్దరికీ కాదు, చెప్పాలంటే ఇది రాష్ట్రానికి కూడా మంచిది కాదని, నేను మీ ముందుకు ఈ విషయంగా రాకూడదని అనుకున్నప్పటికీ, రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వైఎస్ఆర్‌కు మేమెంతో, మీరు కూడా అంతేనని ఆమె తెలిపారు. ఈ కుటుంబం గురించి తప్పుగా మాట్లాడే వారందరినీ ఒకటి అడుగుతున్నానని, ఈ కుటుంబాన్ని ప్రేమించిన వారు మీరు అని, మా జీవితంలో మీరందరూ భాగమే అనుకుంటున్నానని పేర్కొన్నారు. ఆయన మమ్మల్ని ఎలా ప్రేమించారో, మిమ్మల్ని అంతగానే ప్రేమించారన్నారు. రాజశేఖర్ రెడ్డి మన మధ్యనుంచి వెళ్లిపోయాక మీరు నా పిల్లలను, ఆయన ఉన్నప్పటి కంటే ఎక్కువగా ప్రేమించి, ఆదరించి అక్కున చేర్చుకున్నానని గుర్తుచేశారు. దానికి నేను ఎన్నటికీ మరిచి పోలేనని, అందుకు నా జన్మంతా మీకు రుణపడి ఉంటానంటూ ఆమె హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రెండు చేతులు ఎత్తి మనవి చేసుకుంటున్నానని, దయచేసి ఈ కుటుంబం గురించి, నా పిల్లల గురించి తక్కువ చేసి మాట్లాడవద్దని, ముఖ్యంగా సోషల్ మీడియాలో కల్పిత కథలు రాయవద్దు అని, దూషణలు చేయవద్దు అని విజ్ఞప్తి చేశారు. ఈ కుటుంబం మీద నిజమైన ప్రేమ ఉంటే, ఇంతకంటే ఎక్కువ మాట్లాడవద్దని, మీరెవరూ రెచ్చ గొట్టవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. నేను నమ్మిన దేవుడే..నా బిడ్డల సమస్యలకు పరిష్కారం చూపిస్తాడన్న నమ్మకం నాకుందన్నారు. వైఎస్ బతికి ఉండగానే ఆస్తులు పంచేశారన్నది అవాస్తవమని ఆమె పేర్కొన్నారు. ఇటీవల వైవీ సుబ్బారెడ్డి, విజయ సాయిరెడ్డి ఇతరులు అందరూ మాట్లాడుతూ, వైఎస్ఆర్ బ్రతికి ఉండగానే ఆస్తులు పంచేశారని వ్యాఖ్యానించడం అవాస్తవమని ఆమె తెలిపారు. వైఎస్ఆర్ పిల్లలు ఇద్దరు పెరుగుతున్న రోజుల నుంచి, కొన్ని ఆస్తులు షర్మిల పేరు మీద, కొన్ని ఆస్తులు జగన్ పేరు మీద పెట్టారని వివరించారు. అది ఆస్తులు పంచడం ముమ్మాటికీ కాదని, వైఎస్ఆర్ బ్రతికి ఉండగానే షర్మిలకు ఆస్తులు ఇచ్చేశారని లిస్ట్ చదివారని, అలాగే జగన్ పేరు మీద పెట్టిన ఆస్తుల లిస్ట్ చదివి ఉండాల్సిందని వారికి విజయమ్మ సూచించారు. ఆడిటర్‌గా ఉన్న విజయసాయిరెడ్డికి అన్నీ తెలుసు అని తెలిపారు. వైవీ సుబ్బారెడ్డి ఈ ఇంటి బంధువుగా ఎంఓయూపై సాక్షి సంతకం చేశారని, అయినా మీడియాలో అవాస్తవాలు మాట్లాడటం నాకు చాలా బాధ కలిగించిందన్నారు. అబద్ధాల పరంపర కొనసాగకుండా ఉండటానికి సూటిగా నిజం చెబుతున్నానని, వారిద్దరూ నా పిల్లలు అని, వారిని నేను, వైఎస్ఆర్ ఎంతో అపురూపంగా ప్రేమగా పెంచుకున్నామని పదేపదే లేఖలో ఆమె పునరుద్ఘాటించారు.

ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి రక్త నమూనా సేకరించి ఎయిమ్స్‌కు అది తిరిగొచ్చింది. ఎయిమ్స్ నుంచి ఈ పీహెచ్‌సీ దాదాపు 15 కి.మీ దూరంలో ఉంది. గర్భిణి రక్త నమూనాలను సేకరించి నూతక్కి నుంచి ఎయిమ్స్ ఆసుపత్రికి కేవలం 9 నిమిషాల వ్యవధిలో తీసుకువచ్చారు. ఈ డ్రోన్ సేవలు వారంలో రెండుసార్లు అత్యవసరమైన వాటికి ఉపయోగపడేలా పనిచేస్తాయని అధికారులు తెలిపారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకం కింద ఎయిమ్స్ నుంచి నూతక్కి పీహెచ్‌సీలో ఉచితంగా రక్త నమూనాలతో పాటు అవసరమైన పరీక్షల కోసం డ్రోన్ ఉపయోగించనున్నట్లు వెల్లడించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డ్రోన్ల ఉపయోగంపై ఈ ప్రయోగాన్ని నిర్వహించామన్నారు. ధన్వంతరి జయంతి 9వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్-ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకం విస్తరణలో భాగంగా దాదాపు రూ.12,850 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రధాని దేశవ్యాప్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ మధుబానందకర్ పాల్గొన్నారు.

గత పాలకుల అప్పులు తీర్చే పనిలో ఉన్నాం

(మొదటిపేజీ తరువాయి)

జీవనం తప్ప మరో దారి లేదని, దీనిని మరింత అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. నాగార్జునసాగర్ తో పాటు కట్టలేరుపై, మున్నేరుపై ఆనకట్ట నిర్మించుకొని సాధ్యమైనంతవరకు వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకున్నామని, డ్రిప్ ఇరిగేషన్ కూడా తయారు చేసుకున్నా మని అన్నారు. మహిళలు పాడి పరిశ్రమ లపై దృష్టి సారించి ఆదాయం సంపాదించేలా స్వశక్తి మహిళా సంఘాలచే పాడి పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నా మని అన్నారు. కుటుంబం దగ్గర డబ్బులు ఉంటే పిల్లలను మంచి చదువులు చదివి స్తారని, చదువు కున్న పిల్లలు కుటుంబాల స్థితిగతులను పూర్తిగా మారుస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇందిరా మహిళా డెయిరీ ద్వారా మహిళలకే పాడి పశువులు అందించి, పాల సేకరణ నుంచి ప్యాకింగ్, బై ప్రోడక్ట్ (వెన్న, మజ్జిగ, పెరుగు, నెయ్యి, స్వీట్స్) ఉత్పత్తి, మార్కెటింగ్ చేసి లాభాలు పొంది మహిళలు పంచుకోవాలనే కలతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటు కోసం 9.5 ఎకరాల స్థలం సేకరించి భూమి పూజ కూడా చేశామని, ప్రత్యేక రాష్ట్ర విభజన ఉద్య మాలు, గత ప్రభుత్వం మహిళల పట్ల ఆలోచన లేకుండా ఈ డెయిరీనీ పక్కన పడేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు, డీఆర్డీవో, సన్యాసయ్య, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డా. వేణు మనోహర్, ఇందిరా మహిళా డెయిరీ చైర్మన్ అన్నపూర్ణ, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ విజిలెన్స్ కమిషనర్‌గా అనిల్ చంద్ర పునీఠా

(మొదటిపేజీ తరువాయి)

గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత భూపరిపాలన ప్రధాన కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన పునేఠా 2018 సెప్టెంబరు 28న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.

2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయనపై ఎన్నికల సంఘానికి వైసీపీ ఫిర్యాదు చేయడంతో 2019 ఏప్రిల్ 6న ఆయనను విధుల నుంచి ఈసీ తప్పించింది. పునేఠా స్థానంలో ఏప్రిల్ ఏడో తేదీన సీనియర్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.

2019 మే నెలలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో పునేఠా పదవీ విరమణ చేశారు. తర్వాత 2022 జనవరి ఐదో తేదీ నుంచి 2024 మే 9వ తేదీ వరకు ఉత్తరాఖండ్ చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు.

క్యాన్సర్ మందుల ధర తగ్గింపు

(మొదటిపేజీ తరువాయి)

ఈ మూడు మందులపై కస్టమ్స్ సుంకాన్ని రద్దు చేసింది. అలాగే జీఎస్టీ రేటు 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. ఇదే క్రమంలో మందుల ఎంఆర్‌పీ తగ్గించాలని తయారీదారులను ఎన్‌పీపీఏ ఆదేశించింది. తగ్గిన ధరలపై డీలర్లు, రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్లు, ప్రభుత్వాలకు సమాచారం ఇవ్వాలని కూడా ఆదేశాల్లో పేర్కొంది.

విద్యుత్ భారాన్ని అడ్డుకున్నాం: కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఇతర సీనియర్ నాయకులు రాష్ట్ర ఈఆర్సీ నీ కలిసి విద్యుత్ చార్జీల పెంపును ఆపాలని కోరామన్నారు. ఆ తర్వాత జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో మాజీ మంత్రులు ప్రశాంత్ రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారీ పాల్గొని ప్రజల తరఫున వాదనలను గట్టిగా వినిపించారన్నారని గుర్తు చేశారు. ఇక కాంగ్రెస్ మాపై చేస్తున్న రాజకీయ వేధింపుల ప్రహసనంలో గత రెండు రోజుల్లో జరిగిన పరిణామాలన్నీ ప్రారంభం మాత్రమే అని, రానున్న రోజుల్లో మరిన్ని వేధింపులు ఉంటాయని 'ఎక్స్' వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు. మద్దతుగా నిలిచిన పార్టీ శ్రేణులకు, సోషల్ మీడియా వారియర్లకి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేసే వ్యక్తిగత దాడులను, కుట్రలను, దుష్ప్రచారాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

రుణమాఫీపై తాత్సారమేంటి?

(మొదటిపేజీ తరువాయి)

కూడా మాఫీ వర్తించలేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, సీపీఐ అధ్వర్యంలో రైతుల రుణమాఫీని తక్షణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న రైతులను ఉద్దేశించి బాగం హేమంతరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల లోపు ఉన్న రైతుల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ అమలు చేయడంలో విఫలమైందని తెలిపారు. రుణ మాఫీ విషయంలో వాయిదాలు వేస్తూ రావడం రైతులను ఆవేదనకు గురి చేస్తోందన్నారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కలు వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉన్నాయన్నారు. రేషన్ కార్డు లేని వారికి కుటుంబ సభ్యుల గుర్తింపు ప్రక్రియ పూర్తయి నెలలు గడిచినా రైతులకు రుణ మాఫీ జరగలేదన్నారు. 2018కు ముందు రుణం తీసుకుని రీషెడ్యూల్ కాని రుణాలకు కూడా మాఫీ వర్తింపజేయాలని, అలాగే, ప్రకృతి వైపరీత్యాలు, సాగులో నష్టాల కారణంగా పంట రుణాలు చెల్లించలేకపోయిన వాటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని హేమంతరావు డిమాండ్ చేశారు. రైతు భరోసా విషయంలో ఎకరాకు రూ.15 వేలు ఇవ్వడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. కానీ వర్షా కాలం పంటకు సంబంధించి భరోసా ఇవ్వకపోవడంపై రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. వానాకాలం యాసంగి పంటలకు కూడా రైతు భరోసాను అమలు చేయాలని ఆయన కోరారు. సన్న వడ్లకు మాత్రమే రూ.500 బోనస్‌ను వర్తింపజేస్తున్నారని, అలా కాకుండా దొడ్డు వడ్లకు సైతం రూ.500 బోనస్ వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. పంటల బీమా, రైతు బీమాను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. రుణ మాఫీ మొత్తాన్ని తక్షణం రైతుల ఖాతాల్లో అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని హేమంతరావు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రాబాబు, ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, బిజి క్లెమెంట్, మిడికంటి వెంకటరెడ్డి, మేకల శ్రీనివాసరావు, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, రామ్మూర్తి, ఏపూరి రవీంద్రబాబు, యడ్లపల్లి శంకరయ్య, నానబాల రామకృష్ణ, రమేష్, పుచ్చకాయల సుధాకర్, వెంకట నర్సయ్య, కూచిపూడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో భారీగా డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

టి.మోహన్‌రావును, ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పి.రచనకు బాధ్యతలు అప్పగించారు. శ్రీకాళహస్తి దేవాలయం ఈవోగా టి.బాపిరెడ్డిని ప్రభుత్వం నియమించింది. చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర స్థాయి నుంచి కింది వరకు బదిలీలు చేపట్టింది. ఐఏఎస్, ఐపీఎస్‌లకు స్థాన చలనం కలిగించింది. చాలా మందికి పోస్టింగ్‌లు ఇవ్వకుండా నిలిపివేసింది. ఇటీవల డీఈవోలను భారీగా బదిలీ చేసింది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-నిర్మల్ జిల్లా ఖానాపూర్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌తో పాటు మండలంలోని సత్తెనపల్లి పిఏసిఎస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే వేడుమ బొజ్జు పటేల్ ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం ఎంపీపీ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ ల తో పాటు, పిఏసిఎస్ సీఈవోలు భూమి ఆశన్న, తూప్రాన్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ కార్మికులకు త్వరలో పెన్షన్ బకాయిలు

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: సింగరేణిలో పని చేసి రిటైర్ ఐన కార్మికులకు జులై 2021 నుండి అమలు కాబడిన పదకొండవ వేజ్ బోర్డ్ ప్రకారం బేసిక్ పై రివైజుడు పెన్షన్ బకాయిలు త్వరలో చెల్లిస్తారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఏఐటీయూసీ అధ్యక్షులు వి.సీతారామయ్య ప్రధాన కార్యదర్శి కె.రాజకుమార్‌లు తెలిపారు. సింపిఎఫ్ అధికారులతో ఈ విషయమై మాట్లాడి ఆలస్యం కాకుండా చూడాలని కోరిన మీదట త్వరలో చెల్లించడానికి ఒప్పుకున్నట్లు వారు తెలిపారు. సమస్య పరిష్కరించినందుకు రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘం నాయకులు వేణుమాధవ్ కృతజ్ఞతలు తెలిపారు.

అదనపు కలెక్టర్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర బ్యూరో-కొమరం భీమ్: జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా దాసరి వేణు జిల్లాకు అందించిన సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ గా పని చేసిన దాసరి వేణు బదిలీపై వెళుతున్నందున మంగళవారం కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి తో కలిసి హాజరయ్యారు. జిల్లా అదనపు కలెక్టర్‌గా దాసరి వేణు జిల్లాకు అందించిన సేవలు అభినందనీయమని, ప్రజలు, అధికారులతో మమేకమై వారితో మర్యాదగా వ్యవహరిస్తూ అందరికీ చేరువలో సేవలు అందించారని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు మాట్లాడుతూ తాను జిల్లాలో నిర్వహించిన విధులలో అధికారులు, కార్యాలయాల సిబ్బంది అందించిన సహకారం మరువలేని అన్నారు. అనంతరం శాలువలతో సన్మానించారు.

ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఆమనగల్లు : కడ్తాల్ మండల కేంద్రంలో మంగళవారం ధన్వంతరి జయంతి వేడుకలను భగత్ సింగ్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మయ్య, మహేందర్, నరసింహ, జంగయ్య, కృష్ణయ్య, శంకరయ్య, సత్తయ్య, శ్రీనివాస్, శివ, అంజయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌గా నగేష్ బాధ్యతలు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: జిల్లా అదనపు కలెక్టర్‌గా మెంచు నగేష్ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ను కలిసి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు. అంతకుముందు ప్రసిద్ధి ఏడుపాయల వన దుర్గా మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ గా ఉన్న మెంచు నగేష్ మెదక్ జిల్లాకు బదిలీ చేశారు. వెంటనే అక్కడ రిలీవ్ అయ్యారు. సోమవారం రాత్రి ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ గా ఉన్న వెంకటేశ్వర్లు వనపర్తికి బదిలీ అయ్యారు. మెంచు నగేష్ మాట్లాడుతూ... కలెక్టర్ సూచనలు, సలహాలు పాటిస్తూ జిల్లా అధికారుల సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. అదనపు కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన మెంచు నగేష్ కు జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారులు, న్యాయవాదులు, సిబ్బంది పూల బోకేలు శాలువాలతో శుభాకాంక్షలు తెలిపారు.

డ్రగ్ ఫ్రీ మెదక్‌గా మార్చుదాం

విశాలాంధ్ర బ్యూరో -మెదక్: ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకొని డ్రగ్ ఫ్రీ మెదక్ గా మార్చాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్ అబ్యూజ్ ఇన్ యూత్ అనే అంశంపై పాఠశాల విద్యాశాఖ విజయవంతంగా శిక్షణ పూర్తి చేసింది. ఈ సందర్భంగా మంగళవారం యాంటీ డ్రగ్ సోల్జర్ పోస్టర్ ను కలెక్టర్ రాహుల్ రాజ్ చేతులమీదుగా విడుదల చేశారు. డ్రగ్స్ వినియోగం మహమ్మారిగా మారడంతో యువత జీవితాలను, వారి కుటుంబాలను సర్వనాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డ్రగ్ సమస్యను అరికట్టాలంటే కేవలం పోలీస్ వ్యవస్థ మాత్రమే కాకుండా సమాజంలో ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకొని మాఫియాను అరికట్టాలని తెలియజేశారు. జిల్లా విద్యాధికారి రాధా కిషన్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సతీష్ కుమార్, రాకేష్ కుమార్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు: మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర-బ్యూరో ఖమ్మం: పత్తి కొనుగోలు విషయంలో రైతులను ఏ విధంగానైనా ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను హెచ్చరించారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతులకు మేలు జరిగే విధంగా అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు. మంగళవారం మంత్రి, తిరుమలాయపాలెం మండలం గోల్ తాండ లోని శ్రీ భాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్‌లో సిసిఐ చే ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారీ వర్షాల కారణంగా పత్తి రైతులకు ఎంతో నష్టం వాటిల్లిందని అన్నారు. జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల్లో పత్తి పండించగా, 18 నుండి 20 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి అంచనా ఉండాలన్నారు. 9 కాటన్ జిన్నింగ్ మిల్లుల్లో సిసిఐ కొనుగోలు ఏర్పాటుచేసి, మద్దతు ధరకు రైతుల నుండి పత్తి కొనుగోళ్లు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల 8 నుండి 12 శాతం వరకు తేమ ఉన్న పత్తికి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని, తేమ శాతం ఉన్న రైతు నుండి అర కిలో తరుగు రూపేణా కట్ చేసిన ఉపేక్షించేది లేదని మంత్రి తెలిపారు. పేదోడి ప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యంలో ఏ రైతుకు ఇబ్బంది కల్గవద్దని విప్లవాత్మక చర్యలు చేపడుతున్నట్లు అన్నారు. కేవలం 25 రోజుల్లోనే 18 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసినట్లు, ఇంకనూ 13 వేల కోట్ల రుణమాఫీ రాబోయే డిశంబర్ లోగా పూర్తి చేతామని మంత్రి తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షల రుణమాఫీ అర్హులైన రైతులందరికీ చేస్తామని మంత్రి అన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా అర్హులైన పేదలందరికి దీపావళి కానుకగా ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని వచ్చే నెల 1, 2 తేదీల్లో ప్రారంభించనున్నట్లు, మొదటి విడతగా ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వనున్నట్లు, విడతల వారిగా అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మంత్రి అన్నారు. రైతులు పండించిన సన్న రకం వడ్లకు క్వింటాలుకు 5 వందల బోనస్ అదనంగా చేస్తున్నట్లు మంత్రి అన్నారు. ధాన్యం లో తేమ శాతం నిబంధనల మేరకు వచ్చేలా ఒకట్రెండు రోజులు ఇంటివద్దనే ఆరబెట్టి తీసుకురావాలని మంత్రి తెలిపారు. కొనుగోలు కేంద్రం వద్ద రెవెన్యూ అధికారుల ఫోన్ నెంబర్ ఉంటుందని, ఏ ఇబ్బంది, ఫిర్యాదు ఉన్న ఆ నెంబర్ కి ఫోన్ చేయాలని, అధికారులు వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపడతారని మంత్రి అన్నారు. అంతకుముందు మంత్రి తిరుమలాయపాలెం మండలం బీరోలు పెద్ద చెరువు కు రూ. 3 కోట్లతో చేపట్టనున్న చెరువు ఆధునికీకరణ పనులకు శంఖుస్థాపన చేశారు. ఆధునికీకరణ పనుల్లో భాగంగా చేపట్టనున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్క్ ఆర్డర్ ప్రకారం పనుల నాణ్యత లో రాజీ లేకుండా, అగ్రిమెంట్ తేదీ లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ బాబు, తిరుమలాయపాలెం మండల తహసీల్దార్ రామకృష్ణ, ఎంపిడిఓ సిలార్ సాహెబ్, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి: మంత్రి

నల్లగొండ బ్యూరో-విశాలాంధ్ర: నల్గొండ జిల్లాను అన్ని రంగాలలో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నూతన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కోరారు.నల్గొండ జిల్లా నూతన కలెక్టర్ గా సోమవారం బాధ్యతలు తీసుకున్న జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఉదయం నల్గొండ జిల్లా కేంద్రంలోని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి క్యాంప్ కార్యాలయానికి వెళ్లి మర్యాదపూర్వకంగా మంత్రిని కలిశారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సైతం మంత్రిని క్యాంపు కార్యాలయంలో కలిశారు.ఈ సందర్భంగా మంత్రి జిల్లా కలెక్టర్ ,ఎస్పీలతో వివిధ అంశాలపై చర్చించారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వాటి ప్రాధాన్యతలు, తన శాఖ రోడ్లు భవనాల తోపాటు, ప్రస్తుతం ప్రాధాన్య కార్యక్రమాలైన ధాన్యం సేకరణ, తదితర అంశాలపై మాట్లాడుతు ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను పకడ్బందీగా అమలు చేయడమే కాకుండా, అన్ని అంశాలలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి జిల్లా కలెక్టర్ ఎస్పీలకు చెప్పారు

పెంబిలో ప్రభుత్వ పెద్ద ఆసుపత్రికి భూమి పూజ

విశాలాంధ్ర బ్యూరో-నిర్మల్ జిల్లా: మారుమూల ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గోడం నగేష్ అన్నారు. మంగళవారం పెంబి మండల కేంద్రంలో పంచాయతీరాజ్ విశాఖ ద్వారా 1 కోటి 56 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ లతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో పార్లమెంట్ సభ్యులు పాల్గొన్ని మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యమని పెంబి మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. ఖానాపూర్ శాసనసభ్యులు మాట్లాడుతూ, నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజూర సత్యం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, డీఈఓ రవీందర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ నర్సయ్య, ఎంపీడీవో రమాకాంత్, అధికారులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పథకాలు రాలేదు ... ఉన్న పథకాలు బంద్

విశాలాంధ్ర-వనపర్తి: రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కొత్త పథకాలు రాలేదు ... ఉన్న పథకాలు బంద్ పెడుతున్నడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మంగళవారం వనపర్తిలో నిర్వహించిన రైతాంగ, ప్రజా నిరసన సదస్సులో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ చీరెలు లేవు.. కేసీఆర్ కిట్లు లేవు.. చెరువుల్లో చేప పిల్లలు లేవు.. బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంది కనుక ఆ మాత్రం అయినా చేస్తున్నారన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో అనేక హామీలు ఇచ్చారని.. ఒక్కటైనా అమలు అవుతుందా? అని ప్రశ్నించారు. అయితే, దేవుడి మీద ఒట్లు అడిగితే తిట్లు అంటూ విమర్శలు గుప్పించారు. తిట్లతో పాటు కేసులు కూడా పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అంటేనే పోరాటాల గడ్డ, చంద్రబాబు, వైఎస్ మీద పోరాటం చేసినోళ్లమని గుర్తు చేశారు. నాపై ఎన్ని కేసులు పెట్టినా.. ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా ముఖ్యమంత్రిని ఎగవేతల రేవంత్‌రెడ్డి అని పిలుస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్య చేసిన సేవలు అభినందనీయంలి

విశాలాంధ్ర - ఆమనగల్లు : కడ్తాల్ మండలంలో ఎంపీడీవో ఆఫీస్ లో అటెండర్ గా పనిచేసే పదవీ విరమణ పొందుతున్న కోశిక మల్లయ్య దంపతులకు కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ పూలమాల శాలువతో ఘనంగా సన్మానించారు. నూతనంగా ఏర్పడిన కడ్తాల్ మండలానికి మల్లయ్య మరవలేనివని అభినందించారు. కడ్తాలపై ప్రేమ ఉంటే రానున్న రోజుల్లో కూడా తను ప్రభుత్వ ఉద్యోగులకు కాకుండా సాధారణ వ్యక్తిగా సేవలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత ఎంపీ ఓ విజయ్ కుమార్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి శ్రీనివాస్ రెడ్డి కో ఆప్షన్ సభ్యులు బాబా అధికారులు నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో ముందస్తు దీపావళి సంబురాలు

విశాలాంధ్ర - కొత్తగూడెం : బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ముందస్తు సంబరాలు జరిపారు. మంగళవారం ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈ సంబరాలు నిర్వహించారు. తొలుత దీపాలు వెలిగించి పసుపు, కుంకుమ, పూల తో హైందవ సంప్రదాయ రీతిలో పూజలు నిర్వహించారు. విద్యార్థు లందరూ క్రాకర్స్ కాల్చి దీపావళి ఆనందంతో జరుపుకున్నారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. హెచ్.ఎం, జ్యోతిరాణి, సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీచర్లు పద్మ, నీరజా షారోన్, ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, ఏం.డి.ఏం వర్కర్లు సరోజా, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ స్ట్రోక్ డే: తెలంగాణలో పునరావాస కేంద్రాలు అవశ్యం

హైదరాబాద్: ప్రపంచ స్ట్రోక్ డే 2024న, తెలంగాణలో స్ట్రోక్ కేసుల ప్రాబల్యంపై ప్రధానంగా దృష్టి సారించింది. ఇది రక్తపోటు, మధుమేహం, ధూమపానం, ప్రజలలో అవగాహన లేకపోవడం వంటి ప్రమాద కారకాలచే ఈ సమస్య మరింతగా పెరుగుతుంది. ఈ సవరించదగిన ప్రమాద కారకాలపై తగినంత నియంత్రణ లేనందున, రాష్ట్రం గణనీయమైన ప్రజారోగ్య సవాలును ఎదుర్కొంటుంది. అధిక శాతం మంది వ్యక్తులు ప్రమాదంలో వున్నారు. ఈ సంవత్సరం స్ట్రోక్ డే నేపథ్యం 'గ్రేటర్ దెన్ స్ట్రోక్ యాక్టివ్ ఛాలెంజ్', స్ట్రోక్ నివారణ, పునరావాసం(రీహాబిలిటేషన్) గురించి అవగాహన పెంచే క్రీడల శక్తిని ఇది వెల్లడిస్తుంది. అన్ని వర్గాల ప్రజలను నిమగ్నం చేస్తుంది. తెలంగాణలో, స్ట్రోక్ యొక్క ప్రాబల్యం కారణంగా గ్రామీణ మరియు పట్టణ జీవనశైలి ప్రభావితమవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని సుమారుగా 90% పెద్దలు కనీసం ఒక హృదయనాళ ప్రమాద కారకాన్ని కలిగి ఉన్నారు.

అమెజాన్ ప్రైస్ క్రాష్ స్టోర్‌లో చివరి సమయం డీల్స్

బెంగళూరు: అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ ముగుస్తున్న నేపథ్యంలో, శ్రేణులలో ఉత్తేజభరితమైన చివరి నిముషం డీల్స్ కొన్నింటిని పొందడానికి ఇదే సరైన సమయమని అమెజాన్.ఇన్ కోరుతోంది. గొప్ప ఆఫర్లు, పెద్ద ఆదాలు, బ్లాక్ బస్టర్ వినోదం, ఉత్పత్తి విడుదలలతో ఈ పండగ సీజన్‌ను సంబరం చేసుకోవాలంటోంది. కస్టమర్లు శామ్ సంగ్, రెడ్‌మి, వన్ ప్లస్, ఐక్యూ, సోనీ ప్లే స్టేషన్, ఫెరేరో రోషర్, ఫిలిప్స్, యాపిల్, డెల్, ఐఎఫ్‌బి ఉపకరణాలు, టమ్మీ హిల్ ఫిగర్, యుఎస్ పోలో అస్సొసియేషన్, బజాజ అప్లైయెన్సెస్, బోట్ సహా బ్రాండ్స్ నుండి ఆఫర్ల కోసం కస్టమర్లు ఎదురు చూడవచ్చు. కస్టమర్లు ఐసీఐసీఐ బ్యాంక్, ఏక్సిస్ బ్యాంక్, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్, బాబ్ కార్డ్, హెచ్ఎస్‌బీసీ కార్డ్స్ పై 10% తక్షణ డిస్కౌంట్ పొందవచ్చు.

కెపాసిట్‌ఈతో సిగ్నేచర్ గ్లోబల్ ఒప్పందం

న్యూఢిల్లీ: భారతదేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్‌లలో ఒకటైన సిగ్నేచర్ గ్లోబల్, సెక్టార్ 71, గురుగ్రామ్‌లో అభివృద్ధి చేయనున్న తమ ప్రీమియం రెసిడెన్షియల్ ప్రాజెక్ట్, టైటానియం ఎస్పీఆర్ కోసం నిర్మాణ కాంట్రాక్టును అందజేసినట్లు ప్రకటించింది. రూ.1203 కోట్ల విలువైన ఈ కాంట్రాక్టును ప్రముఖ నిర్మాణ సంస్థ కెపాసిట్‌ఈ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ లిమిటెడ్‌కు అప్పగించారు. 14.382 ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఈ టైటానియం ఎస్పీఆర్‌లో 3.5 బీహెచ్‌కే, 4.5 బీహెచ్‌కేతో కూడిన మొత్తం 608 యూనిట్లు ఉంటాయి. రెండు దశలలో అభివృద్ధి చేయనున్న 3.7 మిలియన్ చదరపు అడుగుల ప్రాజెక్ట్‌లో భాగంగా మొదటి దశ 2.1 మిలియన్ చ.అ.లను కలిగి ఉంది. ఇది జూన్ 2024 నెలలో ప్రారంభించబడింది. ఈ ప్రాజెక్ట్ కు అద్భుతమైన స్పందనను లభించింది. ప్రీ-సేల్ సంఖ్య రూ. 2700 కోట్ల కంటే ఎక్కువ.

బీటీఎస్ జిన్‌తో డాల్బీ అట్మోస్ క్యాంపెయిన్

న్యూఢిల్లీ: ఇంటర్నేషనల్ కంపెనీ డాల్బీ ల్యాబొరేటరీస్ లీనమయ్యే వినోద అనుభవాలలో అగ్రగామిగా ఉండగా, 'లవ్ మోర్ ఇన్ డాల్బీ: గ్లోబల్ బ్రాండ్ క్యాపెంయిన్' తాజా ఛాప్టర్‌లో 21వ శతాబ్దపు పాప్ ఐకాన్, బీటీఎస్ గ్రూపు జిన్‌తో జతకట్టింది. జిన్ తన కొత్త సింగిల్ 'ఐ విల్ బి దేర్'తో వేడుక ఆచరించుకునేందుకు ఈ కమర్షియల్‌లో నటించగా, ఇది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా డాల్బీ అట్మోస్‌లో అందుబాటులో ఉంది. 'ఐ విల్ బి దేర్' అనే సింగిల్ తర్వాత, జిన్ నుంచి అందరూ అత్యంత ఆసక్తిగా వేచి చూస్తున్న మొదటి సోలో ఆల్బమ్ హ్యాపీ నవంబర్ 15న ప్రపంచవ్యాప్తంగా డాల్బీ అట్మోస్‌లో విడుదల కానుంది. డాల్బీ అట్మోస్‌తో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు చక్కని అనుభూతిని అందుకుంటారని జిన్ తెలిపారు.

పది నిమిషాల డెలివరీతో బిగ్‌బాస్కెట్ దీపావళి షాపింగ్

విజయవాడ: ఫుల్-స్టాక్ త్వరిత వాణిజ్య సంస్థగా మారుతోన్న బిగ్‌బాస్కెట్, తమ కస్టమర్ల ఇంటి ముంగిటకు కేవలం కిరాణా సామాగ్రిని మాత్రమే కాకుండా మరిన్నింటిని తీసుకువస్తోంది. ఈ మార్పు టైర్ 2 మార్కెట్‌లలో శీఘ్ర వాణిజ్య ఆఫర్‌లను విస్తరించడంలో బిగ్‌బాస్కెట్ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. దీపావళి సమీపిస్తున్నందున, కస్టమర్‌లకు అద్భుతమైన రీతిలో వివిధ రకాల ఉత్పత్తులను అందించడం ద్వారా పండుగ సీజన్‌ను మరింత వైభవంగా జరుపుకోవడానికి, కేవలం 10 నిమిషాల్లోనే వస్తువులను డెలివరీ చేస్తుంది. రాబోయే నెలల్లో క్రోమా నుండి సరికొత్త ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల వరకు, అలాగే టాటా క్లిక్ నుండి దుస్తులు వంటివి అందించటానికి బిగ్‌బాస్కెట్ సిద్ధంగా ఉందని బిబి రిటైల్ మార్కెటింగ్ హెడ్ రాగాలీన శ్రీపాద అన్నారు. ప్రఖ్యాత బ్రాండ్‌ల నుండి అత్యుత్తమ శ్రేణి డీల్‌లు, 10 నిమిషాల డెలివరీతో, పండుగ షాపింగ్ అనుభవాన్ని పునర్నిర్వచిస్తుంది.

పోలియో-రహితమే కానీ ప్రమాద రహితం కాదు

హైదరాబాద్: భారతదేశంలోని మేఘాలయలో ఇటీవల బయట పడిన పోలియో కేసు నేపథ్యంలో, పోలియోమైలిటిస్ వల్ల కలిగే నిరంతర ముప్పును గుర్తించడం చాలా అవసరం. పోలియో, ఒక తీవ్రమైన వైరల్ అంటువ్యాధి. ప్రధానంగా ఐదేళ్లలోపు పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఇది కోలుకోలేని పక్షవాతం మరియు కొన్ని సందర్భాల్లో మరణానికి దారితీస్తుంది. దశాబ్దాలుగా పురోగతి ఉన్నప్పటికీ, ఈ వ్యాధి ప్రపంచ ఆరోగ్యానికి ముప్పుగా మాత్రం మిగిలిపోయింది, ముఖ్యంగా పోలియో రహిత భారతదేశం వంటి దేశాలలో ఇది మరలా రాకుండా నివారించడానికి అప్రమత్తంగా ఉండాలి. హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో పీడియాట్రిక్స్ చీఫ్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ నితిన్ చావ్లా మాట్లాడుతూ, భారతదేశం పోలియో రహిత హోదా అనేది నిబద్ధత, సమిష్టి చర్యతో మనం ఏమి సాధించగలమనే దానికి నిదర్శనమని అన్నారు.

ఏసీబీ వలలో మెడికల్ కాలేజ్ ఏఓ, జూనియర్ అసిస్టెంట్

రూ. 3 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నుంచి లంచం తీసుకుంటూ ఇద్దరు అధికారులు రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ వలలో చిక్కారు. కొత్తగూడెం మెడికల్ కాలేజ్ లో ఏవోగా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ ఖలీలుల్లా, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ ఒక ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా మంగళవారం రూ. 3 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమేష్ నేరుగా పట్టుకున్నారు. డీఎస్పీ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.

కొత్తగూడెం మెడికల్ కాలేజీలో ఆరు నెలల క్రితం నోటిఫికేషన్ ద్వారా 23 మందిని వివిధ విభాగాల్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా నియమించారు. ఈ నియామకాలు ఒక ప్రైవేటు ఏజెన్సీ ద్వారా జరిగాయి. కాగా ఆర్లు ఆరు నెలల నుంచి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు జీతాలు మంజూరు చేయకుండా ఏవో ఖలీలుల్లా జాప్యం చేస్తూ వస్తున్నాడు. మధ్యవర్తిగా ఉన్న ఔట్సోర్సింగ్ బాధ్యులు బిల్లుల కోసం సదరు అధికారిని సంప్రదించగా రూ 17 లక్షలు లంచం ఇస్తేనే బిల్లులు చేస్తామని చెప్పారు. అంత మొత్తం ఇవ్వలేమని చెప్పడంతో రూ. 7 లక్షలకు ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలోనే సదురు ఉద్యోగులు జిల్లా ఉన్నతాధికారులను ఇటీవల ఆశ్రయించారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వెంటనే జీతాలు ఇవ్వాలని జిల్లా అధికారులు మెడికల్ కాలేజ్ అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ బిల్లులు చేయకుండా ఏవో, జూనియర్ అసిస్టెంట్ ఇబ్బందులకు గురి చేశారు. ఆరు నెలల బిల్లులను గురించి కేవలం రెండున్నర నెలల బిల్లులు మాత్రమే ఇస్తామని చెప్పడంతో ఈ వ్యవహారాన్ని కొందరు ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కొన్ని రోజులుగా పక్కా వ్యూహం పన్ని మంగళవారం ముహూర్తం ఖరారు చేశారు. ఒప్పందం చేసుకున్న 7 లక్షల్లో తొలి విడతగా మూడు లక్షలు ఇస్తామని ఏవో, జూనియర్ అసిస్టెంట్ ను నమ్మ బలికారు. ఈ క్రమంలోనే మూడు లక్షల నగదు ఏవో జూనియర్ అసిస్టెంట్ కు ఇచ్చారు. వెంటనే రంగంలో దిగిన డిఎస్పి రమేష్ తన సిబ్బందితో దాడి చేసి ఆ ఇద్దరు లంచగొండులను పట్టుకున్నారు. ఆ డబ్బులను ఏసీబీ శాఖ పరంగా ఎనాలసిస్ చేసి డబ్బులతో పాటు ఆ ఇద్దరిని ఆధీనంలో తీసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో డీఎస్పీ మాట్లాడారు. ఖమ్మం భద్రాద్రి జిల్లాలో దాము విధులు నిర్వహిస్తున్నామని ఎవరైనా లంచం అడిగితే తమను నేరుగా సంప్రదించాలని కోరారు. టోల్ ఫ్రీ నెంబర్ 108కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. తమకు సమాచారం ఇస్తే పేర్లు బయట పెడతామని సందేహం వద్దన్నారు. సమాచారం ఇచ్చిన వారి విషయాలు గోప్యంగా ఉచ్చుతామన్నారు. ఏసీబీకి పట్టించటం వల్ల తదుపరి తమ పనులు అధికారుల వద్ద కావనే సందేహాలు కూడా పెట్టుకోవద్దు అన్నారు. తప్పకుండా లంచాలు లేకుండా ఎలాంటి పనులైన జరిగిపోతాయని సూచించారు.

రైమో టెక్నాలజీస్‌కు రూ.100 లక్షల నిధులు

హైదరాబాద్: ఐకేఎంసీ2024 2వరోజు శక్తి, ఆకర్షణీయమైన చర్చలతో నిండిన ఉత్సాహభరితమైన వేడుక. తాజాగా సెల్, జీన్ థెరపీపై రౌండ్‌టేబుల్‌తో ప్రారంభమైంది. ఆ తర్వాత స్టోరీ టెల్లింగ్ వర్క్‌షాప్, వన్‌హెల్త్ విధానాన్ని అమలు చేయడంపై మరొక రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఐఐఎస్‌సీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ పద్మనాభన్ బలరామ్, మ్యాప్‌మైజీనోమ్ సీఈఓ అనురాధ ఆచార్య, సీపీఎఫ్‌డీ డైరెక్టర్ డాక్టర్ ఉల్లాస్ కొల్తూర్ విలువైన అంతర్దృష్టులను పంచుకున్న విశిష్ట ఉపన్యాసాలు ప్రేక్షకులను ఆకర్షించాయి. ఐకేపీ యూఎస్ ఫార్మకోపియాతో భాగస్వామ్యంతో షీలీడ్స్ చొరవను ప్రారంభించి ప్రపంచ సహకారాన్ని ప్రోత్సహించే దాని సంప్రదాయాన్ని కొనసాగించింది. ఐకేపీ అట్25 వేడుకలు ఐకేపీ చైర్మన్, సీఈఓ దీపన్విత ఛటోపాధ్యాయ అధ్యక్షతన జరిగిన వేడుకతో ముగిశాయి. వీరితోపాటు ఐకేపీల పట్ల తమ విజన్‌ను పంచుకున్న వారిలో ప్రొ. బలరామ్, హెచ్‌కే మిట్టల్ (సలహాదారు, సభ్యకార్యదర్శి, ఎన్ఎస్‌టీఈడీబీ), సంజయ్ దత్తా (ఐసీఐసీఐ ఫౌండేషన్) ఉన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్టప్, ఫ్యూచర్, ఫార్వార్డ్ అవార్డులు ప్రదానం చేశారు. రైమో టెక్నాలజీస్‌కు రూ.100 లక్షల రివార్డు లభించగా, కార్డోసెన్స్‌కు రూ.50 లక్షల రివార్డు దక్కింది.

ఐకేపీ నాలెడ్జ్ పార్క్‌లో నారాయణన్ వాఘుల్ బిల్డింగ్ ప్రారంభం

హైదరాబాద్: ఐకేఎంసీ 2024 మూడో రోజు వేడుకల సందర్భంగా జీనోమ్ ర్యాలీలోని ఉన్న ఐకేపీనాలెడ్జ్ పార్క్‌ల నారాయణన్ వాఘుల్ బిల్డింగ్‌ను ప్రారం భించారు. ఈ న్యూ అడ్మినిస్ట్రేటివ్ హబ్ ఐకేపీ స్థాపకుడు, దివంగత నారాయ ణన్ వాఘుల్ జ్ఞాపకార్థం నిర్మించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐకేపీ చైర్మన్, సీఈవో దీపన్విత చటోపాధ్యాయ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా వాఘుల్ కృషిని కొనియాడారు. అనంతరం జీనోమ్ ర్యాలీలో సీఎక్స్ఓ కాన్‌క్లేవ్ జరిగింది. ఈ సమావేశంలో ఐకేపీ తదుపరి 25 సంవత్స రాల గురించి చర్చించారు. ఎస్ఎంఈ, వృద్ధిదశలోని కంపెనీలకు సహకరించ డానికి క్లినికల్ మెటీరియల్స్ ఉత్పత్తి కోసం ఆధునిక బయో మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌ను స్థాపించేందుకు ఐకేపీ ప్రతిపాదించింది.

ఇది రెండు మూడు సంవత్స రాలలో ఆపరేషనల్ అవుతుందని అంచనా. ఇది లైఫ్ సైన్సెస్ రంగంలో ఆవిష్కరణలను పెంపొందించడంలో ఐకేపీ నిబద్ధతకు నిదర్శనమని చెప్పవచ్చు.

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ 'ఇండియా కా సెలబ్రేషన్' ప్రచారం

హైదరాబాద్: పండుగ ఉత్సాహాన్ని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తూ, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా హైదరాబాద్‌లో తన 'ఇండియా కా సెలబ్రేషన్' ప్రచారంలో విజేతలను గర్వంగా ప్రకటించింది. ఈ ప్రచారంలో భాగంగా ఎల్‌జీ ఉత్పత్తులు కొనుగోలు చేసే కస్టమర్లకు ప్రత్యేకమైన ఎల్‌జీ డ్రీమ్ హోమ్ ప్యాకేజీ గెలుచుకునే అవకాశం ఉంది.

దేశవ్యాప్తంగా గృహాలకు సంతోషాన్ని, విలాసాన్ని తీసుకువస్తూ 44 మంది ఈ ప్రతిష్టాత్మక బహుమతిని గెలుచు కోగా, ఆరుగురు హైదరాబాద్ నుంచి గెలిచారు. పండుగ కాలంలో కస్టమర్ల కోసం ఉత్సాహాన్ని తీసుకురావడమే లక్ష్యంగా 'ఇండియా కా సెలబ్రేషన్' ప్రచారం ప్రారంభమైంది. ఇందులో మొత్తం రూ.51 కోట్ల విలువైన బహుమతులను అందిస్తున్నారు. ఈ ప్రచారంలో భాగంగా, కస్టమర్లు ఎల్‌జీ డ్రీమ్ హోమ్ ప్యాకేజీని ప్రతి రోజు గెలుచుకునే అవకాశం పొందుతారు.

టయోటా కిర్లోస్కర్ మోటార్ 31వ ఐకేర్ ఈవెంట్

బెంగుళూరు: సామాజిక అభివృద్ధి మరియు సమాజ సాధికారత కోసం స్థిరమైన నిబద్ధతతో నడిచే టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) తాజాగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తన 31వ ఐకేర్ (ఐసీఏఆర్‌ఈ- అంటే ఐ, కమ్యూనిటీ యాక్షన్ టు రీచ్ ప్రతిఒక్కరికీ) కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు ప్రకటించింది.

ఉల్లాల్ ఉపనగర, కెంగేరి సమీపంలో ప్రపంచ విద్యార్థులతో సమలేఖనం చేయబడిన ఈ చొరవ, 200 మంది టీకేఎం ఉద్యోగి వాలంటీర్లను, 100 మంది విద్యార్థులను పాఠశాల మౌలిక సదుపాయాలను పెంపొందించే లక్ష్యంతో వివిధ కార్యకలాపాలలో

చురుకుగా పాల్గొనేందుకు ఒకచోట చేర్చింది. ప్రపంచ విద్యార్థుల నెల అక్టోబర్‌లో, భవిష్యత్తును రూపొందించడంలో విద్యార్థుల పాత్ర గురించి చర్చించుకుంటుంది. విద్య, విద్యార్థుల నిశ్చితార్థం ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది. ఈ వేడుకలో భాగంగా, 31వ ఐకేర్ ఈవెంట్ పాఠశాల ఫర్నిచర్ మన్నిక, కార్యాచరణను మెరుగుపరచడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించింది.

రాబోయే 12-15 నెలల్లో బంగారాన్ని అధిగమించనున్న సిల్వర్

ముంబయి: మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎంఓఎఫ్ఎస్ఎల్) ప్రకారం, సిల్వర్ మీడియం నుండి దీర్ఘకాలంలో బంగారంతో సరిపోలవచ్చు లేదా అధిగమించవచ్చు. రాబోయే 12 నుండి 15 నెలల్లో సిల్వర్ ఎంసీఎక్స్‌లో రూ.1,25,000, కోమెక్స్‌లో 40 డాలర్ల లక్ష్యాలను చేరుకోవచ్చని అంచనా వేస్తోంది. ఇటీవల, సిల్వర్ ఆకట్టుకునే పనితీరును కనబరిచింది, 40% కంటే ఎక్కువ వైటీడీని పొందింది. దేశీయంగా రూ.100,000ను ఉల్లంఘించింది, సురక్షితమైన కొనుగోలు, బలమైన పారిశ్రామిక డిమాండ్‌కు ఆజ్యం పోసింది. ఎంఓఎఫ్ఎస్ఎల్ కూడా బంగారం కోసం మీడియం టర్మ్‌లో రూ.81,000, దీర్ఘకాలికంగా రూ.86,000 లక్ష్యాలను నిర్దేశించింది. కోమెక్స్‌లో బంగారం మధ్య కాలానికి 2,830డాలర్లకి, దీర్ఘకాలంలో 3,000డాలర్లకి చేరుతుందని అంచనా వేసింది. ఇటీవలి సంవత్సరాలలో బంగారం స్థిరంగా అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న ఆస్తులలో ఒకటిగా ఉంది.

మెరిల్ 'ట్రీట్మెంట్ జరూరీ హై' క్యాంపెయిన్ రెండో దశ ప్రారంభం

ముంబై: ప్రముఖ అంతర్జాతీయ వైద్యపరికరాల సంస్థ మెరిల్ తన 'ట్రీట్మెంట్ జరూరీ హై' క్యాంపెయిన్ రెండో దశను ప్రారంభించింది. ఇందులో ప్రముఖ క్రికెటర్ ఎంఎస్ ధోనీ కృత్రిమ మేధస్సు ఆధారితంతో వ్యక్తిగతీకరించిన వీడియో సందేశాలు ఉన్నాయి. ఈ వినూత్న విధానం పేషెంట్‌లకు సకాలంలో వైద్యచికిత్స

పొందడానికి, వివిధ చికిత్సలతో సంబంధం ఉన్న భయాలను తగ్గించడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా, మెరిల్ ఆరోగ్య సంరక్షణ కమ్యూనికేషన్‌ను మరింత వ్యక్తీగతీకరించింది. అధునాతన వైద్య పరిష్కారాల ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ, పేషెంట్‌లను వారి శ్రేయస్సు కోసం క్రియాశీల చర్యలు తీసుకోవాలని కోరుతోంది. ఈ ప్రచారం గుండె పరిస్థితి, కీళ్లమార్పిడి, బేరియాట్రిక్ శస్త్రచికిత్సలు, మరెన్నో రకాల పరిస్థితులు, చికిత్సలపై దృష్టిపెడుతుంది.

ఎన్ఎక్స్‌పీ ఏఐఎంలో కెఎల్‌హెచ్ అజీజ్ నగర్ 'బ్రెయినీ బాట్స్' ప్రతిభ

ముంబయి: తమ బిటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌కు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులతో కూడిన 'బ్రెయినీ బాట్స్' టీమ్ ఎన్ఎక్స్‌పీ ఏఐఎం 2024 పోటీలో ఆకట్టుకునే రీతిలో 4వ స్థానాన్ని పొందినట్లు కెఎల్‌హెచ్ అజీజ్ నగర్ క్యాంపస్ వెల్లడించింది. ఈ పోటీలో 'బ్రెయినీ బాట్స్' టీమ్ ప్రతిష్టాత్మక ఏఐ అర్జున అవార్డును, రూ. 10,000 నగదు బహుమతిని అందుకుంది. ఆవిష్కరణ, సమస్య పరిష్కారంలో వారి నైపుణ్యాలను ఈ అవార్డు ప్రదర్శిస్తుంది. ఏఐఎం ఎన్ఎక్స్‌పీ 2024 ఛాలెంజ్, ఒక ప్రముఖ జాతీయ పోటీ.

ఏఐ, మొబిలిటీ, రోబోటిక్స్‌తో కూడిన ప్రాజెక్ట్ ఆధారిత సవాళ్లను పరిష్కరించడానికి విద్యార్థులను ఆహ్వానిస్తుంది. భారతదేశంలోని ప్రముఖ ఇంజనీరింగ్ సంస్థల నుండి 620 కంటే ఎక్కువ జట్లతో పోటీ పడిన 'బ్రెయినీ బాట్స్' బృందం అసాధారణమైన సాంకేతిక చతురతను ప్రదర్శించింది. లక్ష్మి, నౌషీన్, మేఘనతో కూడిన "బ్రెయినీ బాట్స్" బృందంకు అధ్యాపకులు మద్దతునిచ్చారు.

సంపాదకీయం

అసమర్థనీయ సమర్థన

అడుసు తొక్కి కాలు కడిగేసుకోవచ్చు కానీ అడుసు తొక్కిన విషయం వెంటాడుతూనే ఉంటుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ ప్రస్తుతం సరిగ్గా ఇదే అవస్థలో ఉన్నారు. వచ్చే నెల పదో తేదీన ఆయన ప్రధాన న్యాయమూర్తిగా ఉద్యోగ విరమణ చేస్తారు. ఉద్యోగ విరమణ రోజు దగ్గర పడుతున్నకొద్దీ ఆయనలో ఆందోళన పెరిగిపోతోంది. అందులో కొంత ఆయన స్వయంకృతం అయితే మిగతాది ఆయనను ఆవరించిన భయం. లేదా ఆయన భావజాలం నుంచి తలెత్తిన గందరగోళం. ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్‌కు గత 14 ఏళ్లుగా ఎవరికీరాని అవకాశం వచ్చింది. దాదాపు రెండేళ్లు ఆయన ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించగలిగారు. ఈ దీర్ఘకాలిక అనుభవం ఆయన నాలుగు కాలాలు గుర్తుంచుకునే పనులు చేయడానికి అవకాశం కల్పించింది. ఇలాంటి పనులు ఆయన ఎన్ని చేశారు అన్నది చర్చించదగిన విషయమే. కానీ తనను చరిత్ర ఎలా గుర్తుంచుకుంటుందన్న ఆందోళన ఆయనను అమితంగా భాదిస్తున్నట్టుంది. అంటే తన నడవడిక మీద తనకే అనుమానాలున్నాయి. బాబ్రీ మసీదు భూ వివాదం గురించి తీర్పు చెప్పాల్సి వచ్చినప్పుడు ఏం చేయాలో తోచలేదని చివరకు దైవాన్ని స్మరించుకుంటే మార్గం తట్టింది అని ఆ రకంగానే తీర్పు చెప్పానని ఆయన అన్నారు. ఆ తీర్పు చెప్పింది చంద్రచూడ్ ఒక్కరే కాదు. అయితే ఆయన భావన మాత్రం ఏ తీర్పు చెప్పాలో దైవం సూచించాడనే. న్యాయమూర్తులు రాజ్యాంగం ఆధారంగా తీర్పులు చెప్పాలి తప్ప దైవానుజ్ఞ ప్రకారంకాదు. ఎవరి దైవం వారికి ఉండొచ్చు. కానీ దేశంలోని సకల వ్యవస్థలకు, ప్రతి ఒక్కరికి వర్తించేది, మార్గ నిర్దేశం చేసేది రాజ్యాంగం మాత్రమే. మరో అంశం ఏమిటంటే వినాయక చవితి పర్వ దినం సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ దేశ ప్రధాని నరేంద్ర మోదీని తన ఇంటికి ఆహ్వానించారు. ఇద్దరూ కలిసి వినాయకుడి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరిద్దరూ వినాయకుడికి హారతి ఇస్తున్న వైనానికి సంబంధించి వీడియోల్లో చిత్రీకరించారు. ఫొటోలు తీశారు. ఫొటోలు, వీడియోలు అంటే అపరిమితమైన అపేక్షగల ప్రధానమంత్రి వాటినన్నింటినీ "ఎక్స్" (మునుపు ట్విట్టరు) ఖాతాలో వేసేశారు. సహజంగానే అవి అందరి దృష్టినీ ఆకర్షించాయి. ప్రధాన న్యాయమూర్తి కార్యనిర్వాహకవర్గ అధిపతి అయిన దేశ ప్రధానమంత్రిని ఇంటికి ఆహ్వానించడమేమిటీ అన్న చర్చ విపరీతంగా జరిగింది. రాజ్యాంగం ప్రకారం కార్యనిర్వాహక వర్గం, న్యాయ వ్యవస్థ స్వతంత్రమైనవి. ఒక దానిలో మరొకటి జోక్యం చేసుకునే అవసరమేలేదు. పైగా ఈ రెండూ కీలక వ్యవస్థలే. అలాంటప్పుడు ప్రధాన న్యాయమూర్తి ప్రధానమంత్రి మోదీని తన ఇంటికి ఆహ్వానించడం ఏమిటి అన్న చర్చ సహజమే. ఉద్యోగ విరమణకు ముందు ఈ వివాదానికి తెరదించాలని ప్రధాన న్యాయమూర్తి అనుకున్నట్టున్నారు. అందుకే సంజాయిషీ ఇచ్చుకున్నారు. తాను చేసిన పనిని సమర్థించుకోవడానికి ప్రయత్నించారు. ప్రధానమంత్రి అత్యున్నత న్యాయ స్థానం అధిపతి ఇంటికి రావడంలో తప్పేమీ లేదని, పండగలు, శుభకార్యాల సమయంలో ఈ రెండు పదవుల్లో ఉన్న వారు కలుసుకుంటూనే ఉంటారు అని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ సంజాయిషీ ఇస్తున్నారు. తాను అలహాబాద్ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన తరవాత అప్పటి ముఖ్యమంత్రి ఇంటికి వెళ్లానని, ఆ తరవాత సదరు ముఖ్యమంత్రి తన ఇంటికి వచ్చారని చంద్రచూడ్ వివరించారు. కానీ అది పండగో, శుభకార్యం సందర్భంగానో కాదు. అది అధికారిక మర్యాదో బాధ్యతో కావొచ్చు. వినాయక చవితి పూజల్లో పాల్గొనడాన్ని ప్రధాని కానీ ప్రధాన న్యాయమూర్తిగానీ వారిద్దరికి సంబంధించిన వ్యవహారంగా పరిమితం చేయలేదు. ఆ సందర్భానికి భారీ ప్రచారమే కల్పించారు.

అనుద్దేశ పూర్వకంగానే అయినా వివాదం ప్రధాన న్యాయమూర్తినే చుట్టు ముట్టింది. ఇప్పటికీ చంద్రచూడ్ ఇంటికి మోదీ వెళ్లడాన్ని ఎవరూ ఆక్షేపించిన దాఖలాలు లేవు. చంద్రచూడ్ ప్రవర్తననే తప్పుపడుతున్నారు. దీని తీవ్రత గ్రహించిన చంద్రచూడ్ ఈ వివాదానికి తెరదించడం కోసం సంజాయిషీ ఇచ్చారు. ఆ సంజాయిషీ వివాదం సమసిపోవడానికి ఏ మాత్రం తోడ్పడలేదు. ప్రధాని తన ఇంటికి రావడంపై రేగిన వివాదం "అనవసరమైంది, నిర్హేతుకమైంది, తర్కవిరుద్ధమైంది" అని ప్రధాన న్యాయమూర్తి అంటున్నారు. ఆయన దృష్టితో చూస్తే ఈ వాదన సమంజసమైందిగా కనిపించవచ్చు. ఆయన రెండు రకాల సమర్థనలను తీసుకొచ్చారు. ఒకటి: వారి అధికార హోదాలకు నిమిత్తం లేనిది. రెండవది అధికార హోదాకు సంబంధం ఉన్నదైనా సంప్రదాయంగా వస్తున్నది. అధికారంలో ఉన్న రాజకీయ నాయకులు న్యాయమూర్తుల ఇళ్లకు పండగల, పబ్బాల సందర్భంగా వెళ్లడంలో తప్పేమీ లేదంటున్నారు ప్రధాన న్యాయమూర్తి. ప్రత్యేక సందర్భాలలో ముఖ్యమంత్రులో, ప్రధానమంత్రులో న్యాయమూర్తుల ఇళ్లకు వెళ్లొచ్చని చంద్రచూడ్ అంటున్నారు. పండగలు పబ్బాల సమయంలో రాజకీయ నాయకులు న్యాయమూర్తి ఇళ్లకువస్తే న్యాయ వ్యవహారాలు చర్చించరు అని ప్రధాన న్యాయమూర్తి చెప్తున్నారు. నిజమే కావచ్చు. కానీ ఇది అనుమానాలకు అతీతమైంది అయితే కాదు. సంజాయిషీ ఇచ్చే తొందరలో ప్రధాన న్యాయమూర్తి పొంతన కుదరని అంశాలు ప్రస్తావించారు. పండగలు, పబ్బాల సమయంలో, పెళ్లిళ్లకు, పేరంటాలకు అధికారపక్ష నాయకులు న్యాయమూర్తుల ఇళ్లకు వెళ్లడం సహజమే అని చెప్పే ప్రయత్నంలో ఆయన చూపిన దృష్టాంతం మాత్రం అధికారిక విషయాలకు సంబంధించింది. తాను అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయినప్పుడు ముఖ్యమంత్రి ఇంటికి వెళ్లానంటున్నారు. ఇది చుట్టపుచూపు వ్యవహారం కాదుగా! ఆ తరవాత ముఖ్యమంత్రి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇంటికి రావడం ఆనవాయితీ అంటున్నారు చంద్రచూడ్. చుట్టపు చూపుగా వెళ్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఉండకూడదు. అధికారిక సంప్రదాయాల ప్రకారం కూడా ఇవి ఆమోదయోగ్యం కావొచ్చు. ప్రధాన న్యాయమూర్తి ప్రధానమంత్రిని తన ఇంటికి ఆహ్వానించడం శుభ సందర్భాలకు పరిమితమైంది కాదు. కార్యనిర్వాహకవర్గం, న్యాయవ్యవస్థ బాధ్యతలను రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించింది. అన్నింటికన్నా మించి కొన్ని కీలకమైన పదవుల్లో ఉన్నవారికి వ్యక్తిగతం అంటూ ఏమీ మిగలకపోవచ్చు. అందుకే ప్రధాన న్యాయమూర్తి రెండు వ్యవస్థల మధ్య రాజ్యాంగం గీసిన విభజన రేఖను చెరిపేశారన్న విమర్శ ఎదుర్కోవలసి వస్తోంది. ఉద్యోగ విరమణ చేసిన తరవాత న్యాయమూర్తులు ఇతరత్రా ఉద్యోగాలు స్వీకరించడమే సరైన విధానం కాదన్న అభిప్రాయం విస్తృతంగా ఉంది. ఉద్యోగ విరమణానంతరం ఉపాధికోసం ఉద్యోగంలో ఉండగా ప్రభుత్వానికి అనుకూలమైన తీర్పులు ఇచ్చిన న్యాయమూర్తులు కొల్లలుగా కనిపిస్తారు. సుదీర్ఘ కాలం న్యాయమూర్తులు విలువైన అనుభవం గడించి ఉండవచ్చు. అది వారి ఉద్యోగానంతరం కూడా సమాజానికి ఉపయోగపడవచ్చు. అయితే వయసు రీత్యా ఉద్యోగానికి పనికి రానప్పుడు ఇతర బాధ్యతల నిర్వహణకు అదే వయసు ఎందుకు ఆటంకం కావడం లేదు? ఈ ప్రశ్న నిరాధారమైంది కాదు. ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ సంజాయిషీ ఇవ్వాలనుకుని మరింత ఊబిలోకి దిగారు. హోదా పెరిగే కొద్దీ మరింత బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుందన్న చిన్న తర్కం ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్‌కు తట్టకపోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది.

సోషలిజం లక్ష్యంగా కార్మిక పోరాటాలు

చలసాని వెంకటరామారావు

పారిశ్రామిక విప్లవంతో పెట్టుబడిదారీ వర్గంతో పాటు ఆధునిక కార్మికవర్గం కూడా ఆవిర్భవించింది. బ్రిటీష్ వలస పాలన ఫలితంగా భారతదేశం తీవ్ర దోపిడీకి గురైంది. దేశ సంపద బ్రిటీష్ వారు కొల్లగొట్టారు. దేశం అన్ని రంగాలలో సర్వ నాశనమైంది. ప్లాసీ యుద్ధంలో సిరాజుద్దౌలా ఓటమితో దేశంలో బానిస అధ్యాయం ప్రారంభమైంది. 1813 వరకు ప్రధానంగా ఎగుమతులు చేసిన భారతదేశం బ్రిటీష్ పాలనలో దిగుమతుల దేశంగా మారిపోయింది. బ్రిటీష్ వారు భారత భూభాగాలు ఆక్రమించి అంతఃకలహాలు రేపి కుట్రలు, కుతంత్రాలు సాగించారు. దేశీయ నూలు పరిశ్రమలు ధ్వంసం చేశారు. దేశీయ ఉక్కు పరిశ్రమను నాశనం చేశారు. భారత్‌లో దోపిడీ చేసిన సొమ్మును ఇంగ్లండ్‌లో పెట్టుబడులు పెట్టి తమ పారిశ్రామిక సంపదను పెంచుకున్నారు. దేశంలో ఉపాధి దెబ్బతిని నిరుద్యోగం పెరిగింది. దీనికి తోడు 1825-1900 మధ్య వచ్చిన కరువులలో 2 కోట్ల మంది ప్రజలు మరణించారు. లక్షలాది మంది ప్రజలు కార్మికులుగా బ్రిటీష్ వలస రాజ్యాలకు రవాణా చేశారు. ప్రజల అసంతృప్తి 1857 మీరట్ ప్రథమ స్వాతంత్ర్య తిరుగుబాటునకు దారితీసింది. దీనితో 1858లో బ్రిటీష్ విక్టోరియా రాణి ఈస్ట్ ఇండియా కంపెనీని రద్దుచేసి స్వయం పాలన నెలకొల్పారు. 19వ శతాబ్దం మధ్య భారతదేశంలోనే ఆధునిక పరిశ్రమలను స్థాపించారు. రైల్వే లైన్లు, టెలిగ్రాఫ్ లైన్లు, ప్లాంటేషన్, బొగ్గు గనులు, బట్టలు, జనపనార పరిశ్రమలు అభివృద్ధి చేశారు. 1833లో మొదటి బట్టల మిల్లు బొంబాయిలో స్థాపించారు. 1774లో మొదటి బొగ్గుగని తవ్వారు. 1839లో హౌరాలో గ్లోసెస్టార్ మిల్లు, బ్రిటీష్ టీ కంపెనీ స్థాపించారు. జనపనార మిల్లు 1858లో బెంగాల్‌లో ఉత్పత్తి ప్రారంభించింది. 1852లో మొదటి రైలుమార్గం వేశారు. 1874లో పార్సీ బనియావారి, గుజరాత్, చెట్టియార్‌లకు చెందిన అగ్రకులాల పెట్టుబడులతో భారత్‌లో పరిశ్రమలు స్థాపించారు. మిలిటరీ కాంట్రాక్టరు టాటా నాగపూర్‌లో 1874 లో వస్త్ర పరిశ్రమను, తర్వాత ఇనుము, ఉక్కు పరిశ్రమను స్థాపించారు. దీనితో ఆధునిక భారత కార్మిక వర్గం ఆవిర్భవించింది. తొలినాళ్లలో భారత కార్మికులు ఎటువంటి హక్కులు లేకుండా దోపిడీకి గురయ్యారు. పని గంటలు లేవు. సెలవులులేవు. పిల్లలు పెద్దలతో సమానంగా పని చేయాలి. యంత్రాలలో పడి చనిపోయినా ఎటువంటి రక్షణ లేదు. ఆటవిక చట్టాలే రాజ్యమేలేవి. యాజమాన్యాల దయాదాక్షిణ్యాలతో బతకవలసి ఉండేది. కానీ యాజమాన్యా లకు లాభాలు కాసుల పంటగా పండేది. కార్మికుల రక్తమాంసాలు ఒడిసి పెట్టుబడిదారులు లాభాలను గుంజారు. ఈ స్థితిలో భారత కార్మిక వర్గం మొదటగా తిరగబడింది. 1827 లో కలకత్తా పల్లకీ బోయీలూ, 1855-57 లో కచార్ తేయాకు తోట కార్మికులు సమ్మె చేశారు. 1826లో హౌరా రైల్వే కళాసీలు, ఈస్టిండియా రైల్వే క్లర్కులు సమ్మె చేశారు. నాగపూర్ ఎంప్రస్ మిల్లు కార్మికులు 1877లో సమ్మె చేశారు. దేశ వ్యాపితంగా 1903 నుంచి ప్రారంభమై అనేక కార్మిక సంఘాలు వివిధ రంగాలలో ఏర్పడ్డాయి. 1908లో తిలక్ అరెస్టుకు నిరసనగా 2 లక్షల మంది బొంబాయి జౌళి కార్మికులు ఆరు రోజుల పాటు తొలి రాజకీయ సమ్మె జరిపారు. 1917 రష్యన్ విప్లవం జయప్రదమై తొలి సోషలిస్టు రాజ్యం ఏర్పడింది. ఇది ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గాన్ని ఉత్తేజపరిచింది. భారత జాతీయోద్యమ నాయకత్వం సైతం కార్మిక సంఘాలను స్థాపించింది. 1919 రౌలత్ చట్టం, జలియన్‌వాలాబాగ్ మారణకాండ భారత కార్మిక వర్గాన్ని తట్టి లేపింది. మహత్తర కార్మి సమ్మెలలో లక్షలాది మంది కార్మికులు పాల్గొన్నారు.

భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీకి స్థాపనకు ఐదేళ్ల ముందే తొలి కేంద్ర కార్మిక సంఘం అఖిల భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) 1920 అక్టోబరు 31 న బొంబాయిలోని ఆంపైర్ థియేటర్‌లో లాలాలజపతిరాయ్ అధ్యక్షతన స్థాపించారు. ఒక లక్షా 40 వేలమంది కార్మికులకు ప్రాతినిధ్యం వహించే 64 అనుబంధ యూనియన్లు, 43 సానుభూతి యూనియన్ల నుంచి 801 మంది ప్రతినిధులు వ్యవస్థాపక మహాసభలో పాల్గొన్నారు. ముందుగా 10 వేల మంది కార్మికులతో మహాప్రదర్శన జరిగింది. ఏఐటీయూసీ ఆవిర్భావం దేశ చరిత్రలో ఒక చారిత్రక సంఘటన. ఇది భారత కార్మిక వర్గంపై విశేషమైన ప్రభావాన్ని చూపింది. దేశ స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు వేదికగా నిలిచింది. భారదేశంలో సోషలిస్టు రాజ్య స్థాపన ప్రధాన లక్ష్యంగా ప్రకటించి గత 105 సంవత్సరాలుగా కార్మిక వర్గ చైతన్యానికి, సామాజిక మార్పునకు కృషి చేసింది. దేశ స్వాతంత్ర్య సాధనలో తొలిగా సంపూర్ణ స్వాతంత్ర్య నినాదాన్ని ఇచ్చి కార్మికులను వర్గ చైతన్యంతో సమీకరించి వారి హక్కుల సాధనకు నిర్విరామ పోరాటాలను నిర్వహించింది. అంతర్జాతీయ కార్మిక సంఘీభావ దృక్పథంతో వ్యవహరించింది. 1924లోనే భారతదేశాన్ని సోషలిస్టు రాజ్యంగా ప్రకటించాలని ఏఐటీయూసీ తీర్మానించింది. 1923 మే 1 న మద్రాసు మెరీనా బీచ్‌లో ఎర్రజెండాను సింగారవేలు చెట్టియార్ నాయత్వంలో ఆవిష్కరించి తొలిసారిగా భారతదేశంలో 'మేడే' నిర్వహించింది. 1917లో వచ్చిన రష్యా విప్లవ ప్రభావంతో భారత కార్మిక వర్గానికి నూతన సైద్ధాంతిక జవసత్వాలను ఏఐటీయూసీ సమకూర్చింది. సంస్థ స్థాపన అనంతర సంవత్సర కాలంలోనే 3 లక్షలకు పైగా కార్మికులు 183 సమ్మెలు జరిపారు. బొంబాయి జౌళి కార్మికులు, రైల్వే కార్మికుల సమ్మెలు జరిగాయి. 1926 నాటికి 200 కార్మిక సంఘాలు ఏర్పడ్డాయి. 1925లోనే 12 కోట్ల 50 లక్షల పనిదినాల నష్టం జరిగింది. పనిగంటల తగ్గింపు, బోనస్, అక్రమ రిట్రెంచ్‌మెంట్లకు నిరసనగా ఈ సమ్మెలు జరిగాయి. ఈ నేపథ్యంలోనే భారత కార్మిక వర్గ రాజకీయ శక్తిగా భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబరు 26 న కాన్పూర్ వేదికగా నిర్మాణం జరిగింది. దీనితో భారత కార్మిక వర్గానికి ఒక సైద్ధాంతిక పునాది ఏర్పడింది. కానీ నాటి బ్రిటీష్ పాలకులు శైశవ దశలోనే కార్మికోద్యమాన్ని అణిచివేయ సంకల్పించి ఎన్నో నిర్బంధాలను విధించారు. అనేక కుట్ర కేసులను బనాయించి దేశ భక్తులు, కమ్యూనిస్టులను, కార్మిక నాయకులను ముద్దాయిలుగాచేసి దీర్ఘకాలిక ద్వీపాంతర వాస కఠిన కారాగారవాస శిక్షలను విధించారు. కార్మిక సమ్మెలలో అనేక సందర్భాలలో జరిగిన కాల్పులు, లాఠీ చార్జీలలో అనేకమంది కార్మికులు మరణించటం, ఉద్యోగాలు కోల్పోవటం జరిగింది. స్వాతంత్ర్యం తర్వాత కూడా అనేక చారిత్రక సమ్మె పోరాటాలు దేశంలో జరిగాయి. రైల్వే, ఉక్కు కార్మికులు, జౌళి మిల్లు కార్మికులు, జూట్ కార్మికులు, ఓడ కళాసీలు, బట్టల మిల్లుల కార్మికులు, బొగ్గుగని కార్మికులు దీర్ఘకాలిక సమ్మెలు నిర్వహించారు. బ్రిటీష్ పాలకులపైన, దేశీయ పాలకులపైన పోరాడి దేశంలో కార్మిక వర్గం అనేక చట్టాలను సాధించుకుంది. ఈ క్రమంలో అనేక మంది కార్మికులు, నాయకులు పోలీసుల తుపాకీ గుళ్లకు బలయ్యారు. జైలు శిక్షలకు గురయ్యారు. అశేష త్యాగాలతో దేశ కార్మికవర్గం సాధించుకున్న చట్టాలు, ప్రయోజనాలు నేటి పాలకులు పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా మార్పులు చేస్తున్నారు. నూరేళ్లకు పైగా కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులకు నేడు తీవ్ర సవాళ్లు ఎదురౌతున్నాయి.

ఏఐటీయూసీ 105 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కార్మికవర్గం గురువారం దేశ వ్యాపితంగా జరుపుకుంటున్నది. భారత కార్మికవర్గ అగ్రగామి దళంగా ఏఐటీయూసీ ఈ నూటఐదు సంవత్సరాలలో చారిత్రక భూమికను నిర్వహించింది. శ్రామిక వర్గం, కష్టజీవుల ప్రయోజనాలకు నిరంతరం తపించింది. చీలికలు వాలికలు అయిన కార్మిక సంఘాలను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి ఐక్య పోరాటాలకు పునాదులు వేసింది. 1991 నవంబరు 29 న అన్ని కేంద్ర కార్మిక సంఘాలను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెకు ఏఐటీయూసీ నాయకత్వానికి శ్రీకారం చుట్టింది. ఈ కృషిలో కామ్రేడ్ గురుదాస్ దాస్‌గుప్తా కృషి మరవలేనిది. అప్పటి నుంచి నేటి వరకు స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ నేతృత్వంలో 20 సార్వత్రిక సమ్మెలు జరిగాయి. కోట్లాది మంది కార్మికులు, ఉద్యోగులు ఈ సమ్మెలలో, నిరసనలలో పాల్గొన్నారు. చలో పార్లమెంటు ప్రదర్శనలు, వర్కర్సు పార్లమెంట్ సభలు, సదస్సులు అనేక సార్లు జరిగాయి. గత పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం నరేంద్రమోదీ నాయకత్వంలో అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసనగా దేశ వ్యాపిత కార్యాచరణకు ఏఐటీయూసీ ప్రధాన ఇరుసుగా పనిచేస్తున్నది. ఎన్ని అవరోధాలు వచ్చినా ఐక్య కార్మికోద్యమం ద్వారా ఎదుర్కోవాలనే విశాల దృష్టితో ఏఐటీయూసీ వ్యవహరిస్తున్నది. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్‌లను తేవాలని కేంద్రం ప్రయత్నిస్తున్నది. దేశ స్వాతంత్ర్యానంతరం ప్రణాళికాబద్ధంగా నిర్మించిన ప్రభుత్వరంగ వ్యవస్థను సర్వనాశనం చేసి లక్షల కోట్ల విలువ చేసే ప్రజా సంపదను పెట్టుబడిదారులకు కారుచౌకగా దారాదత్తం చేస్తున్నారు. బ్యాంకులు, బీమా సంస్థలను, విమానాశ్రయాలను, పోర్టులను, రైల్వే స్టేషన్లు, స్థలాలను ప్రైవేటుపరం చేస్తున్నారు. బొగ్గుగనులు, ఉక్కు, ఇనుము పరిశ్రమ లను, నౌకా నిర్మాణాన్ని, చివరకు రక్షణ రంగంలోని ఆయుధ తయారీ కర్మాగారాలను సైతం ప్రైవేటురంగం పాలు చేస్తున్నారు. పారిశ్రామిక రంగంలో వీరి విధానాల వలన లక్షలాది చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతబడి కోట్లాది మంది ఉపాధిని కోల్పోయారు. దేశమంటే అదాని, అంబానిలనే తీరుగా మోదీ పాలనా విధానం ఉంది. భారతదేశ కార్మికోద్యమ చరిత్రలో ఏఐటీయూసీ స్పృశించని కార్మిక రంగం ఏదీ లేదంటే అతిశయోక్తి కాదు. "ప్రపంచ కార్మికులారా ఏకంకండి!" అన్న మార్క్స్ నినాదాన్ని భారతదేశ కార్మికుల ఐక్య పోరాటం ద్వారా ప్రతిధ్వనింప జేసిన ఏఐటీయూసీకి 105 వ వ్యవస్థాపక శుభ సందర్భంగా రెడ్ శాల్యూట్. ఏఐటీయూసీ తన లక్ష్యం సోషలిజం దిశగా పురోగమిస్తుందని ఆశిద్దాం...!

ఏఐటీయూసీ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు
సెల్: 9490952093



తక్కువ ప్రమాదకరమైన పార్టీలకే అవకాశం

సురవరం సుధాకరరెడ్డి

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేస్తున్న డెమొక్రటిక్ పార్టీ, రిపబ్లికన్ పార్టీలలో ఏదో ఒక తక్కువ ప్రమాదం కలిగిన పార్టీని ఎన్నుకోవడమే ఆ దేశ ప్రజల ముందున్న అవకాశం. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్, రిపబ్లికన్ పార్టీ తరఫున డొనాల్డ్ ట్రంప్ ఈ ఎన్నికల్లో తలపడుతున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల ప్రభావం ప్రపంచ దేశాలన్నింటిపైనా ఉంటుంది. ఈ రెండు పార్టీలకు మధ్య పెద్ద తేడా ఏమీ లేదు.

అధ్యక్ష ఎన్నిలు జరగడానికి మరో వారమే మిగిలి ఉంది. అమెరికా అతిపెద్ద దేశం, అలాగే ప్రపంచంలో అత్యంత సంపద్వంతమైంది, అత్యంత బలమైన ఆయుధ సంపద కలిగి ఉంది. దేశానికి ఇది అత్యంత ప్రమాదకరమైంది. గత కొన్ని శతాబ్దాలుగా అమెరికా 104కుపైగా యుద్ధాలు చేసింది. అయితే అమెరికా నేలపైన ఒక యుద్ధం కూడా జరగలేదు. చిన్నవి, మధ్య తరహావి, అతి పెద్ద ఆయుధాలను తయారుచేస్తూనే ఉంది. దేశంలో అన్ని రకాల ప్రజానీకం నివసిస్తోంది.

దేశంలో ఉన్న గొప్ప గొప్ప శాస్త్రవేత్తలు గొప్ప గొప్ప ఆవిష్కరణలు చేశారు. మానవాళికి ఇది ఎంతగానో సహకరించాయి. అత్యంత మేధావులు అసాధారణమైన విజయాలను ప్రజలకు అందించారు. అమెరికాను జార్జి వాషింగ్టన్, అబ్రహాం లింకన్ ఇంకా అనేకమంది గొప్ప అధ్యక్షులు పరిపాలించారు. ఇదంతా జరిగిన కథ. ప్రజల కొరకు, ప్రజలచేత, ప్రజాప్రభుత్వం అని అబ్రహాం లింకన్ నిర్వచించారు.

వాణిజ్యం, అంతర్జాతీయ సైనికబలం తదితర అనేక రంగాలలో ప్రపంచమంతటిపై ఐఎంఎఫ్ ప్రభావం చూపుతోంది. అలాగే అత్యంత ముఖ్యమైన అధ్యక్ష ఎన్నికలు కూడా ప్రభావం చూపుతాయి. ప్రస్తుతం అమెరికా ప్రజాస్వామ్యం కార్పొరేట్ల కొరకు, కార్పొరేట్లచేత, కార్పొరేట్ల సమాజాన్ని నెలకొల్పుతున్నది ఇక్కడి ఎన్నికల వ్యవస్థ. ఎన్నికలు సంక్లిష్టమైనవి. ఇవి కాలం చెల్లినవిగా గమనించవచ్చు. ఈ వ్యవస్థలో పోటీచేయడానికి సామాన్య ప్రజలు ఎన్నికల రంగంలో ప్రవేశించగలరా?

భారతదేశంలో కొన్ని దశాబ్దాల క్రితం పంచాయితీ వార్డు సభ్యులను ప్రజలు ఎన్నుకునే వారు. సభ్యులంతాకలిసి సర్పంచిని ఎన్నుకునే వారు. అయితే అమెరికాలో ఎలక్టొరల్ కాలేజి సభ్యులు 584 మంది ఉన్నారు. 50 రాష్ట్రాల నుంచి వీరిని ఎన్నుకుంటారు. 278 ఓట్లు లభించిన వ్యక్తి అమెరికా అధ్యక్షుడవుతారు. ఈ ఎన్నికల వ్యవస్థ చెల్లుబాటుకానిది. ఇది మితవాద పక్షానికి సహాయపడుతుంది. ఈ నేపథ్యంలో తక్కువ ప్రమాదం కలిగిన పార్టీలను ఎన్నుకునే మార్గం ఒక్కటే అమెరికా ప్రజలకు ఉన్న అవకాశం.

ఆదివారం మేడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరిగిన ట్రంప్ ర్యాలీ 1939లో జరిగిన నాజీ ర్యాలీని తలపించింది. ట్రంప్ ర్యాలీపై ఎవరికైనా సందేహాలుఉంటే ఆయన అనుచరులు అమెరికాలో ఫాసిస్టు ఉద్యమాన్ని విస్తరింప చేస్తున్నారు. ఆదివారం జరిగిన ర్యాలీని చూస్తే ఏమాత్రం సందేహించవలసిన అవసరంలేదు. న్యూయార్క్ నగరం నడిబొడ్డున జరిగిన ర్యాలీ 1939 ఫిబ్రవరిలో జర్మనీ-అమెరికా బండ్ నిర్వహించిన ర్యాలీ ఇప్పటి ట్రంప్ ర్యాలీని పోలిఉంది. ట్రంప్ ఆనాటి ఫాసిస్టు నిరంకుశుడైన నాజీ గుర్తుకు వస్తున్నాడు. ఇప్పటికీ చరిత్రలో నాజీతో పోల్చిన ట్రంప్ ర్యాలీనే చెప్పుకుంటున్నారు.

అధ్యక్ష పీఠంపై ఆసక్తి

దుర్గం రవీందర్

నవంబర్ 5న అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్నాయి. ప్రపంచ ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలపై ప్రభావం చూపే ఎన్నికలివి. శక్తిమంతమైన అమెరికా అధ్యక్ష పీఠం ఎవరిని వరిస్తుందని కొన్ని లక్షల మంది భారతీయులు, ప్రత్యేకించి తెలుగు రాష్ట్రాల కుటుంబాలకు చెందిన లక్షలాది మంది ఎదురు చూస్తున్నారు. డెమొక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య పోటీ ఉంది. ఈ పార్టీలు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి. 50 రాష్ట్రాల్లో 244 మిలియన్ల మంది ఓటు వేస్తారు. బ్యాలెట్ ద్వారా ఓటింగ్ జరుగుతుంది. అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్ పోటీ చేస్తున్నారు. ఆయనది ఏనుగు గుర్తు, బ్లూ కలర్. డెమొక్రటిక్ పార్టీ తరపున కమలా హారిస్ పోటీ చేస్తుండగా, ఆమెది గాడిద గుర్తు. వీరి మధ్య గట్టి పోటీ ఉంది. పార్టీల బలాన్ని బట్టి బ్లూ స్టేట్స్, రెడ్ స్టేట్స్ అని అంటారు. 50 రాష్ట్రాలను స్వింగ్ స్టేట్స్, బ్యాటిల్ గ్రౌండ్ స్టేట్స్, పర్పుల్ స్టేట్స్, సేఫ్ స్టేట్స్ అని గుర్తిస్తారు. మొత్తంగా ప్రజల ఓట్లతో సంబంధం లేకుండా ఎలక్టోరల్ కాలేజీ ఓట్లే గెలిపించే ఎన్నికలు ఇవి. డెమొక్రాట్ అభ్యర్థిగా బైడెన్ తప్పుకున్నాక కమలా హారిస్‌కు బలం పెరిగింది. ధన రూపంగా కూడా సాయం పెరిగింది. అమెరికాలో భారతీయ ఓటర్లు ఒక శాతం కంటే తక్కువ. అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసే స్థాయిలో బలం లేదు. ఓట్లపరంగా గెలుపును శాసించలేకపోవచ్చు గానీ... పార్టీలకు ఆర్థిక దన్నుగా నిలవగల స్థితి ఉంది. భారతీయుల్లో తెలుగు వారు గరిష్టంగా 20శాతం మంది ఉంటారేమో. వారందరూ ఓటింగుకు వస్తారనే నమ్మకం లేదు. భారతీయ అమెరికన్లు డెమొక్రాట్ పార్టీకి అనుకూలంగా ఉంటారు ఇప్పుడు ఈ పరిస్థితులు మారుతున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్ మధ్య స్నేహ సంబంధాలు ఉన్నాయి. ట్రంప్ గెలవాలని మోదీ అనుకుంటున్నట్లు వార్తలు వచ్చాయి. మోదీ-ట్రంప్ కాలంలో భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలలో మార్పు వచ్చింది. ఇద్దరు వ్యాపార, కార్పొరేట్ సంస్కృతికి చెందిన వారు. వారిద్దరికి మేల్ తాల్ జమాయించింది. 'ట్రంప్ ఈజ్ మై ఫ్రెండ్' అని మోదీ ప్రకటించారు. ఈ ప్రకటన అమెరికాలోని భారతీయ సమాజాన్ని కొంత ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా గుజ్జు-మార్వాడీల్లో చాలా మంది అమెరికాలో అధికారికంగా, అనధికారికంగా ఉన్నారు. అమెరికాలో భారతీయులకు అవసరమైన దినవెచ్చాలు అందించే దుకాణాలు మొదలుకుని వివిధ రకాల చిన్న పెద్ద దుకాణాలను వీరు నడుపుతారు. మోదీని మెచ్చేవారు, హిందూత్వవాదులు, అమెరికాలోని ఉత్తర భారతీయులు ట్రంప్‌కు అనుకూలంగా ఉన్నారు. తెలుగువారి అభిప్రాయాలూ భిన్న రీతుల్లో ఉన్నాయి. ట్రంప్ అధ్యక్షుడైతే ఆర్థిక వ్యవస్థ బాగు పడుతుందని, జాబ్ మార్కెట్ పుంజుకుంటుందనే ఆశ వీరిది. సాధారణంగా మధ్యతరగతి, పేద వర్గాలు డెమొక్రాట్ల వైపు ఉంటారు. ఇటీవలి కాలంలో ప్రవాస భారతీయుల్లో సంపన్నులు పెరిగారు. వీరు అమెరికన్ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వాన్ని కోరుకుంటారు. మొగ్గ రిపబ్లికన్ల వైపు మారడానికి ఇది ఒక కారణం. భారతీయుల్లో ప్రత్యేకించి డాక్టర్లు, ఐటీ రంగంలో ఉన్నవారు, పారిశ్రామికవేత్తలు రిపబ్లికన్లకు మద్దతిస్తున్నారు. ట్రంప్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు అనుసరించిన సరళీకృత ఆర్థిక విధానాల వల్ల వీరు లబ్ధి పొందారు. ట్రంప్ అధ్యక్షుడైతే అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని వీరు అనుకుంటున్నారు. భారతీయులకు సంబంధించినంత వరకు ఐటీ రంగం బాగుంటుందని నమ్ముతున్నారు. అబార్షన్ (గర్భవిచ్ఛిత్తి)సమస్యపై హారిస్ బలమైన ఆధిక్యాన్ని కలిగి ఉన్నారు. ఇది డెమొక్రటిక్ పార్టీకి ప్రయోజనకర అంశంగా ఉంది. అమెరికా రాజకీయాల్లో వృద్ధ నేతలు ఎక్కువవుతున్న నేపథ్యంలో విధానపరమైన అంశాలపై దృష్టి కేంద్రీకరించడం కన్నా ఇద్దరు అభ్యర్థుల వయసు, శారీరక, ఆరోగ్య పరిస్థితులపై ప్రజలు ఎక్కువగా దృష్టి పెట్టినట్లు నిపుణులు పేర్కొన్నారు. 1946, జూన్ 14న జన్మించిన ట్రంప్ వయసు 78 సంవత్సరాలు.

కమలకు 60ఏళ్లు. జర్మన్ ఆంగ్ల మూలాలున్న డొనాల్డ్ జాన్ ట్రంప్ రాయకీయ నాయకుడు, వ్యాపారవేత్త, విలాసపురుషుడు, పక్కా అమెరికన్... టెలివిజన్ వ్యాఖ్యాత, రచయిత, 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికలో రిపబ్లికన్ పార్టీ తరపున 45వ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ట్రంప్ వ్యక్తిగతంగా ఎప్పుడూ దివాలా ప్రకటించలేదు. ఆయన హోటల్, కేసినో వ్యాపారాలు ఆరుసార్లు దివాలా తీశాయి. వాస్తవానికి ఇవి దివాలాలు కావు. దివాలా చట్టంలోని చాప్టర్ 11లోని లొసుగులు వాడుకుంటూ వ్యాపారాలు చేయడం వంటిది. ఈ విషయాన్ని 2011లో న్యూస్‌వీక్ పత్రికతో మాట్లాడుతూ ట్రంప్ వెల్లడించారు. 'నేను దివాలా చట్టాలతో ఆడుకుంటాను. అవి నాకు ఎప్పుడూ మంచే చేశాయి' అని అన్నారు. ట్రంప్‌కు మూడు పెళ్లిళ్లు... ఐదుగురు పిల్లలు. తండ్రి మూలాలు జర్మనీలో.. తల్లి మూలాలు స్కాట్లాండ్‌లో ఉన్నాయి. భారతీయ నాయకులలాగే ట్రంప్ కూడా అనేక మార్లు పార్టీ మారారు. అమెరికాలో ఓటింగ్ శాతం తక్కువగానే ఉంటుంది. ఎక్కువగా ఓటింగ్ ఉండే గ్రామీణ ప్రాంతాల్లో ట్రంప్‌కు ఆదరణ తక్కువ. డెమొక్రాట్లను ఆదరించే నగర వాసులు ఓటింగుకు రానే రారు. అమెరికాలో స్థిరపడిన మన వారిలో చాలా మందికి అర్హతలు ఉన్నప్పటికీ ఓటరుగా నమోదు చేసుకోరు. ఓటరుగా నమోదైన వారిలో అనేక మంది ఓటు వేయరు. వెరసి తెలుగువాళ్లు, ఇతర భారతీయులు ఓటింగును అతి స్వల్పంగా ప్రభావితం చేయగలరు. సోషల్ మీడియాలో కొంత క్రియాశీలకంగా ఉంటారు. డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ తల్లి తమిళ భారతీయురాలు. తమిళులు ఆమెను తమ సొంత మనిషిగా చూస్తున్నారు. దక్షిణ భారతదేశానికి చెందిన కమలా హారిస్‌కు మద్దతు ఇస్తారు. ఈ వర్గాల ఓటర్లు చాలాతక్కువ. భారతీయ ఓటర్లు డెమొక్రాట్లను అభిమానించే వారే అయినా... ఇప్పుడు పరిస్థితి మారుతోంది. డెమొక్రాట్లు అనుసరిస్తున్న వలస విధానాలు భారతీయులకు ప్రతిబంధకంగా మారుతున్నాయి. చట్టబద్ధంగా ఇక్కడకు వచ్చిన భారతీయులు కూడా కొన్ని సందర్భాలలో ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి భారతీయులను కూడా చట్టవిరుద్ధంగా వచ్చిన వలసదారులుగా పొరబడుతున్న సందర్భాలు ఉన్నాయి. వలసదారుల విషయంలో ట్రంప్ విధానాలకే ఆదరణ ఉంది.

అమెరికాలో జాబ్ మార్కెట్ పడిపోయింది. లక్షలాది మంది భారతీయులు ఉద్యోగాలు కోల్పోయారు. వేలాది మంది విద్యార్థులు ఎంఎస్ పూర్తిచేసి ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వాతావరణం ఏర్పడడానికి నాలుగు సంవత్సరాలుగా డెమొక్రాట్లు అధికారంలో ఉండడం కూడా ఒక కారణమని భావిస్తున్నవారు లేకపోలేదు. అమెరికా అధ్యక్ష పదవి ఎన్నిక క్లిష్టంగా ఉంది. పెన్సిల్వేనియా, ఆరిజోనా, జార్జియా, మిచిగాన్, నార్త్ కరోలినా, విస్కాన్సిన్, నెవాడా అనే ఏడు రాష్ట్రాలను స్వింగ్ రాష్ట్రాలు అంటారు. అధ్యక్ష ఎన్నికల్లో వీటి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అందులో పెన్సిల్వేనియా కీలకం. ఈ రాష్ట్రంలో 19 ఎలక్టోరల్ ఓట్లు ఉన్నాయి. వాల్‌స్ట్రీట్ జర్నల్ పోల్ సర్వే ప్రకారం డొనాల్డ్ ట్రంప్ రేసులో కమలా హారిస్‌తో సమానంగా ఉన్నాడు. రిపబ్లికన్‌కు సర్వే మార్జిన్ ఆఫ్ ఎర్రర్‌లో స్వల్ప ఆధిక్యం చూపిస్తుంది. హారిస్ అనుకూలత, ఆమె ప్రజామోదం రేటింగ్‌లో ప్రతికూల మార్పు ఉంది. ఓటర్లలో 42 శాతం మంది హారిస్ మంచి ఉపాధ్యక్షురాలు అని అన్నారు. ట్రంప్ వైపు మొగ్గు చూపే యువకులు, హారిస్‌ను ఇష్టపడే యువకులంతా పోలింగ్ స్టేషన్‌లకు రాకపోవచ్చు. ఎన్నికల రోజున నమోదును అనుమతించే మిచిగాన్, విస్కాన్సిన్, నెవాడాతో సహా అనేక రాష్ట్రాల్లో పోటాపోటీ ఉంటుంది. తేడా ప్లస్ లేదా మైనస్ 2.5 శాతం పాయింట్ల్లో ఉంటుందని సర్వే చెప్పింది. ఆర్థిక వ్యవస్థను నిర్వహించడానికి ట్రంప్‌ను అమెరికన్లు మంచి అభ్యర్థిగా భావిస్తున్నారు. అయినప్పటికీ ఆయన హారిస్ కంటే దేశానికి నష్టదాయక వ్యక్తిగా పరిగణిస్తున్నారని వాల్‌స్ట్రీట్ జర్నల్ రాసింది.

సత్యేంద్ర జైన్ సహచరులు ఇద్దరికి బెయిల్

పీఎంఎల్‌ఏ... నిర్బంధాలకు అస్త్రం కాదు: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: అవినీతి కేసులో ఆప్ నేత సత్యేంద్ర జైన్ సహా నిందితులు వైభవ్ జైన్, అంకుష్ జైన్‌కు ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టాన్ని (పీఎంఎల్‌ఏ) నిర్బంధాలకు అస్త్రంగా వాడుకోరాదని ఈ సందర్భంగా పేర్కొంది. హత్య, అత్యాచారం లేక దోపిడీకి పాల్పడిన వారితో సమానంగా మనీలాండరింగ్ కేసులో నిందితులను పరిగణించరాదని జస్టిస్ మనోజ్ కుమార్ ఓర్హి వ్యాఖ్యానించారు. ఇద్దరు నిందితులకు బెయిల్ ఇచ్చారు. పీఎంఎల్‌ఏ చట్టంలోని సెక్షన్ 45ను ప్రస్తావిస్తూ, దీనిని అదునుగా చేసుకొని వ్యక్తులను బెయిల్ ఇవ్వకుండా నిర్బంధంలో ఉంచడం సరైనది కాదని 18 పేజీల తీర్పులో జస్టిస్ ఓర్హి పేర్కొన్నారు. బెయిల్-నిబంధన, జైలు-మినహాయింపు అని ఆయన వ్యాఖ్యానించారు. 'ఈ కేసులో చాలా మంది నిందితులు ఉన్నారు. వేలాది పేజీల ఆధారాలను పరిశీలించాలరు. ఎందరినీ విచారించారు. కేసు వాదనలు దశలో ఉంది. ఇప్పట్లో పరిష్కారం కాబోదు' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రూ.లక్ష విలువ చేసే వ్యక్తిగత బాండ్లు, అంతే మొత్తంలో పూచీకత్తుతో ఇద్దరు అర్జీదారులకు బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు వెలువరించారు. అనుమతి లేకుండా ఢిల్లీ/ఎన్‌సీఆర్ బయటకు వెళ్లరాదు వంటి బెయిల్ షరతులకు కట్టుబడాలని ఆదేశించారు. కాగా, 2022 మేలో ఈడీ అరెస్టు చేసిన సత్యేంద్ర జైన్‌కూ కోర్టు బెయిలివ్వడం విదితమే.

నా కుటుంబాన్ని దుర్భాషలాడారు

తృణమూల్ ఎంపీ

కోల్‌కతా: వక్ఫ్ బిల్లుపై నిర్వహించిన పార్లమెంటరీ కమిటీ సమావేశంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ కళ్యాణ్ బెనర్జీ అనుచితంగా ప్రవర్తించారు. బీజేపీ నేత అభిజిత్ గంగోపాధ్యాయతో జరిగిన వాగ్వాదంలో ఎంపీ బెనర్జీ ఓ గాజు సీసాను పగులగొట్టి దానిని ప్యానల్ చైర్మన్ జగదాంబికా పాల్‌పైకి విసిరారు. దీంతో ఎంపీ బొటనవేలు, చూపుడు వేలికి గాయం కావడంతో ప్రథమ చికిత్స చేశారు. అయితే వారం రోజుల అనంతరం ఆరోజు జరిగిన ఘటనపై తాజాగా ఎంపీ కళ్యాణ్ బెనర్జీ స్పందించారు. తన చర్యలను సమర్థించుకున్నారు. బీజేపీ ఎంపీ గంగోపాధ్యాయ తనను దుర్భాషలాడారని బెనర్జీ ఆరోపించారు.

'నాకు రూల్స్ , రెగ్యులేషన్స్ అంటే చాలా గౌరవం. దురదృష్టవశాత్తు అభిజిత్ గంగోపాధ్యాయ నాపై నిబంధనలు ఉల్లంఘిస్తూ ఆరోపణలు చేశారు. ఆ రోజు మొదటగా కాంగ్రెస్ ఎంపీ నసీర్, అభిజిత్ గంగోపాధ్యాయ మధ్య మాటల యుద్ధం జరిగింది. అప్పుడు ఆయన నన్ను, నా తల్లి, మా నాన్న, నా భార్యను దుర్భాషలాడడం ప్రారంభించారు. ఆ సమయంలో జేపీసీ చైర్మన్ అక్కడ లేరు. చైర్మన్ అక్కడ లేనప్పుడు అభిజిత్ గంగోపాధ్యాయ నా పట్ల కఠినంగా ప్రవర్తించారు. జేపీసీ చైర్మన్ జగదాంబిక పాల్... ఎంపీ గంగోపాధ్యాయ పట్ల పక్షపాతంతో వ్యవహరించారు. అది నాకు చాలా విసుగు తెప్పించింది. అప్పుడు నేను టేబుల్‌పై ఉన్న గాజు సీసా పగులగొట్టాను. నేను దానిని చైర్మన్‌పైకి విసిరేయాలని అనుకోలేదు. సభ్యుడిని సస్పెండ్ చేసే అధికారం చైర్మన్‌కు లేదు. స్పీకర్‌కు మాత్రమే అధికారం ఉంది' అని అన్నారు.

ముగ్గురు ఉగ్రవాదుల కాల్చివేత

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అఖ్నూర్ సెక్టార్‌లో సైనిక అంబులెన్స్‌పై దాడి చేసిన ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా సిబ్బంది మట్టుబెట్టారు. సోమవారం సైన్యం చేపట్టిన భీకర ఆపరేషన్ మంగళవారం కూడా కొనసాగింది. నిన్ననే ఒక ఉగ్రవాదిని అంతం చేసిన దళాలు నేడు మరో ఇద్దరిని హతమార్చాయి. అఖ్నూర్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ సమీపంలో ఉన్న ఓ గ్రామం మీదుగా వాహనం వెళుతుండగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. అనంతరం సమీపంలోని అడవుల్లోకి పారిపోయారు. ఉగ్రవాదులపై 'ఆపరేషన్ అసన్'ను ప్రారంభించారు. దీంతోపాటు కశ్మీర్‌లో పాగా వేసిన ఎన్ఎస్‌జీ దళాలు ఆ అడవులకు చేరుకొన్నాయి. ఈ ఆపరేషన్ కోసం సైన్యం ఏకంగా 'బీఎంపీ-2 శరత్' ఇన్‌ఫాంట్రీ ఫైటింగ్ వాహనాలను రంగంలోకి దించింది. వీటికి కవచాలు ఉండటంతో అడవుల్లో నక్కిన ఉగ్రవాదులు మన సైన్యంపై కాల్పులు జరిపినా... ప్రాణనష్టం చోటుచేసుకోకుండా చేయగలిగారు. దీనికితోడు ఈ ట్యాంక్‌లపై ఉన్న భారీ మిషిన్‌గన్‌లు, గ్రనేడ్ లాంఛర్లు ఉగ్రవాదులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. నిన్ననే ఒక టెర్రరిస్టును హతమార్చగా.. మంగళవారం మరో ఇద్దరిని అంతం చేశాయి. ఈ మొత్తం ఆపరేషన్‌లో భద్రతా దళాలు ఫాంటమ్ అనే జాగిలాన్ని కోల్పోయాయి. ఉగ్రవాదులతో అతి సమీపం నుంచి పోరాడుతున్న వేళ తూటా తగలడంతో అది తీవ్రంగా గాయపడి కన్నుమూసింది. 'ఫాంటమ్ అంకితభావం, విశ్వాసం, ధైర్యాన్ని మేము ఎప్పటికీ మరచిపోము' అంటూ వైట్‌నైట్ కోర్ దానికి సంతాపం తెలిపింది.

తీహార్ జైలు వార్డెన్ కనుసన్నల్లో డ్రగ్స్ ఫ్యాక్టరీ

న్యూఢిల్లీ: నిషేధిత మాదక ద్రవ్యం మెథాంపెటమైన్(మెథ్) తయారీ ల్యాబ్‌ను ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో ఎన్‌సీబీ అధికారులు గుర్తించారు. దీని నిర్వహణ వెనుక ఏకంగా తీహార్ జైలు వార్డెన్ హస్తం ఉందని తెలుసుకొని నిర్ఘాంతపోయారు. అక్టోబర్ 25వ తేదీన గ్రేటర్ నోయిడా పరిధిలో ఎన్‌సీబీ దాడులు నిర్వహించింది. ఒక ఇంట్లో నిర్వహిస్తున్న మెథ్ ల్యాబ్‌ను గుర్తించింది. దీనిని తీహార్ జైలు వార్డెన్, ఢిల్లీకి చెందిన ఓ వ్యాపారవేత్త, ముంబైకి చెందిన కెమిస్ట్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ దేశీయ వినియోగానికి, అంతర్జాతీయ ఎగుమతుల కోసం సింథటిక్ డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘన, ద్రవ రూపాల్లో ఉన్న దాదాపు 95 కిలోల మెథ్‌ను స్వాధీనం చేసుకొన్నారు. ఈ ఫ్యాక్టరీ ఆవరణలో ఎసిటోన్, సోడియం హైడ్రాక్సైడ్, మిథాలిన్ క్లోరైడ్, ప్రీమియం గ్రేడ్ ఎథనాల్, రెడ్ పాస్ఫరస్, ఈథైల్ ఎసిటేట్ వంటివి లభించాయి. తయారీ కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకొన్న పరికరాలు ఇక్కడ ఉన్నాయి. ఇక్కడ పట్టుబడిన వ్యాపారవేత్తను గతంలో ఒక ఎన్డీపీఎస్ కేసులో డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అరెస్టు చేసింది. ఆ సమయంలో అతడిని తీహార్ జైల్లో ఉంచగా... అక్కడ వార్డెన్‌తో పరిచయం పెంచుకొని అతడిని కూడా ఈ మత్తు వ్యాపారంలోకి దించాడు. వీరి ఫ్యాక్టరీలో ముంబైకి చెందిన కెమిస్ట్ మాదక ద్రవ్యాలు తయారు చేయగా... వాటి నాణ్యతను ఢిల్లీలో ఉండే మెక్సికన్ ముఠా సభ్యుడు పరీక్షించేవాడని ఎన్‌సీబీ ఓ ప్రకటనలో తెలిపింది. గతంలో ఎన్‌సీబీ గుజరాత్‌లోని గాంధీనగర్, అమ్రేలి, రాజస్థాన్‌లోని జోధ్‌పూర్, సిరోహి, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈ డ్రగ్ ల్యాబ్‌లను కనుగొన్నారు.

టికెట్ దక్కక అజ్ఞాతంలోకి సిట్టింగ్ ఎమ్మెల్యే

ముంబై: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ దక్కలేదని సిట్టింగ్ ఎమ్మెల్యే ఒకరు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తనను కాదని మరొకరికి టికెట్ ఇవ్వడంతో ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మహారాష్ట్రలో ఎన్నికల తేదీ దగ్గరపడుతోన్నకొద్దీ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. టికెట్లు దక్కినవారు విజయం కోసం పోరాడుతుంటే... దక్కనివారు నిరాశలో మునిగిపోయారు. సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీనివాస్ వంగకు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన పార్టీ మరోసారి టికెట్ ఇవ్వలేదు. ఆయనకు బదులు పాల్ఘర్ స్థానం నుంచి మాజీ ఎంపీ రాజేంద్ర గోవిట్‌ను బరిలోకి దింపింది.

దాంతో శ్రీనివాస్ తీవ్ర వేదనకు గురయ్యారని సన్నిహితులు వెల్లడించారు. 2022లో ఉద్ధవ్ ఠాక్రే వర్గాన్ని వీడి, చీలికవర్గమైన షిండే వర్గంతో వెళ్లినందుకు తగిన శాస్తి జరిగిందని కన్నీటిపర్యంతమైనట్లు పేర్కొన్నారు.

అధికారం కోసం కుటుంబాన్ని విడదీస్తారా?

అజిత్‌పై శరద్ పవార్ మండిపాటు

బారామతి (మహారాష్ట్ర): నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ-ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్... తన మేనల్లుడు, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం సొంత నియోజకవర్గం బారామతిలో ఆయన మాట్లాడుతూ అధికార కాంక్షతో కుటుంబాన్ని విడదీస్తారా అంటూ అజిత్‌పై విరుచుకుపడ్డారు. వాస్తవంగా అజిత్ అధికార కాంక్షతోనే తన కుటుంబాన్ని విచ్ఛిన్నం చేశారని ఆరోపించారు. బారామతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తన మనుమడు, ఎన్‌సీపీ (ఎస్‌పీ) అభ్యర్థి యుగేంద్ర పవార్ విజయం కోసం పవార్ ప్రచారం చేశారు. ఒక రోజు ముందు ర్యాలీలో యుగేంద్ర అభ్యర్థిత్వంపై భావోద్వేగానికి గురయ్యారు. మహారాష్ట్రలోని 288 స్థానాలకు నవంబర్ 20న ఎన్నికలు జరగనుండగా.. మూడు రోజుల తర్వాత ఓట్ల లెక్కింపు జరగనుంది. సోమవారం జరిగిన ర్యాలీలో బారామతి ఎమ్మెల్యే అజిత్ పవార్ మాట్లాడుతూ యుగేంద్ర అభ్యర్థిత్వాన్ని ప్రస్తావిస్తూ కుటుంబ కలహాలు రాకుండా 'సీనియర్లు' చూసుకోవాల్సి ఉందని ఆరోపించారు. ఇదిలాఉండగా, బారామతి సమీపంలోని కన్హేరి పట్టణంలో ర్యాలీని ఉద్దేశించి శరద్ పవార్ మాట్లాడుతూ 'నా తల్లిదండ్రులు, సోదరులు ఇంటిని (కుటుంబం) విచ్ఛిన్నం చేసే పాపాన్ని నాకు ఎప్పుడూ నేర్పించలేదు. చాలాకాలం క్రితం మహారాష్ట్రకు నాయకత్వం వహించే బాధ్యతను ప్రజలు నాకు అప్పగించారు. నేను ఇప్పుడు సలహాదారుడిని. పార్టీ వ్యవహారాలను కొత్త తరానికి అప్పగించాను' అని తెలిపారు. రాజకీయాలలో అనిశ్చితిని ఎత్తిచూపుతూ, అధికారం కోసం తన సహచరులను విడిచిపెట్టకూడదని కేంద్ర మాజీమంత్రి అన్నారు. 'దురదృష్టవశాత్తు, మేము (ఎన్‌సీపీ) అధికారంలో లేనప్పుడు మా సహచరులు కొందరు తెల్లవారుజామున అకస్మాత్తుగా మేల్కొని ప్రమాణం చేశారు. ఆ ప్రభుత్వం నాలుగు రోజులు కూడా కొనసాగలేదు' అని శరద్ పవార్ అన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రభుత్వ ఏర్పాటుపై రాజకీయ టగ్ ఆఫ్ వార్ మధ్య రాజ్‌భవన్‌లో బీజేపీకి చెందిన దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎంగా, ప్రతిపక్ష ఎన్‌సీపీ (అవిభక్త) సభ్యుడిగా ఉన్నప్పుడు అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. 'అతను (అజిత్) నాలుగు సార్లు డిప్యూటీ సీఎంగా పని చేసినప్పటికీ ఉప ముఖ్యమంత్రి పదవిని దక్కించుకోవడానికి అవతలి వైపునకు వెళ్లాడు. మీరు చాలాసార్లు స్థానం పొందారు. మీరు ఒక్కసారి మాత్రమే పదవిని పొందలేకపోతే, మీరు ఇంటిని (కుటుంబాన్ని) విచ్ఛిన్నం చేస్తారా?' అని శరద్ పవార్ ప్రశ్నించారు. 'ఇప్పుడు నేను కుటుంబాన్ని విచ్ఛిన్నం చేశానని అంటున్నారు. ఇది వినడానికి తమాషాగా ఉంది' అని అన్నారు. తాను పవార్ వంశంలో ఎప్పుడూ చీలికను సృష్టించలేదని, కుటుంబ పెద్దగా అందరూ తన మాట వింటారని సీనియర్ రాజకీయ నాయకుడు నొక్కి చెప్పారు. 'నేను ఎవరికీ వ్యతిరేకంగా వెళ్లడం ద్వారా ఏమీ చేయలేదు. అలా చేయను. ఎవరు ఎలాంటి వైఖరి తీసుకున్నా ముందుకు వెళుతున్నా. నేను తప్పు దారిలో వెళ్లను. నా కుటుంబం ఐక్యంగా ఉండేలా చూస్తాను' అని శరద్ పవార్ అన్నారు. అజిత్‌ను లక్ష్యంగా మాట్లాడుతూ 'నేను కుటుంబంలో చీలికను సృష్టించానని చెబుతున్నారు. కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసే పాపం నా తల్లిదండ్రులు, సోదరులు ఎప్పుడూ నేర్పించలేదు. అనంతరావు పవార్ (అజిత్ పవార్ తండ్రి) తో సహా నా సోదరులందరూ నాతో కలిసి ఉన్నారు' అని అన్నారు. ఈ సందర్భంగా శరద్ పవార్... మహారాష్ట్ర, జాతీయ స్థాయిలో రాజకీయాలపై ఎలా దృష్టి కేంద్రీకరించారో, గృహ సమస్యలు, వ్యవసాయం తన కుటుంబ సభ్యులచే చూసుకునేవారని గుర్తు చేసుకున్నారు. 'నా సోదరుల ఆశీర్వాదం వల్ల నేను నా ఉద్యోగంపై దృష్టి పెట్టగలిగాను. నేను వారి పిల్లల పట్ల వివక్ష చూపను' అని అన్నారు. కాగా, అజిత్ పవార్ సతీమణి సునేత్రా పవార్ బారామతి లోక్‌సభ నియోజకవర్గం నుంచి తన తొలి ఎన్నికల పోటీలో ఆమె కోడలు, శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే చేతిలో ఓడిపోయారు. శరద్ పవార్ మాట్లాడుతూ తాను అనేక మంది నేతలకు మంత్రి పదవులు ఇచ్చానని, అయితే సుప్రియా సూలేకు ఒక్క పదవి కూడా ఇవ్వలేదని పవార్ తెలిపారు. తాను స్థాపించిన ఎన్‌సీపీ పేరును, గుర్తును ఇతర వర్గానికి కేటాయించినందున తనను కోర్టుకు లాగారని పవార్ సీనియర్ చెప్పారు.

వయనాడ్‌లో పునరావాస చర్యల్లో నిర్లక్ష్యం

మోదీ ప్రభుత్వంపై ప్రియాంక ఆరోపణ

వయనాడ్ (కేరళ) : కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా మంగళవారం వయనాడ్ ఉప ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పర్వత ప్రాంత జిల్లాలోని కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల పునరావాసం కోసం బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎటువంటి నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న వైఖరి ప్రజలు, దేశం పట్ల గౌరవం లేకపోవడాన్ని సూచిస్తోందని, గత 10 సంవత్సరాల పాలనలో చేసిన విధానాలను చూస్తే కూడా అదే స్పష్టమవుతోందని ప్రియాంక అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఈంగపూజలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దుతో సహా చేపట్టిన అనేక విధానాలు ఎప్పుడూ ప్రధానికి చెందిన ఐదు నుంచి ఆరుగురు వ్యాపార స్నేహితులకు అనుకూలంగా ఉన్నాయని, అవి ప్రజలకు ప్రయోజనం కలిగించవని విమర్శించారు. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనను ప్రస్తావిస్తూ, ప్రధాని మోదీ జిల్లాకు వచ్చి ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, ప్రజలను పరామర్శించి వారికి అన్ని రకాలుగా సహాయం చేస్తామని హామీ ఇచ్చారని ఆమె అన్నారు. అయితే నెలలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం బాధిత ప్రజల పునరావాసం కోసం ఎలాంటి నిధులు ఇవ్వలేదన్నారు. రైతుల పట్ల కనికరం చూపలేదని, దేశవ్యాప్తంగా గిరిజన సంఘాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ప్రజా అవసరాలను తీర్చకుండా పెద్ద కార్పొరేట్‌లకు భూమిని కేటాయిస్తోందని తెలిపారు. ఉపాధి, విద్య, వైద్యం, ఇతర ముఖ్యమైన రంగాలను మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. 'మోదీ ప్రభుత్వం దేశ ప్రజల పట్ల పూర్తి అగౌరవాన్ని ప్రదర్శించింది. ప్రజల పట్ల గౌరవం కోల్పోతే దేశం పట్ల గౌరవం పోతుంది. అధికారం మాత్రమే ముఖ్యం, ప్రజలు పట్టింపు లేని రాజకీయాలు నేడు దేశంలో ప్రబలంగా ఉన్నాయి. అది మారాలి' అని అన్నారు. మణిపూర్‌లో దాదాపు ఏడాది కాలంగా జరుగుతున్న హింసను కూడా ఆమె ప్రస్తావిస్తూ, ఏ విధంగానైనా అధికారంలో ఉండటానికి ప్రయత్నించడం 'తప్పుడు రాజకీయం' అని తెలిపారు. తన సోదరుడికి మద్దతు ఇచ్చినందుకు, ఓటు వేసినందుకు తాను, తన కుటుంబం వయనాడ్ ప్రజలకు 'రుణపడి ఉన్నాం' అని అని ప్రియాంక చెప్పారు. వయనాడ్ ప్రజలకు, రాహుల్ గాంధీకి మధ్య ఏర్పడిన ప్రేమ, విశ్వాసం, విధేయత అనే బంధానికి తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని, అందుకే ఆ నియోజకవర్గాన్ని వదులుకోవాల్సి వచ్చినప్పుడు రాహుల్ చాలా బాధపడ్డానని అన్నారు. కేంద్రంలో కానీ, కేరళలో కానీ కాంగ్రెస్ అధికారంలో లేకపోయినా వయనాడ్ ప్రజల సమస్యలను పార్లమెంటులో లేవనెత్తుతానని ప్రియాంక అన్నారు. 'నేను నిన్ను నిరాశపరచను' అని ఆమె చెప్పారు. తరువాత సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో వయనాడ్ ఎల్లప్పుడూ మన భాగస్వామ్య విలువలు, సామాజిక సామరస్యం, లౌకికవాదం, న్యాయం, మన రాజ్యాంగం గౌరవించే విలువల కోసం నిలుస్తుంది. ఈ ఆదర్శాలను సమర్థిస్తాను. వయనాడ్ పురోగతి, శ్రేయస్సు కోసం నన్ను నేను పూర్తిగా అంకితం చేస్తానని వాగ్దానం చేస్తున్నాను' అని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఉత్తర ప్రదేశ్‌లోని రాయ్ బరేలీ నియోజకవర్గంలో రాహుల్ గాంధీ విజయం సాధించడంతో ఆ స్థానాన్ని ఖాళీ చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. నవంబరు 13న ఉప ఎన్నిక జరగనుంది.

జడ్జితో ఘర్షణ... న్యాయవాదులపై పోలీసు జులుం

ఘజియాబాద్: యూపీలోని ఘజియాబాద్ కోర్టు మంగళవారం రణరంగంగా మారింది. జిల్లా కోర్టులో ఓ బెయిల్ పిటిషన్ విషయంలో జడ్జి, న్యాయవాది మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. ఆ తర్వాత జడ్జి ఛాంబర్ వద్ద భారీ సంఖ్యలో న్యాయవాదులు గుమిగూడారు. ఆందోళన చేపట్టిన న్యాయవాదులను తరిమేందుకు పోలీసులు రంగ ప్రవేశం చేశారు. పరిస్థితి అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. న్యాయవాదులను వెంటాడి తరిమేశారు. ఆ తర్వాత పారామిలిటరీ దళాలు కూడా కోర్టు ఆవరణకు చేరుకున్నాయి. పోలీసుల దాడిలో అనేక మంది న్యాయవాదులు గాయపడ్డారు. పరిస్థితిపై చర్చించేందుకు బార్ అసోసియేషన్ సమావేశం నిర్వహించింది. జడ్జి ఛాంబర్ నుంచి వెళ్లగొట్టిన తర్వాత... న్యాయవాదులంతా సమావేశమై ధర్నా చేపట్టారు. భద్రతా దళాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బెయిల్ పిటిషన్‌పై జడ్జి, న్యాయవాది మధ్య జరిగిన వాగ్వాదం చివరకు గొడవకు దారితీసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

అమితాబ్ వద్ద అప్పు తీసుకున్న రతన్ టాటా

ముంబై: ఇటీవల మృతిచెందిన టాటా సంస్థ అధినేత రతన్ టాటా గురించి కొన్ని ఆసక్తికర విషయాలను బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ వెల్లడించారు. కౌన్ బనేగా కరోడ్‌పతి 16వ సీజన్‌లో రతన్ టాటా గురించి అమితాబ్ బచ్చన్ మాట్లాడారు. రతన్ టాటా చాలా సాధారణ మనిషి అని, అలాంటి ఉన్నతమైన వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిని చూడలేదన్నారు. ఆయన గొప్పతనాన్ని మాటల్లో చెప్పలేమన్నారు. ఓసారి తాను వెళ్తున్న విమానంలో రతన్ టాటా ఉన్నారని, హీత్రూ విమానాశ్రయంలో దిగిన తర్వాత... రతన్ టాటా తన వ్యక్తుల గురించి ఎదురుచూశారన్నారు. వాళ్లు రాకపోవడంతో ఆయన ఫోన్ చేసేందుకు ఫోన్‌బూత్ వెళ్లారని, ఆ సమయంలో తాను అక్కడే నిలబడినట్లు అమితాబ్ తెలిపారు. కొంత సమయం తర్వాత ఫోన్ బూత్ నుంచి బయటకు వచ్చిన రతన్ టాటా... తన వద్దకు వచ్చి అమితాబ్ కొంత డబ్బు అప్పు ఇస్తావా అని అడిగినట్లు బిగ్‌బీ గుర్తు చేశారు. ఫోన్ కాల్ చేసేందుకు తన వద్ద డబ్బులు లేవని రతన్ టాటా పేర్కొన్నట్లు అమితాబ్ వెల్లడించారు.

చత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: లిక్కర్ కుంభకోణంలో చత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లోని మొత్తం 17 చోట్ల ఈడీ మంగళవారం ఏకకాలంలో సోదాలు చేసింది. సీనియర్ ఐఏఎస్ అధికారి వినయ్‌కుమార్ చౌబే, ఎక్సైజ్ ఉన్నతాధికారి గజేంద్రసింగ్ నివాసాలు, స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న కంపెనీల్లో ఈడీ తనిఖీలు నిర్వహించింది. ఐఏఎస్ అధికారులతో కలిపి మొత్తం ఏడుగురితో కూడిన సిండికేట్‌పై చత్తీస్‌గఢ్ యాంటీ కరప్షన్ బ్యూరో కేసు నమోదు చేసింది. చత్తీస్‌గఢ్‌లో లిక్కర్‌స్కామ్‌కు పాల్పడటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు సిండికేట్ భారీగా గండికొట్టిందన్న ఆరోపణలపై కేసు రిజిస్టర్ చేశారు. ఇదే కేసులో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేసేందుకు తాజాగా ఈడీ రంగలోకి దిగింది.

విమానాలకు బెదిరింపుల వెనుక మహారాష్ట్ర వ్యక్తి

న్యూఢిల్లీ: విమానాలకు సంబంధించి బాంబు బెదిరింపులకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని మహారాష్ట్ర పోలీసులు గుర్తించారు. నిందితుడు గతంలో ఉగ్రవాదంపై ఓ పుస్తకాన్ని రచించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాగపూర్‌లోని గోండియాకు చెందిన జగదీశ్ యూకీ అనే వ్యక్తి ఇ-మెయిల్ ద్వారా ఎయిర్‌లైన్స్‌లకు నకిలీ బాంబు బెదిరింపులు పంపించాడు. దీని కారణంగా అనేక విమానాలు ఆలస్యంగా నడిచాయి. దీంతోపాటు ప్రధానమంత్రి కార్యాలయం, రైల్వే మంత్రి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఎయిర్‌లైన్స్ కార్యాలయాలకు, డీజీపీ, ఆర్‌పీఎఫ్ సహా వివిధ ప్రభుత్వ సంస్థలకు బెదిరింపు మెసేజ్‌లు పంపినట్లు వెల్లడించారు. మరోవైపు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు సైతం బెదిరింపులు అందాయి. దీంతో ఆయన నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. తాను తెలుసుకున్న రహస్య ఉగ్రవాద కోడ్‌పై సమాచారం ఇచ్చేందుకు అవకాశం ఇవ్వకపోతే నిరసన తెలుపుతానంటూ నిందితుడు ఆ మెసేజ్‌లో పేర్కొన్నాడు. అదేవిధంగా ఉగ్రవాద బెదిరింపులపై తనకున్న అవగాహన గురించి చర్చించేందుకు ప్రధాని మోదీతో సమావేశం కావాలని అభ్యర్థించాడు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉండగా... అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపుచర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. 2021లో నిందితుడు ఓ కేసులో అరెస్టయినట్లు వెల్లడించారు. కొన్ని రోజులుగా భారత్‌కు చెందిన విమానాలకు బూటకపు బాంబు బెదిరింపులు పెరిగిపోయాయి. 13 రోజుల్లో దాదాపు 300కు పైగా విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. వీటిల్లో చాలావరకు సామాజిక మాధ్యమాల వేదికగా వచ్చినట్లు తెలుస్తోంది.

70 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఆరోగ్యరక్ష

ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: డెబ్బై ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పౌరులందరికీ ఆరోగ్య కవరేజీని అందించే ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన 2 పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ప్రారంభించారు. ఈ పథకం సుమారు 4.5 కోట్ల కుటుంబాల్లోని ఆరు కోట్ల మంది వృద్ధులకు ప్రయోజనం చేకూరుస్తుందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ పథకం కింద, ఆయుష్మాన్ కార్డు పొందిన వారు అక్టోబర్ 29 నుండి ఏదైనా ఎంపిక చేసిన ఆసుపత్రులలో రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స పొందవచ్చు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ... రాజకీయ ప్రయోజనాల కోసమే ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. దీంతో విస్తరించిన ఈ పథకం ద్వారా ఈ రెండు రాష్ట్రాలకు చెందిన వృద్ధులు ఉచిత చికిత్సను పొందలేరని తాను బాధపడ్డానని అన్నారు. 70 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వృద్ధులందరికీ ఆరోగ్య బీమా పథకం ఆయుష్మాన్ భారత్‌ను వర్తింపజేస్తున్నట్లు ప్రధాని మంగళవారం ప్రకటించారు. 'ఢిల్లీ, పశ్చిమ బెంగాల్‌లోని 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ నేను సేవ చేయలేనందుకు క్షమాపణలు కోరుతున్నాను. మీ బాధల గురించి తెలుసుకుంటాను కానీ నేను మీకు సహాయం చేయలేను' అని మోదీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా ఈ పథకాన్ని అమలు చేయకపోవడమే ఇందుకు కారణమన్నారు. 70 ఏళ్లు పైబడిన వారికి ఆసుపత్రుల్లో ఉచిత చికిత్స అందుతుందని, వారికి 'ఆయుష్మాన్ వయ వందన' కార్డును అందజేస్తామని తెలిపారు. తొమ్మిదో ఆయుర్వేద దినోత్సవం, హిందువుల దేవుడైన ధన్వంతరి జయంతి సందర్భంగా రూ.12,850 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన మోదీ..... ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 70 ఏళ్లు పైబడిన వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం కిందకు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీ నేడు నెరవేరుతోందని మోదీ పేర్కొన్నారు.

డ్రోన్లు, పారాగ్లైడర్లపై నిషేధం

మహారాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

ముంబై: మహారాష్ట్ర ఎన్నికల ఉగ్రదాడుల ముప్పు పొంచి ఉంది. దీంతో ముంబై పోలీసులు దాదాపు నెల రోజుల పాటు ఆంక్షలు విధించారు. డ్రోన్లు, పారాగ్లైడర్లు, రిమోట్ కంట్రోల్‌తో నడిచే మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, హాట్ ఎయిర్ బెలూన్లు ఎగురవేయడంపై నిషేధం విధించారు. అక్టోబర్ 31 నుంచి నవంబర్ 29 వరకు మొత్తం 30 రోజులు ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయని మంగళవారం అధికారులు వెల్లడించారు. ఉగ్రముప్పు కారణంగా ఆంక్షలు విధించినట్టు తెలిపారు. ఉత్తర్వుల ప్రకారం... వీవీఐపీలు లక్ష్యంగా చేసుకునేందుకు, ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడేసేలా, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసేందుకు ఉగ్రవాదులు, సంఘ వ్యతిరేక శక్తులు వాటిని వినియోగించుకునే అవకాశం ఉందని పోలీసులు వెల్లడించారు. ఎగిరేవస్తువుల ద్వారా ఎలాంటి విధ్వంసం జరగకుండా తగిన ఆంక్షలు అవసరమని స్పష్టంచేశారు. ఆంక్షలు ఉల్లంఘించే వారు శిక్షార్హులని తెలిపారు. మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం వాడివేడిగా జరుగుతోంది. 288 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 20న ఎన్నికలు జరగనున్నాయి. 23న ఫలితాలు వెల్లడికానున్నాయి. నవంబర్ 26, 2008న ముంబైలో ఉగ్రవాదులు మారణహోమం (26/11) సృష్టించారు. అత్యంత రద్దీగా ఉండే ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ రైల్వే స్టేషన్, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్, లియోపోల్డ్ కేఫ్, నారిమన్ లైట్ హౌస్ ఇలా వరుసగా 12 చోట్ల ఏకధాటిగా కాల్పులు, బాంబుల మోత మోగింది. దాదాపు 60 గంటల పాటు సాగిన ఆ మారణహోమంలో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిషేధాజ్ఞలు విధించారు.

కేరళ ఆలయంలో బాణసంచా పేలుడు

150 మందికి గాయాలు

తిరువనంతపురం: కేరళలోని కాసర్‌గోడ్ జిల్లాలో భారీ బాణసంచా ప్రమాదం జరిగింది. ఓ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి బాణసంచా కాల్చుతుండగా జరిగిన ఈ ప్రమాదంలో 150 మందికి పైగా గాయపడ్డారు. వారిలో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉంది. టపాసులు పేలుతున్న సమయంలో ఒక్కసారిగా భారీగా మంటలు ఎగసిపడ్డాయి. మంటలతో పాటు పొగ ఆవరించడంతో అప్పటిదాకా చుట్టూ నిలబడి చూసినవారంతా ఒక్కసారి దూరంగా పరిగెత్తారు. దీంతో తొక్కిసలాట తరహా పరిస్థితి కనిపించింది. తెయ్యం ఉత్సవాల ప్రారంభ వేడుకల సందర్భంగా అంజోతంబలం వీరేకావులో ఈ ప్రమాదం జరిగింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అర్ధరాత్రి సమయంలో టపాసుల వేడుక జరిగిందని, అయితే క్రాకర్లలో ఒకటి సమీపంలోని మరిన్ని టపాసులు నిల్వ చేసిన షెడ్‌లో పడి ఉండవచ్చని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. షెడ్‌లో ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు, పొగలు వ్యాపించడంతో జనాలు భయానికి గురై పరుగులు పెట్టినట్టు దృశ్యాలను బట్టి అర్థమవుతోంది. పెద్ద పేలుడు తర్వాత ఈ మంటలు వ్యాపించాయని, నిప్పు రవ్వలు దూసుకురావడం చూశామని, అందుకే జనాలు భయాందోళనలకు గురయ్యారని పేర్కొన్నారు. కాగా గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ఆభరణాలతో శుభకార్యాలకు వన్నె

విశాలాంధ్ర-జూబ్లీహిల్స్ : ఆభరణాలతో శుభకార్యా లకు మరింత వన్నె వస్తుందని ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్ అన్నారు. జువెలరీ డిజైనర్ నాగిని ప్రసాద్ జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 10 లో ఏర్పాటు చేసిన సిద్ధార్థ ఫైన్ జువెలరీ షోరూమ్‌ను కామినేని శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జువెలరీ నాణ్యత పై ప్రత్యేకంగా పనిచేస్తున్న నాగిని ఏర్పాటు చేసిన షో రూమ్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. నాణ్యమైన ఆభరణాలను విని యోగదారులకు అందించి మన్ననలు పొందాలని సూచించారు.

మూలికల ద్వారా అనేక ప్రయోజనాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తైల పాక విధి అనేది హెర్బల్ ఆయిల్స్‌ను తయారు చేయడానికి మూలికల శక్తిని పెంచేదిగా ఏళ్లుగా కొనసాగుతున్న పద్ధతి అని మారికోలోని చీఫ్ ఆర్ అండ్ డి ఆఫీసర్ డాక్టర్ శిల్పా వోరా అన్నారు. ఈ సందర్భంగా వివరిస్తూ తైల పాక విధిలో ఉపయోగించే మూలికలు అపారమైన ప్రయోజనాలను అందిస్తాయన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని "ఆరోగ్యం కోసం ఆయుర్వేదం" అనే థీమ్‌తో వే డుక చేసుకుంటున్నందున, శ్రేయస్సుకు, ముఖ్యంగా జుట్టు ఆరోగ్యానికి కాలానికి అతీతంగా ఆయుర్వేదం అందించిన సహకారాన్ని గుర్తించడానికి ఇది సరైన సమయమన్నారు. మాడు ఆరోగ్యానికి, శిరోజ వృద్ధికి, వెంట్రుకలు బలంగా ఉండేందుకు తోడ్పడుతాయని, ఆయుర్వేద మూలికలైన ఉసిరి, భృంగరాజ్, బ్రాహ్మి, వేప, కలోంజి, యష్టిమధులను సాధారణంగా కొబ్బరి ఆధారిత నూనెలో కలుపుతారని చెప్పారు. వాటి లక్షణాలను సంరక్షించడానికి ఉష్ణోగ్రతను జాగ్రత్తగా నియంత్రిస్తారని, ఈ ప్రక్రియ వల్ల నూనె తలకు లోతుగా పోషణనిస్తుందని వివరించారు. జుట్టు మూలాలను బలపరుస్తుంది, పెరుగుదలను ప్రోత్సహిస్తు ఇన్ఫెక్షన్స్ నుండి రక్షిస్తుంది అని అన్నారు.

ప్రభుత్వ భూమిలోని గుట్ట అక్రమార్కుల పరం

విశాలాంధ్ర-తుర్కయంజాల్ : ప్రభుత్వ భూములు చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక సంస్థలను ఏర్పాటు చేసినా అక్రమార్కుల ఆగడాలు మాత్రం ఆగడంలేదు. ప్రభుత్వం,ఇటు అధికారులు భూ అక్రమణలను ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదు. తాజాగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండల్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ 279 లోని ప్రభుత్వ భూమి లో గల బోడగుట్టను ప్రైవేట్ వ్యక్తులు యంత్రాలతో తొలగించి తమ వ్యాపార అవసరాల కోసం గుట్టను రోడ్డుగా తొలుస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై అవగాహన

విశాలాంధ్ర /ములుగు జిల్లా బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక సర్వే ప్రక్రియలో, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను నిర్వహించడానికి ఎన్యుమరేటర్లు ఖచ్చితమైన శిక్షణను పొంది ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో సామాజిక, ఆర్థిక, సర్వే నిర్వహణలో జిల్లా స్థాయి ట్రెనింగ్ ఆఫ్ ట్రెనర్స్ నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సర్వే నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ మొదటి వారంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టబోతున్న సందర్భంగా సర్వేలో పాల్గొనే ఎన్యుమరేటర్లు శిక్షణ పొంది నిష్ణాతులు కావాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కుటుంబాల సమగ్ర సమాచార సేకరణ చేపట్టాలని సూచించారు. సమగ్ర సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలు చిట్టచివరి పేదవారికి చేరేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం సామాజిక, ఆర్థిక, విద్య , ఉపాధి, రాజకీయ, కులాల వారిగా సర్వేలో వివరాలు నమోదులు చేయాలని తెలిపారు. నిర్వహణకు పదిమంది ఎన్యూమరేటర్లను పర్యవేక్షణ చేసేందుకు ఒక సూపర్ వైజర్ ను నియమించడం జరిగిందని అన్నారు. గ్రామంలోని 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్ ను నియమించనున్నట్లు తెలిపారు. ఇంటి నెంబరు ఆధారంగా సర్వే ఉంటుందని, ఎన్యూమరేటర్లు తు.చ తప్పక ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర సమాచారాన్ని నింపాల్సి ఉంటుందని అన్నారు. ఆధార్ కార్డు ప్రకారం కచ్చితంగా వివరాలు నమోదు చేయాలన్నారు. సర్వే ప్రక్రియలో సూపర్ వైజర్స్ పది శాతం కచ్చితంగా తనిఖీ చేయాలని తెలిపారు.
నమోదులోజిల్లా కోడ్, మండల కోడ్, ఎన్యూమరేషన్ నంబర్స్ కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఎన్యూమరేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సర్వే సమర్ధవంతంగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సమర్థవంతంగా నిర్వహించాలని, అందుకు సర్వే నిర్వహణ చేయడంపై ఎన్యుమరేటర్ లు, సూపర్వైజర్లు పూర్తి అవగాహన ఉండాలని అడిషనల్ కమీషనర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ పై డిప్యూటీ కమిషనర్లు, సర్కిల్ లెవల్ మాస్టర్ ట్రెనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా స్నేహ శబరీష్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నవంబర్ లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) నవంబర్ నెల లో (ప్రభుత్వం తేది నిర్ణయించాల్సి ఉంది) చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం యొక్క సామాజిక, ఆర్థిక స్థితి, విద్యా స్థాయి, ఉపాధి పరిస్థితులు, రాజకీయ ప్రయోజనం కుటుంభం ఆర్థిక పరిస్తితి వివరణాత్మక సమాచారం సేకరించడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశ్యమని, ఈ సర్వే ద్వారా రాష్ట్రంలోని ప్రజల జీవనస్థితి, అవసరాలు, సమగ్ర సమాచారం చేసి వాటి పరిష్కార మార్గాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. ఈ సర్వేను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. సర్వే డేటా సేకరణలో అవలంబించాల్సిన నైతిక ప్రమాణాలు, వ్యక్తిగత గోప్యతా హక్కులను కాపాడటం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె సూచించారు. సర్వే కోసం ఎన్యూమరేటర్స్ ను, సూపర్ వైజర్స్ ను నియమించుకోవాలని, ఎన్యూమరేటర్స్ సర్వే నిర్వహించి తమకు కేటాయించిన అన్ని కుటుంబాల డేటా సేకరించాలని, ప్రతి కుటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరించాలన్నారు.

వికసిత్ భారత్ పచ్చి బూటకం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మోదీ సర్కార్ చెబుతున్నా వికసిత్ భారత్ పచ్చి బూటకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళవారం మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సీపీఐ మహబూబ్ నగర్ జిల్లా సమితి సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం పూటకో మాయా మాటలు చెబుతూ దేశ ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. దేశంలో బిలియన్స్ కుబేరులు పెరిగిపోతున్నారనే ప్రచారం చేస్తున్నారని మరోపక్క పార్లమెంటులో దేశ ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ 80 కోట్ల మందికి సబ్సిడీలో ఆహారపు ధాన్యాలు అందిస్తున్నామని చెబుతున్నారని వ్యంగంగా విమర్శించారు. వాస్తవంగా ప్రపంచ దేశాలలో ఆకలి దారిద్ర్యం చావులలో భారతదేశం 108వ స్థానంలో ఉందని గుర్తు చేశారు. దేశ సంపద మొత్తం కొద్దిమంది ఆర్థిక నేర కుబేరుల చేతుల్లో కేంద్రీకృతం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ వనరులకు, సహజ సంపదకు దేశం కొదవలేదని కానీ మానవ వనరులను వినియోగించుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఆరోపించారు. పెరుగుతున్న ధరలతో పేద సామాన్య ప్రజలు జీవించలేని దుస్థితి నెలకొన్నదని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన రెండు లక్షల రైతు ఋణమాఫీ పూర్తి స్థాయిలో మాఫీ చేయాలి, రైతు బరోసాను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ మాజీ జిల్లా కార్యదర్శి బి.పరమేశ్వర్ గౌడ్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అల్వాల్ రెడ్డి, పి.సురేష్, గోవర్ధన్, జిల్లా సమితి సభ్యులు కృష్ణ యాదవ్,కోటకదిర నరసింహ, జి.సత్యనారాయణ రెడ్డి,యన్. శంకర్ నాయక్, చాంద్ భాషా, ఎస్‌సంతోష్, అమరజ్యోతి, బి.ఆర్ విల్సన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు, శ్రీనివాస్, కె.పద్మవతి తదితరులు పాల్గొన్నారు.

ఎం.బాల నరసింహ

గ్రామంలో యూజీడీ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-కాప్రా : కుషాయిగూడ డివిజన్ పరిధి లోని ఎన్నో సంవత్సరాలుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల నిత్యం రోడ్డుపై మురికి నీరు ప్రవహిస్తూ ఉండేది. ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మంగళవారం కుషాయిగూడ ప్రాథమిక పాఠశాల వెనుక వీధిలో 17 లక్షల రూపాయల వ్యయంతో నూతన డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ యొక్క వర్క్ ని ప్రారంభించి అతి త్వరలో ఈ వర్క్ ని పూర్తి చేసి ఇక్కడి ప్రజలకు అందిస్తామని, అలాగే కుషాయిగూడలో ఇంకో 3 డ్రైనేజ్ లైన్లు కూడా సాంక్షన్ అయ్యి టెండర్లు కూడా పిలవడం జరిగింది అని.. ఆ మూడు వర్క్ లు కూడా త్వరలో ప్రారంభిస్తామని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం సతీష్, %రాజు% సందీప్, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, ముఖ్య సలహా దారులు పందాల శివకుమార్ గౌడ్, అసోసియేషన్ సభ్యులు పనగట్ల చక్రపాణి, చిత్తుల కిషోర్, పంజాల బాబు, అనిల్ బాబు, కొడకండ్ల యాదయ్య, చల్లా వెంకటేష్, చిదం బాలనర్సింహా, నర్సింగ్ రావు, గణేష్ గౌడ్, దయా నంద్,సారా శ్రీధర్, దినేష్,అంజన్న,మణి కిరణ్, శ్రీనివాస్,శ్రవణ్. అలాగే స్థానిక నాయకులు మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి,జై కృష్ణ, క్రాంతి,సాకేత్, కాంట్రాక్టర్ వెంకటేష్, అలాగే స్థానికులు దేవేందర్ గౌడ్ , నర్సింగ్ ఆర్ట్స్, సింగిరెడ్డి పద్మారెడ్డి, మచ్చ బాబు గౌడ్ , సుధీర్ బాబు, బుడంపల్లి రఘు గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పల కుప్పగా రాష్ట్రం

విశాలాంధ్ర-షాద్ నగర్,రూరల్: వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ స్థాయి సెమినార్ మినీ యూనివర్సిటీలలో జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సీపీఐ నాయకులు పాలమాకుల జంగయ్య, బుద్దుల జంగయ్య, కలకుండా కాంతయ్య, టంగుటూరి నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తెలంగాణ ఏర్పడ్డ తర్వాత టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది కానీ మిగులు బడ్జెట్ లో ఉన్న తెలంగాణను ఏడు లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టింది గత టిఆర్ఎస్ ప్రభుత్వమని ఆయన మండిపడ్డారు. ఏడు లక్షల కోట్ల అప్పుకు ప్రస్తుత ప్రజా పాలన రేవంత్ రెడ్డి నాయకత్వన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు కట్టి ప్రజలకు ఇచ్చిన హామీలైన ఉచిత బస్సు సౌకర్యం కావచ్చు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కావచ్చు, సబ్సిడీ గ్యాస్ కావచ్చు, రైతు రుణమాఫీ కావచ్చు అన్నిటిని కూడా ఈ పది నెలల కాలంలో హామీలు నెరవేర్చుకుంటూ పోతున్నామని అన్నారు. టిఆర్ఎస్ హయాంలో అసంతృప్తిగా పూర్తి చేసిన డబ్బులు బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మహిళలకు 2500 నగదు పెంచిన పింఛన్ల పంపిణీ తదితర హామీలు నెరవేర్చాల్సిన అవసరం ఉంది ఇవన్నీ కూడా తప్పక నెరవేరుస్తామని ఆయన ప్రజానీకానికి తెలియజేశారు. కమ్యూనిస్టులు ప్రజా సమస్యలపై నిత్య పోరాటాలు నిర్వహిస్తున్నారు. వారి పోరాటాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుంది సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ఈ రెవెన్యూ డివిజన్ పరిధిలో పేదలకు సంబంధించి ఏ సమస్య ఉన్న నా దృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కారం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కొందరు పనికట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం పై గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని అవన్నీ నమ్మవద్దని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, వెంకటేష్,భాగాల నరసింహ, రమేష్, ఎం కృష్ణ, రాజు, రాములు, శేఖర్ స్వరూప, కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ కొమ్ము కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

అక్షిత ఫౌండేషన్ కృషి అభినందనీయం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు అక్షిత ఫౌండేషన్ చేసే కృషి సంతోషకరనీయమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పిలుపునిచ్చారు. నియోజకవర్గం పరిధి 125 - గాజులరామారం డివిజన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పదవ తరగతి విద్యార్థుల పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా నోట్ బుక్ పుస్తకాల కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, పదవ తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం అక్షిత ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ సురేష్ కుమార్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, ఉపాధ్యక్షులు ఇబ్రహీం ఖాన్, నవాబ్ భాయ్, మూసా ఖాన్, గోవర్ధన్ రెడ్డి, సురేష్, సుంకరి చందు, వెంకటేష్, నవీన్, శేఖర్, మహిళా అధ్యక్షురాలు సంధ్యా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తోటి డ్రైవర్లు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కొండమల్లేపల్లి: మండల డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యుడైన బోధ శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు 50వేల రూపాయలు మంగళవారం అందజేశారు. పెద్దఅడిశర్లపల్లి మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన బోధాసు శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. ఇతడు కొండమల్లెపల్లి లో నివాసం ఉంటూ తూఫాన్ డ్రైవర్గా కొనసాగే వాడు మృతుడికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. శ్రీనివాస్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని చూసి తమ వంతు సహాయంగా కొండమల్లేపల్లి తుఫాన్ యూనియన్ ఆధ్వర్యంలో 50 వేల రూపాయలు అతడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా తుఫాన్ యూనియన్ సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సోమ బిక్షపతి ,ఏరుకొండ సైదులు, రమావత్ శంకర్, రమావత్ బాల్ సింగ్, రమావత రాము, గంజి మల్లేష్, కూరాకుల ఈదయ్య, బోడ రమేష్, పులిగుంట్ల కిరణ్ కుమార్ రెడ్డి ,యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వాలు విస్తృతంగా చేపట్టాలి

విశాలాంధ్ర-తుర్కయంజాల్: బుధవారంతో సభ్యత్వ గడువు ముగుస్తున్నందున భాజాపా శ్రేణులు సభ్యత్వ నమోదు విరివిగాగా చేపట్టాలని భాజపా రాష్ట్ర గిరిజన మోర్చా ట్రెజరర్ ధారావత్ శ్రీనివాస్ నాయక్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఇంజాపూర్‌లో సభ్యత్వ నమోదు చేపట్టారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-హైదరాబాద్ : దీపావళి పండుగను పురస్కరించుకొని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మంగళవారం బంజారాహిల్స్ ఎన్ బి టి నగర్ ప్రభుత్వ హై స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 300 మంది నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు తదితర విద్యా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... విద్యార్థులకు చదువులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ వంతుగా సహాయం అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ పలు సమస్యలపై పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా నాయకులు శోభన్, సిఐటియు శేరిలింగంపల్లి కార్యదర్శి కొంగరి కృష్ణ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ మరియు మినీ టీచర్లు ప్రతినెల జీతాలు సకాలంలో వచ్చే విధంగా చూడాలని, అంగన్వాడి కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించే విధంగా బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ ఉద్యోగుల సమస్యలను తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని , తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని ,మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ,ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు నాగమణి, శ్రీలత, టీచర్లు లక్ష్మీ, ప్రవీణ ,లక్ష్మీకాంతం, జ్యోతి, ప్రవీణ, త్యాయర్ ఉన్నిసా మరియు తదితరులు పాల్గొన్నారు.

జైనూర్ ఘటన నిందితునిపై పీడీ యాక్ట్



విశాలాంధ్ర బ్యూరో-కొమురం భీం: జైనూర్ ఆదివాసి మహిళపై గత నెలలో జరిగిన హింసాత్మక దాడిలో నిందితుడైన ముగ్ధం పై పీడీ ఆక్ట్ నమోదైనట్లు కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డి.వి శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. నిందితులకు కఠినమైన శిక్షలు విధించే విధంగా జిల్లా పోలీసు యంత్రాంగం ముక్తకంఠంతో విధులు నిర్వర్తిస్తుందని చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరు సమానమే , తప్పు చేసిన ప్రతి ఒక్కరికి న్యాయస్థానం నందు శిక్షలు విధించబడతాయని పీడీ ఆక్ట్ లు నమోదు చేయడం వల్ల నేరాలు తగ్గుముఖం పడతాయని సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా శిక్ష నుండి తప్పించుకొలేరని, ప్రజలు ఎవరు కూడా చట్టాన్ని తమ చేతిలోకి తీసుకోవద్దని ఎస్పీ తెలిపారు.

విద్యార్థుల పట్ల ప్రభుత్వం వివక్షత విడనాడాలి

విశాలాంధ్ర-హైదరాబాద్ : విద్యార్థుల పట్ల వివక్షత చూపిన ప్రభుత్వాలు మనుగడ సాధించలేదని రాష్ట్రంలో కాంగ్రెస్ తాము అధికారంలోకి వస్తే ఫీజు బకాయిలను విడుదల చేస్తామన్న హామీని నేడు అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఫీజు బకాయిలు విడుదల చేయకుండా విస్మరిస్తూ ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసి పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర ప్రభుత్వం చేస్తుందని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిపులను తక్షణమే విడుదల చేయాలని లేనిపక్షంలో ప్రభుత్వంపై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ హిమాయత్ నగర్ లోని స్థానిక సత్యనారాయణ రెడ్డి భవన్ నందు ఏఐఎస్ఎఫ్ నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజు బకాయిలు విడుదల చేయాలని రాష్ట్ర విద్యార్థులు రోడ్డెక్కి ఉద్యమిస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని సిఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్న విద్యార్థులకు ఉపయోగం లేదని, పేద, మధ్యతరగతి విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ పై ఆధారపడే ఉన్నతవిద్య అభ్యసిస్తారని కానీ వారికి ఫీజు బకాయిల విడుదల లేక సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు. నాన్ ప్రొఫెషనల్ విద్యార్థులకు 2000 కోట్లు, ప్రొఫెషనల్ విద్యార్థులకు 4000 కోట్లు గాను పెండింగ్ ఉపకార వేతనాలు ఉన్నాయని, 2021 -22 ప్రభుత్వం విడుదల చేసిన బకాయలు 30% 2022 -23 గాను 20%, 2023 -24 గాను 100/ శాతం బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా నిరవధిక బంద్ నిర్వహించాయి. ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందని వారు విమర్శించారు.

నిరసన దీక్షలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

ఇప్పటికే గత మూడు ఏళ్లుగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన ఉందన్నారు. 2024-25 విద్యా సంవత్సరం గాను ఇప్పటివరకు స్కాలర్షిప్ ఈపాస్ ఆన్లైన్ డేట్ ప్రభుత్వం ఇవ్వలేదు కానీ బీసీ స్కాలర్షిప్స్ 1500 కోట్లు రిలీజ్ చేస్తున్నామని చెప్పిందన్నారు. స్కాలర్షిప్స్ ఆన్లైన్ డేట్ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం రిలీజ్ చేసిన 1500 కోట్ల బీసీ స్కాలర్షిప్స్ ఉపకార వేతనాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తక్షణమే నిధులు విడుదల చేయకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంత్రులు, ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడించడానికి కూడా సంసిద్ధం అవుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇటిక్యాల రామకృష్ణ, బానోత్ రఘురాం, గ్యార నరేష్,గ్యార క్రాంతి, లెనిన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వంశీవర్ధన్ రెడ్డి, చైతన్య, అన్వర్, అంజి, రామారపు వెంకటేష్, శరత్,శ్రావణ్,పార్వతి, శాంతి కుమార్, ప్రేమ్ కుమార్,రవితేజ,హరీష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి

విశాలాంధ్ర-హుజూర్ నగర్: పాలకీడు మండలానికి చెందిన జర్నలిస్టు వెచ్చ సందీప్‌పై జరిగిన అమానుష హత్యాయత్నాన్ని ఖండిస్తున్నట్లు పలువురు జర్నలిస్టులు అన్నారు. మంగళవారం హుజూర్ నగర్ పట్టణంలో జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి, రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై స్పందించి జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తెచ్చి, దాడులను అరికట్టాలన్నారు. వెచ్చ సందీప్ కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. అనంతరం డిఎస్పీ శ్రీధర్ రెడ్డి, సిఐ చరమంద రాజులకు జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు దుగ్గి ఉష శ్రీ, కోల నాగేశ్వరరావు, దొంతగాని రాజరమేష్, త్రిపురం రమేష్ రెడ్డి, పండ్ల నాగరాజు, నక్క నరేష్, వట్టికూటి మహేష్, జెట్టి తేజస్, కీత రామనాథం, రాంప్రసాద్ గౌడ్, జానీ పాషా, నాగుల్ మీరా, దొంతగాని రమేష్, లింగం మధు,దేవరం వెంకటరెడ్డి కాంపాటి. సందీప్, వసుపు జయరాజు, తండు నరేష్, తండు వెంకన్న, నరేష్, ఆత్కూరి వెంక టేష్, రామకృష్ణ, నరేందర్, పెండుర్తి సతీష్, బండి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దుండిగల్: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. మంగళవారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి 20వ వార్డులోని జెఎన్ఎన్ యుఆర్ఎం లక్ష్మీ నగర్ కాలనీలో కౌన్సిలర్ మురళి యాదవ్ ఆధ్వర్యంలో సుమారు 80 లక్షల రూపాయలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, మున్సిపల్ చైర్ పర్సన్ శంబీపూర్ కృష్ణవేణి క్రిష్ణ తో కలిసి ముఖ్యఅతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ శివారు ప్రాంతాలలో కొత్త కొత్త కాలనీలు ఏర్పాటు అవుతున్నాయని, జనాభా అభివృద్ధికి అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శంబిపూర్ కృష్ణ, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బెంబడి బుచ్చిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డిల్లెశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, సలహాదారులు కామేశ్వర్ రావు, కాలనీ వాసులు లక్ష్మణ్, శ్యామ్, బాబీ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ఐకమత్యంతో ఉంటే కాలనీ అభివృద్ధి సాధ్యపడుతుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. కుత్బుల్లా పూర్ నియోజకవర్గం 131 డివిజన్ పద్మనగర్ ఫేజ్ - 1 కాలనీ సంక్షేమ సంఘం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మంగళవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలం గౌడ్ ని షాపూర్ నగర్ నందు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలా అభివృద్ధికి తన వంతు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సంక్షేమ సంఘాలతోనే కాలనీల అభివృద్ధి సాధ్యమవుతుందని, కాలనీలో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, కాలనీ అభివృద్ధికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేకేఎం ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు కూన శ్రీనివాస్ గౌడ్ గారు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు సత్తిరెడ్డి, దయాకర్, ముత్యాలు, వెంకటేశ్వరరావు, శివ నాగిరెడ్డి, ఖాసీం పీరా, జై సింహా రెడ్డి ,శ్రీకాంత్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, ప్రసాద్, అరవింద్, సత్యం, క్రిష్ణా రావ్, వేణుమోహన్, సుబ్బారెడ్డి, రంగసుబ్బయ్య, భాస్కర్ రెడ్డి, రమణారెడ్డి, సందీప్ రెడ్డి, ఠాకూర్ వినోద్ సింగ్, సుబ్బారావు, సురేందర్ రెడ్డి, సంగమేశ్వర రావు, శ్రీనివాస్, ప్రభంజన్ రెడ్డి, నరసింహారెడ్డి, భాస్కరాచారి, చంద్రశేఖర రావు, నాగరాజు, రాజేష్, వినోద్ రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

కళాశాలకు కుర్చీలు అందజేత

విశాలాంధ్ర-షాద్ నగర్,రూరల్: రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కు గాంధీ నగర్ కాలనీ చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు ఎండి. కబీర్ తన సొంత ఖర్చులతో జూనియర్ కళాశాల కు 100 కుర్చీలు ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ సమక్షంలో కళాశాల ప్రిన్సిపాల్ కు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ... దాన గుణం ఉన్న వ్యక్తులు గ్రామ అభివృద్ధి కాంక్షించే యువకులు ఉన్న గ్రామం ఎప్పటికైనా అభివృద్ధి చెందుతుందని ఇలాంటి దానగుణం ప్రతి ఒక్కరికి ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ కార్యక్రమంలో బాబర్ అలీ ఖాన్, తిరుపతి రెడ్డి,జమ్మద్ ఖాన్, ఇబ్రహీం, రఘు,అలీం సఖిబ్, ముబారక్ అలీ ఖాన్, ఖదిర్, మహబూబ్, ఫయాజ్, జఫర్ ఖాన్, రవితేజ, మొహమ్మద్, జోయబ్, సబెర్, అఫ్రోజ్, జమీర్, అబ్బు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీమ్‌ను ప్రారంభించిన గాంధీ

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాదాపూర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన రా స్ట్రెంత్ కాలిస్తెనిక్స్ జిమ్‌ను మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవితంలో, మానవుడి నిత్య జీవితంలో మానవుడికి శారీరక శ్రమ ఎంతో అవసరమని, శారీరక శ్రమ తో పాటు మానసిక దృఢత్వం లభిస్తుందన్నారు. యాంత్రిక జీవనంలో ప్రజలకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరు ఏదో ఒక క్రీడను ఎంచుకొని ఉన్నత స్థితిలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్ రెడ్డి, ఎర్రగుడ్ల రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, శివ, సాయి, శ్రీనివాస్ , కాజా , మరియు తదితరులు పాల్గొన్నారు

ఆర్డీఓగా సరిత బాధ్యతలు

విశాలాంధ్ర-షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆర్డీవో గా పనిచేస్తున్న డి. వెంకట మాధవరావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎన్నికల విభాగంలో పనిచేస్తున్న ఎన్ఆర్ సరిత షాద్ నగర్ ఆర్డీవోగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె బాధ్యతలు చేపట్టారు.షాద్ నగర్ ఫరూక్ నగర్ తహసీల్దార్ పార్థసారథి ఆర్డిఓ సరితకు శాలువా కప్పి మొక్క ను బహుకరించి స్వాగతం పలికారు.

ఎడ్యుకేషనల్ హబ్‌గా మహబూబ్ నగర్: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎడ్యుకేషనల్ హబ్‌గా మహబూబ్ నగర్ ను అభివృద్ధి చేయడమే తన లక్ష్యం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. మంగళవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఎంఇఓ కార్యాలయంలో జరిగిన ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు కళాశాలల యాజమాన్యాల తో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సియం నియోజకవర్గం లో ఐటిఐ కళాశాల ను అప్ గ్రేడ్ చేసి ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసుకున్నామని, అలాగే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఇప్పుడు మన మహబూబ్ నగర్ పాలమూరు విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ లా కళాశాల ఏర్పాటు కోసం అనుమతి ఇచ్చారని అందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పాలమూరు విశ్వవిద్యాలయానికి యూజిసి ఫండ్ నుంచి 100 కోట్ల రూపాయలను తెచ్చుటలో మేము పూర్తి స్థాయిలో ఎఫర్ట్స్ పెట్టి 100 కోట్ల రూపాయలు ఫండ్ తీసుకురావడం జరిగిందని తెలిపారు. వచ్చే అకాడమిక్ ఇయర్ లోనే ఇంజనీరింగ్ మరియు లా నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతోందని, మన మహబూబ్ నగర్ జిల్లా విద్యార్థులకు ఇంజనీరింగ్, లా కళాశాల వల్ల చాలా ప్రయోజనాలు కలుగుతాయి అని ఆయన తెలిపారు. రేపు పాలమూరు విశ్వవిద్యాలయం లో జరిగే కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ఇంజనీరింగ్ మరియు లా కళాశాల భవనాలకు త్వరలో శంకుస్థాపన చేస్తారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిఇఓ రవీందర్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, ఎంవిఎస్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, సియంఓ బాలుయాదవ్, ఎఎంఓ శ్రీనివాస్ వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు , ప్రిన్సిపాల్స్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలల పరీక్ష ఫలితాలు విడుదల

విశాలాంధ్ర, హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 13 ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలు / కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఈ ఏడాది జూలైలో నిర్వహించిన డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులకు వివిధ అంశాలలో నిర్వహించిన వార్షిక పరీక్షల ఫలితాలను మంగళవారం విశ్వవిద్యాలయం విడుదల చేసింది. వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు ఫలితాలను ప్రకటిస్తూ ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేసారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులు తమ ఫలితాలను తెలుగు విశ్వవిద్యాలయం వెబ్ సైట్‌లలో www.teluguuniversity.ac.in, www.manabadi.co.in చూసుకోవాలని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు.

ఎస్పైని కలిసిన ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

విశాలాంధ్ర-దంతాలపల్లి : దంతాలపల్లి నూతన ప్రెస్ క్లబ్ మండల కమిటీ అధ్యక్షులు చిల్ల నిరంజన్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఊడుగుల ఐలేష్ యాదవ్ , ఉపాధ్యక్షులు అనపర్తి వీరన్న, గౌరవ అధ్యక్షులు దాసు, పంతం సురేందర్, గౌరవ సలహాదారుడు భూపతి కాశయ్య గౌడ్, కోశాధికారి మార్క వెంకన్న, సహాయ కార్యదర్శి పంతం విజయేందర్, కార్యదర్శి మిడతపల్లి సురేందర్, మంగళవారం దంతాలపల్లి ఎస్సై పిల్లల రాజును మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాల్వాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ, నిత్యం ప్రజలు , ప్రభుత్వ అధికారులు , ప్రజా ప్రతినిధులతో మమేకమై తిరుగుతూ, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వెలికితీస్తూ, వార్తల రూపంలో ప్రజలకు చేరవేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు ప్రజలు, ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధుల మన్ననలు పొందుతూ జర్నలిస్ట్ అనే పదానికి మంచి పేరు,మర్యాదలు తీసుకురావాలని, మంచి ఆశయంతో ముందుకెళ్తూ నూతన ప్రెస్ క్లబ్ మంచి పేరు ప్రఖ్యాతులు పొందాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : క్రీడాలు ఆరోగ్యానికి ఉల్లాసాన్ని ఇస్తాయి అని ఏటూరునాగారం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి చిత్ర మిశ్ర అన్నారు. మంగళవారం ఏటూరునాగారం కొమురం భీమ్ మినీ స్టేడియంలో, ఏటూరునాగారం ఐటిడిఏ ఆధ్వర్యంలో ఐటిడిఏ జోనల్ స్థాయి అండర్ 14, 17 బాలబాలికలకు క్రీడాలు నిర్వహించారు. ఈ క్రీడాలు మంగళవారం, బుధవారం రెండు రోజులు నిర్వహిస్తారు.ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిధిగా ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్ర హాజరై మాట్లాడుతూ విద్య తో పాటు, క్రిడల్లో కూడా విద్యార్థులు రాణించాలన్నారు. ముందుగా క్రీడాల జెండాను పిఓ ఎగురు వేసి, జ్యోతి ప్రజ్వలాన చేశారు. విద్యార్థులు చేసిన వివిధ రకాల నృత్యలతో, అధికారులను, విద్యార్థులను, ప్రజలను ఆకర్షించుకున్నాయి.ఈ కార్యక్రమంలో డిడి. వై పోచం, ఏటిడిఏ దేశిరాం,క్షేత్రయ్య, ఎస్ ఓ రాజ్ కుమార్, ఏసిఓయం కోడి రవీందర్, కరీంనగర్,ఉమ్మడి జిల్లా నుండి విద్యార్థులు బాలబాలికలు, సంబంధిత శాఖల అధికారులు, పిఇటిలు, పిడిలు, ఆదినారాయణ, భాస్కర్, శ్యామల,విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ల గోదాములు తనిఖీ



విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : గోవిందరావుపేట, తాడ్వాయిలో గల రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా జిల్లా రైస్ మిల్లర్ల ద్వారా అనుమతించి నిల్వ ఉంచిన బియ్యం గోదాములను పౌరసరఫరాల సంస్థ, ములుగు జిల్లా మేనేజర్ బి.రాంపతి ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బఫర్ గోదాంలలో ఉంచిన బియ్యం నిలువలు ప్రభుత్వం నిర్దేశించిన ఎఫ్ఏ క్యూ ప్రమాణాలకు లోబడి మాత్రమే ఉన్నాయని తెలిపారు. గోదాము అధికారులకు, టెక్నికల్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. రైస్ మిల్లర్ల నుంచి మిలింగ్ చేసి కష్టం మిలింగ్ క్రింద వచ్చిన బియ్యాన్ని, వాటి నాణ్యత ప్రమాణాలను పరిశీలించి మాత్రమే తీసుకోవాలని, లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. అదేవిధంగా గోవిందరావుపేట, పస్రా పరిధిలోని పలు రేషన్ షాపులను తనిఖీ చేశారు. అక్కడ కూడా బఫర్ గోదాముల నుంచి వచ్చిన బియ్యం చాలా బాగున్నాయని, బలవర్ధక మైన బియ్యం వస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా రేషన్ షాపుకు వచ్చిన రేషన్ కార్డు దారులతో మాట్లాడుతూ రేషన్ షాపుల ద్వారా సరఫరా అవుతున్న బియ్యం నాన్యత ఎలా ఉన్నాయని అడగగా, కార్డు దారులు రేషన్ షాపుల ద్వారా ప్రస్తుత ప్రభుత్వము ఏర్పాటు అయిన తర్వాత సరఫరా అవుతున్న బియ్యం మంచి నాన్యత ప్రమాణాలతో, మంచి పోషకాలు కలిగిన బలవర్ధకమైన బియ్యం సరఫరా అవుతున్నాయని, ప్రతినెలా రేషన్ షాపుల నుండి తీసుకొని తింటున్నామని, చాలా రుచికరంగా ఉన్నాయని హర్షం వ్యక్తం చేశారు.

మాదకద్రవ్యాల విషకోరలపై ఉక్కుపాదం మోపాలి: ఈటీ నరసింహ

విశాలాంధ్ర-హైదరాబాద్ : మహా నగరంలో రోజురోజుకు పెరుగుతున్న మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని, రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తున్న డ్రగ్స్ మహమ్మారి విషకోరలపై ఉక్కుపాదం మోపాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి. నరసింహ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. మాదకద్రవ్యాల నిరోధానికి అనేక చట్టాలు ఉన్నప్పటికీ, రేవ్ పార్టీలు, పబ్ లు, బార్లు, రిసార్ట్ లు, హెూటల్స్ లాంటి ప్రదేశాలలో డ్రగ్స్ మరియు గంజాయి ఇప్పటికీ చెలామణిలో ఉండడం తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించడంలో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన టాలీవుడ్ డ్రగ్స్ కేసుకు సంబంధించి నమోదైన కేసులలో సరైన ఆధారాలు, సాక్ష్యాలు లేకపోవడంతో కేసులు కొట్టివేస్తున్నట్లు కోర్టు తెలిపిందని, సినీ పరిశ్రమకు చెందిన కొందరిని పోలీసులు కేవలం విచారించి వేదిలేశారని గుర్తు చేసారు. డ్రగ్స్ పట్టుబడిన వారి కేసులలో సరైన ఆధారాలు, సాక్ష్యాలు కోర్టులలో ప్రవేశపెట్టకపోవడం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా మరియు నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోకపోవడంలో రాష్ట్ర పోలిసు యంత్రాగం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి హైదరాబాద్ నగరాన్ని డ్రగ్స్ హబ్ గ గత ప్రభుత్వం మార్చివేసిందని మండిపడ్డారు. ఇటీవలే జన్వాడ ఫార్మ్ హౌస్ డ్రగ్స్ వినియోగ నిందితులపై కఠిన చెర్యలు తీసుకోవాలని అయన డిమాండ్ చేసారు. నామమాత్రపు అవగాహనా కోసం ప్రతి ఏడాది అంతర్జాతీయ మాదకద్రవ్యాల దురలవాటు, అక్రమరవాణా వ్యతరేక దినోత్సవం రాష్ట్ర పోలీసులు జరుపుకొని డ్రగ్స్ నియంత్రణకు, వినియోగంపై ఎలాంటి కఠిన చెర్యలు తీసుకోవడలేదన్నారు. దేశ యువత మత్తులో తూలకుండా, బాధ్యయుత పౌరులుగా జాతి అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి ప్రభుత్వం మాదకద్రవ్యాల అక్రమరవాణా నియంత్రించడానికి కట్టుదిట్టమైన నియంత్రణ వ్యవస్థలను వెంటనే ఏర్పాటు చేయాలనీ అలాగే గంజాయి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలని సూచించారు. పిల్లలను, యువకులను డ్రగ్స్ ప్రభావానికి దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించడనికి రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కు వ్యతరేకంగా అవగాహనా కల్పించడంతోపాటు కఠినమైన పోలిసు వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ఈ.టి. నరసింహ పోరాడాలన్నారు.

6 నుంచి సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వే చేపట్టాలి : భట్టి

విశాలాంధ్ర బ్యూరో-మేడ్చల్-మల్కాజిగిరి : రాష్ట్రంలో నవంబర్ 6 వ తేదీ నుండి సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో అన్నింటినీ చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. మంగళవారం సచివాలయం కేంద్రంగా జరిగిన అన్ని జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్ లో ఉప ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లా నుండి పాల్గొన్నారు. ఈ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వివిధ జిల్లాల కేంద్రాల నుండి రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, డి.అనసూయ (సీతక్క), జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఉప ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ , సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఎస్. హరీష్ తదితరులు పాల్గొన్నారు. భారత రాజ్యాంగం మన సమాజంలో సమానత్వాన్ని సాధించడం లక్ష్యంగా పెట్టుకుందని, ఆ లక్ష్యం మేరకు రాష్ట్రంలో వివిధ జాతుల సామాజిక, ఆర్థిక, ఆదాయ విద్యా, రాజకీయ స్థితిగతులను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, అప్పుడే మనం మన సమాజంలో సమానత్వం కోసం విధానాలను రూపొందించగలమని ఆయన అన్నారు. రాష్ట్రంలో సామాజిక సర్వే ఈ ఉదాత్తమైన లక్ష్యాన్ని సాకారం చేసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లుగా మీ అందరికీ ప్రాధాన్యత ఉన్నదని, తమతమ జిల్లాలో లక్షలాది మంది ప్రజానీకానికి న్యాయం చేసేందుకు మీ సేవలు ఒక ప్రాతిపదికగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. జిల్లా కలెక్టర్లు సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. కలెక్టర్లు ఎన్యుమరేటర్లుగా ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగతంగా పర్యవేక్షించించడం, ప్రతి ఎన్యుమరేటర్‌కు ఎన్యుమరేషన్ బ్లాక్ మ్యాప్, గృహ సర్వే షెడ్యూల్, ఎన్యూమరేటర్స్ మాన్యువల్ అందే విధంగా చూసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఎన్యుమరేటర్లకు సమర్థవంతంగా శిక్షణ ఇవ్వాలని, వారికి కేటాయించిన సర్వే షెడ్యూల్‌లో చేర్చబడిన 50 ప్రశ్నలపై పూర్తి అవగాహన ఉండే విధంగా జిల్లా కలెక్టర్లు వారికి శిక్షణ ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఎన్యూమరేటర్లు ముందుగా ఇంటి జాబితాను పూర్తి చేసి, పాఠశాల వేళల తర్వాత ప్రతిరోజూ 5-7 ఇళ్లను సందర్శించడం ద్వారా ఇంటి షెడ్యూల్‌ను ప్రారంభించాలని, సర్వేలో నిర్వహణను పటిష్టంగా చేపట్టి నాణ్యమైన అవుట్‌పుట్ పొందడానికి అవసరమైన సమయాన్ని కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందికి ఆకర్షణీయమైన వేతనం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. సర్వే ను నిర్వహించడంలో క్షేత్ర స్థాయిలో గ్రామాలు, పట్టణాలను సందర్శించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సర్వే నిర్వహణపై ప్రతి రోజు పర్యవేక్షక సిబ్బందితో సమీక్ష నిర్వహించాలని అన్నారు. సర్వే గురించి టామ్ టామ్ బీట్ ద్వారా ప్రతి గ్రామంలో ప్రకటించాలని అన్నారు. సామాజిక కుల గణనను ప్రచారం చేయడానికి%ఱ% మీడియాను సమర్థవంతంగా ఉపయోగించాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ వీసీలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ గౌతం అదనపు కలెక్టర్లు రాధికా గుప్త విజయేందర్ రెడ్డి డిఆర్ఓ హరిప్రియ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జనాభా గణనలో కుల గణన చేపట్టాలి: ఆర్.కృష్ణయ్య

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : 2025 సం.లో జాతీయ స్థాయిలో జనాభా గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడనందున ఇందులో కుల గణన కూడా చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యకులు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కులగణన చేయాలని ఎన్డీయే ప్రభుత్వంలోని భాగస్వామ్య పక్షాలు, జనతాదాల్, టిడిపి, అప్నా దళ్, రిపబ్లిక్ అండ్ పార్టీ, జనశక్తి పార్టీ తదితర పార్టీలతో పాటు ఆర్ఎస్ఎస్ కూడా కులగణన చేయాలని డిమాండ్ చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం అంగీకరించక పోవడం శోచనీయం అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్టీలు, వామపక్షాలు, దేశంలోని ప్రజా సంఘాలు అన్ని కులగణన చేయాలని డిమాండ్ చేస్తున్నాయన్నారు. ఇప్పటికే ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడుతో సహా అనేక రాష్ట్రాల్లో కులగణన చేశారన్నారు. మండల కమిషన్ తో సహా అనేక రాష్ట్ర స్థాయి 265 బీసీ కమిషన్లు కూడా కుల గణన చేయాలని సిఫార్సు చేశాయన్నారు. సుప్రీం కోర్టుతో సహా అన్ని రాష్ట్రాల హైకోర్టు దాదాపు 20 హైకోర్టులు కూడా కులగణన చేయాలని తీర్పు చెప్పాయన్నారు. కులగణన చేయాలని దేశంలో ఇంత చర్చ జరుగుతున్న కేంద్ర ప్రభుత్వం అంగీకరించక పోవడం సరికాదన్నారు. ఈ విషయంపై అన్ని రాజకీయ ప్రతిపక్ష పార్టీలు వచ్చే పార్లమెంటు సమావేశంలో ఐకమత్యంతో ఒక్కటి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. అలాగే ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ రైల్వే, ఎల్.ఐ.సి, బి.హెచ్.ఈ.ఎల్, బి.డి.ఎల్, బ్యాంకింగ్, రక్షణ సంస్థలు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయరాదని అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు పార్లమెంటులో ఏకమై కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచాలని కోరారు. పై రెండు ప్రధాన డిమాండ్ల సాధనకై పార్లమెంటులో ఉన్న 34 రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి డిసెంబర్ నెలలో జరిగే పార్లమెంటులో విస్తృతంగా చర్చించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో , జిల్లపల్లి అంజి, లాల్ కృష్ణ, వేముల రామకృష్ణ, నందగోపాల్, కోలా జనార్దన్, నందగోపాల్, గొరిగె మల్లేష్ యాదవ్, పగిళ్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతికే ఇంటింటి కుటుంబ సర్వే

విశాలాంధ్ర బ్యూరో-మేడ్చల్-మల్కాజిగిరి : రాష్ట్ర ప్రభుత్వం ఏంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య,ఉపాధి,రాజకీయ మరియు కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ప్రధాన ఉద్దేశం రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే ఈ సర్వే అని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై మంగళవారం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శేఖర్ తో కలిసి జిల్లా అదనపు కలెక్టరు సూపర్ వైజర్లకు శిక్షణా కార్యక్రమాన్నిఏర్పాటు చేసారు. సిపిఓ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో సర్వే ఎలా నిర్వహించాలని, డేటాను ఎలా సేకరించాలి, సర్వేలో ఎదురరుయ్యే సాధారణ సమస్యలను ఎలా పరిష్కరించాలి అనే విషయాల పై వివరంగా అదనపు కలెక్టరు సూచనలు అందించారు. ఎన్యూమరేటర్లు వారికి కేటాయించిన ఈబి లో ప్రతి కుటుంబాన్ని క్రమపద్దతిలో జాబితా తయారు చేసి ప్రతి కుటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరించాలని, అనంతరం హౌజింగ్ లిస్ట్ అయిన ప్రతి ఇంటి ముఖ్య ద్వారానికి ప్రక్కన స్టిక్కర్ ని అతికించాలన్నారు. ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిలోని వారితో గౌరవంగా, మర్యాదగా మాట్లాడాలని సూచించారు. ఎన్యుమరేషన్ సమయంలో కుటుంబయజమాని నుండి సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచబడతుందన్నారు. ఎన్యూమరేషన్ లో నింపిన షెడ్యుల్ ఫారాలను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. ఎన్యుమరేటగర్ నిర్దేశించిన డేటా ఎంట్రీ కేంద్రానికి వచ్చి ఆపరేటర్ తో డేటా ఎంట్రీని పూర్తి చేయించాలన్నారు. సూపర్ వైజర్లు ఫీల్డ్ లో ఎన్యుమరేటర్ల పనితీరును పర్యవేక్షించి అవసరమైన సహాయాన్ని అందించాలన్నారు. ఎన్యుమరేటర్లు సేకరించిన డేటాలో 10 శాతం రాండమ్ కుటుంబాలను ఎంచుకుని ఆఆ ఇండ్లను సందర్శించి డేటాను మరలా తనిఖీ చేయాలన్నారు. సర్వే ప్రక్రియలో కిందిస్థాయి ఎన్యూమరేటర్లకు మార్గదర్శకంగా వ్యవహరిస్తూ సహాయం అందించాలన్నారు. సర్వే సమర్థవంతంగా నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి కావలసిన అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం సర్వేకు సంబంధించిన నిర్ణీత ఫారాలను ఏవిధంగా పూరించాలనే అంశం పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలిపారు.

టెస్కో ద్వారానే వస్త్రాలను కొనుగోలు చేయాలి: మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - హైదరాబాద్ : నవంబర్ 15 లోగా వస్త్రాల కోసం ఇండెంట్ టెస్కోకు సమర్పించాలని జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివిధ సంక్షేమ శాఖల అధికారులను కోరడం జరిగింది. మంగళవారం నాడు సచివాలయంలో టెస్కోకు వస్త్ర ఉత్పత్తి ఆర్డర్ల కేటాయింపుకు సంబంధించి వివిధ సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల పాల్గొని, ప్రభుత్వం నేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో జీవో నెం.1 ని తీసుకురావడమైనదని తెలియజేశారు. ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని పరిగణలోనికి తీసుకొని ఈ జీవో ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖలకు, కార్పొరేషన్లకు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమగు వస్త్రాన్ని తప్పనిసరిగా టెస్కో ద్వారానే కొనుగోలు చేయాలన్నారు. ఒకవేళ టెస్కో వారు ఒక వారం రోజులలోగా “నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్” జారీ చేసినప్పుడు మాత్రమే ఇతర సంస్థల నుండి కొనుగోలు చేయాలని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా టెస్కో వారికి ఆర్డర్ పెట్టకుండా ఇతర ప్రైవేట్ సంస్థల నుండి కొనుగోలు చేయకూడదని, కొనుగోలు విషయంలో తప్పనిసరిగా ప్రభుత్వ ఆదేశాలు పాటించి నేత కార్మికుల ఉపాధికి తోడ్పాటు అందించాలని కోరారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, జీవో 1 ఉత్తర్వులు జారీ చేయడమైనదని, ఆ ఉత్తర్వులకు విరుద్ధంగా ఎవరైనా ప్రైవేట్ సంస్థల నుండి కొనుగోలు చేపడితే బాధ్యులపై చర్యలు ఉంటాయని తెలిపారు. కొన్ని సంక్షేమ శాఖలు ప్రతి సంవత్సరం యూనిఫాం ఇతర వస్త్ర డిజైన్ల రంగులు మార్చడం వలన సప్లై లో ఆలస్యం జరుగుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, కావున ప్రతి సంవత్సరం డిజైన్ మార్చకుండా, కనీసం ఐదు సంవత్సరాల వరకు స్థిరంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు, రాబోవు విద్యా సంవత్సరం అనగా 2025-26 సంవత్సరానికి అవసరమగు వస్త్ర ఇండెంట్‌ను టెస్కో వారికి 15.11.2024 లోగా ఇవ్వాలన్నారు. నేత కార్మికులకు నూలు కొనుగోలు, వస్త్ర ఉత్పత్తి టెస్కో వారికి డైయింగ్, ప్రాసెసింగ్ నకు 3 నెలల నుండి 6 నెలల సమయము పడుతుందని, కావునా 6 నెలల ముందే టెస్కో వారికి ఇండెంట్ సమర్పించినట్లైతే సకాలంలో సప్లై చేయడానికి వీలుంటుందని మంత్రి తెలియజేశారు. కావునా 2024-25కు సంబంధించి 100 శాతం సప్లై చేయాలని టెస్కో ఎండీ జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్‌ని మంత్రి ఆదేశించారు.

ప్రశ్నార్థకంగా స్టేడియం స్థలం..!?

12 ఎకరాలు కేటాయింపు

ప్రస్తుతం మిగిలింది 9 ఎకరాలు 22 గుంటలు

స్టేడియం స్థలంలో వెలుస్తున్న గుడిసెలు

తాడూరి గగన్ కుమార్

విశాలాంధ్ర-కాప్రా : సర్కిల్ పరిధిలోని జమ్మిగడ్డ 199 సర్వేనెంబర్‌లో స్టేడియం కోసం 12 ఎకరాల స్థలం కేటాయిస్తే కొంత స్థలం కబ్జాకు గురి కాగా మిగిలిన 9 ఎకరాల 22 గుంటల భూమి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని జమ్మిగడ్డ స్మశాన వాటిక సాధన సమితి కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ అన్నారు. స్టేడియం స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో ప్రస్తుతం గుడిసెలు వెలుస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ స్థల వివాదం పై కోర్టులో జరుగుతున్న పరిణామాలన్నీ అందరికీ విధితమేనన్నారు. ప్రస్తుతం స్థలం విషయంలో చిలకమ్మా అండ్ అదర్స్ 2023లో లోయర్ కోర్టులో వారి కేసు డిస్మిస్ అయిందన్నారు. ఆ వెంటనే హైకోర్టులో స్టేట్ కు వెళ్లారని వివరించారు. తాను వెంటనే ఇంప్లీడ్ పిటిషన్ వేయగా అక్కడ విత్ డ్రా చేసుకున్నారని తెలిపారు. అనంతరం జిల్లా కోర్టులో ఆప్పీల్ వేయగా న్యాయమూర్తి ఇరుపక్షాలు అంటే రెవెన్యూ- జిహెచ్ఎంసి కానీ చిలుకమ్మ అండ్ అదర్స్ కానీ ఎలాంటి నిర్మాణాలు చేపట్ట కూడదని స్టేటస్కో ఇచ్చారని గగన్ కుమార్ తెలిపారు. (ప్రస్తుతం కోర్టు విచారణలో ఉంది) ఈ విషయం కూడా అందరికీ తెలిసిన విషయమేనన్నారు. ఇదిలా ఉండగా స్టేటస్కో ఉన్న స్థలంలో ప్రస్తుతం గుడిసెలు వెలుస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం వేలుస్తున్న గుడిసెలపై అధికారులు చర్యలు తీసుకోకపోతే గదులుగా రూపాంతరం చెందే అవకాశం ఉందన్నారు. గతంలో స్టేడియం కోసం కేటాయించిన 12 ఎకరాల భూమి కాస్త కబ్జాకు గురవుతూ ప్రస్తుతానికి 9 ఎకరాల 22 గుంటల స్థలం చేరుకుందన్నారు. స్టేడియం స్థలం పరిరక్షణ కోసం చర్యలు తీసుకోకపోతే ప్రస్తుతం ఉన్న స్థలం కూడా కబ్జాకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ విషయంలో రెవెన్యూ, జిహెచ్ఎంసి అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదే విధంగా గుడిసెలు వెలుస్తున్న విషయాన్ని రెవిన్యూ, జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ ద్వారా కోర్టు ధిక్కరణ కింద జిల్లా కోర్టు దృష్టికి తీసుకువెళ్లిన పక్షంలో స్టేటస్కో ఎత్తివేసే అవకాశం ఉంటుందన్నారు. వెంటనే అధికారులు కంచే వేసి ప్రభుత్వ భూమిని కాపాడవచ్చునని ఆయన తెలిపారు. ఈ మేరకు జిహెచ్ఎంసి, రెవెన్యూ అధికారులకు వినతి/పత్రాలు సమర్పించినట్లు ఆయన తెలిపారు.

తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రొయ్యలు కృష్ణమూర్తి ఎన్నిక

విశాలాంధ్ర-మల్కాజిగిరి : హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో సోమవారం జరిగిన బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో సమావేశం రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా శాసన సభ్యులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, అతిథులుగా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్, రిటైర్డ్ అధికారి చిరంజీవులు, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ పాల్గొన్నారు, దీనిలో తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రొయ్యలు కృష్ణమూర్తి ఏకగ్రీవ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి డీజీ. సాయిలు గౌడ్, సహాయ కార్యదర్శి ఉమా మహేష్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు, శ్రావణ్ కుమార్, రాజమౌళి, ధనుంజయ్ నాయుడు, సి.ఎచ్.దశరథ్,తదితరులు పాల్గొన్నారు,

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎండీ కృష్ణా యాదవ్, సెక్రటరి మహమ్మద్ అబ్దుల్ ఖాదర్.. కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య, జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్ జిల్లా టీజీవోల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఇందుకు తమ సహకారం అందిస్తామని అధికారులు తెలిపారు. ప్రభుత్వ పథకాల ఫలాలను సామాన్యులకు అందేలా కృషి చేయాలని కోరారు.

యువకుడి చాతిపై పొంగులేటి పచ్చబొట్టు

విశాలాంధ్ర-కారేపల్లి: మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్ కి చెందిన ఉప్పు సాయిరాం తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఉన్న అభిమానంతో తన హృదయంపై పొంగులేటి చిత్రాన్ని పచ్చబొట్టుతో వేయించుకున్నాడు. మంత్రి పొంగులేటి జన్మదినం సందర్భంగా ఉప్పు సాయి తన ఛాతిపై మంత్రి పొంగిలేటి చిత్రాన్ని పచ్చబొట్టు వేయించుకున్నాడు. ఎల్లప్పుడూ ప్రజా శ్రేయసు కోసం ఆలోచించే గొప్ప నాయకుడు మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డి అని ఉప్పు సాయిరాం పేర్కొన్నారు. తన జీవితకాలం గుర్తుండే విధంగా ఛాతిపై పొంగులేటి చిత్రపటాన్ని పచ్చబొట్టుగా వేయించుకున్నానని తెలిపారు.పొంగులేటి ఆశీస్సులు తనకి ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన అడుగుజాడల్లో నడవడమే తన లక్ష్యం అన్నారు.

ట్రైకర్ సబ్సిడీ నిధులను విడుదల చేయ్యాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : గిరిజనులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని చేవెళ్ల డిక్లరేషన్ను అమలు పరచాలని తెలంగాణ గిరిజన సమాఖ్య నేతలు కల్లూరి వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్ డిమాండ్ చేసారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా చేసారు. ఇక్కడ జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ నియంత పాలను పారదోలి ప్రజా పాలన రావాలని ఆదివాసీ గిరిజనులు ఎన్నికల్లో ముఖ్య పాత్ర వహించారని గుర్తు చేసారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు దాటుతున్నా గిరిజనులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైనట్లు విమర్శించారు. గిరిజన సంక్షేమ శాఖ ట్రైకార్ పథకం నుండి 2017 నుంచి 2020 వరకు 32122 మంది లబ్ధిదారులకు ఇవ్వాల్సిన రుణాలకు సంబంధించి రూ. 265 కోట్లు పెండింగ్లో ఉన్న సబ్సిడీని వెంటనే విడుదల చెయ్యాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ని కోరారు. గత నాలుగు సంవత్సరాల నుంచి యాక్షన్ ప్లాన్లు ఇవ్వకపోగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, నిరుద్యోగ యువతీ యువకులు నిరాశ నిస్పృహలకు లోనౌతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోంది కుటుంబరావు, గోవింద్, లక్ష్మయ్య, నగేష్, సత్యనారాయణ, చందర్, వెంకటేశ్వర్లు, శంకర్, నరేష్, శ్రీనివాస్, జానకిరామ్, విజయ్ రమేష్, శివాజీ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

లంకాసాగర్ ప్రాజెక్టులో చేప పిల్లలు విడుదల

విశాలాంధ్ర-పెనుబల్లి: పెనుబల్లి లంకాసాగర్ ప్రాజెక్ట్ లో 6 లక్షలు చేప పిల్లలును ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ 100శాతం రాయితీపై లంకాసాగర్ ప్రాజెక్ట్ లో 6 లక్షలు చేప పిల్లలను విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గం మత్స్యకారుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది అని, మత్స్యకారుల సమస్యలు ను రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి ఖమ్మం జిల్లా మంత్రులు బట్టి, తుమ్మల,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికీ తీసుకువెళ్తానని తెలియజేసారు. అనంతరం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదినం సందర్భంగా లంకాసాగర్ రైతు వేదిక నందు ఎమ్మెల్యే రాగమయి కేకులు కత్తిరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జనం మెచ్చిన నేత పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ గంట ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణ, కల్లూరు ఏఎంసిచైర్మన్ భాగం నీరజ, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు శివ ప్రసాద్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి వెంకటేశ్వర్లు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు నీలాల గోపి కాంగ్రెస్ నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరావు చీకటి రామారావు, కీసరి శ్రీనివాస్ రెడ్డి, చీకటి నరసింహారావు, బొర్రా కోటేశ్వరరావు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, అలుగోజు చిన్నస్వామి, మేకతొట్టి కాంతయ్య, గోగినేని రమేష్, మొరంపూడి బాబురావు, బాపిరెడ్డి, పామర్తి అమర్నాథ్, దొంతు మాధవరావు, గుంత్రు శ్రీనివాసరావు, పాకలపాటి సతీష్, కావిటి శ్రీను, సురేష్ నాయక్, మల్లెల రాజా, కార్యకర్తలు, గ్రామస్తులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

ఘనంగా పొంగులేటి జన్మదిన వేడుకలు



విశాలాంధ్ర-కారేపల్లి: రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి ఖమ్మం జిల్లా ముద్దుబిడ్డ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను కారేపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో మంత్రి పొంగులేటి పుట్టినరోజు సందర్భంగా టపాసులు కాలుస్తూ భారీ కేకును కట్ చేసి పంచిపెట్టారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ప్రధాన అనుచరుడు ఇమ్మడి మాట్లాడుతూ పొంగులేటి శీనన్న సారధ్యంలో ఖమ్మం జిల్లాను ఎంతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల,సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, బానోతు రామ్మూర్తి,బానోతు దేవులానాయక్, నర్సింగ్ శ్రీనివాసరావు,మల్లెల నాగేశ్వరరావు,గుగులోతు శ్రీను,ఆలోతు ఈశ్వరి నంద రాజ్,ఇమ్మడి రమాదేవి, అడ్డగోడ ఐలయ్య,అజ్మీర నరేష్ కుమార్,తోటకూరి శ్రీనివాసరావు, బానోత్ హిరాలాల్ పాల్గొన్నారు.

గుత్తాధిపత్య సిండికేట్‌తో దేశానికే ప్రమాదం: రాహుల్

సెబీని మోదీ నాశనం చేశారు: ఖడ్గే

న్యూఢిల్లీ: సెబీచీఫ్ మాధవి పూరి బుచ్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ మరోమారు ధ్వజమెత్తింది. "గుత్తాధిపత్య బచావో సిండికేట్" పనిచేస్తోందని... దీనిలో ప్రధాన అంశంగా అదానీ గ్రూప్, కీలక నియంత్రణ సంస్థలు, బీజేపీ మధ్య 'ప్రమాదకరమైన అనుబంధం' ఉందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే... ప్రధానమంత్రి నరేంద్రమోదీ సెబీ ని చాలా సంవత్సరాలుగా నాశనం చేశారని... తద్వారా కోట్లాది చిన్న, మధ్యతరగతి ప్రజల పొదుపు సొమ్మును ప్రమాదంలో పడేశారని ఆరోపించారు. 'నరేంద్ర మోదీ జీ, మీరు నియమించిన చైర్‌పర్సన్ ద్వారా సెబీలో సృష్టించిన తెగులును మీరు దాచిపెట్టలేరు. బట్టబయలవుతున్న అవినీతి ఆమె పదవిని నిలబెట్టుకోలేనంతగా చేసింది. మీరు భారతదేశ మార్కెట్ నియంత్రణ సంస్థ అయిన సెబీ యొక్క పవిత్రతను నాశనం చేశారు. తద్వారా కోట్లాదిమంది చిన్న మధ్యతరహా పెట్టుబడిదారుల కష్టార్జిత పొదుపులను ప్రమాదంలో పడేస్తోంది' అన్నారు. 'మీ ప్రియమైన మిత్రుడు అదానీకి మీరు గుత్తాధిపత్యాన్ని ఎలా రూపొందించారో కూడా ఇది స్పష్టం చేస్తోంది. ఈ సిండికేట్‌లోని ప్రతి అంశాన్ని పరిశీలించడానికి సమగ్రమైన జేపీసీ అవసరం!" అని 'ఎక్స్' ద్వారా ఖడ్గే వ్యాఖ్యానించారు. స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్ స్కానర్‌లో ఉన్న ఇండియాబుల్స్ గ్రూప్‌తో అనుసంధానించబడిన వ్యక్తికి సంబంధించిన ఒక కంపెనీకి బుచ్ తన ఆస్తిని లీజుకు ఇచ్చారని కాంగ్రెస్ ఆరోపించింది.

ఇక్కడ పార్టీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా మాట్లాడుతూ... అక్టోబర్ 10, 2022 న సెబీలో హోల్ టైమ్ మెంబర్‌గా మారిన అనంత్ నారాయణ్... ముంబైలోని తన ఆస్తిని కూడా స్టాక్ బ్రోకర్‌కు లీజుకు ఇచ్చారని, లీజు రూపంలో రూ. 64.8 లక్షలు సెబీచే నియంత్రించబడే ఐఎంసి ఇండియా సెక్యూరిటీస్ అనే బ్రోకరేజ్ సంస్థ ద్వారా తీసుకోవడం జరిగిందని తెలిపారు. అదే సమయంలో, పార్టీ ఒక వీడియోను విడుదల చేసింది. కాగా యూట్యూబ్‌లోని తన పోస్ట్‌లో రాహుల్ గాంధీ ఏమన్నారంటే... "మోనోపోలీ బచావో సిండికేట్' పెరుగుదలతో భారతదేశ సంస్థాగత చట్రం కుళ్లిపోవడం భయంకరమైన లోతుకు చేరుకుంది. ఈ సిండికేట్ ప్రధాన విషయమేమిటంటే... అదానీ గ్రూప్, కీలకమైన నియంత్రణ సంస్థలు, మోడీ నేతృత్వంలోని బీజేపీ మధ్య ప్రమాదకరమైన అనుబంధం" అని తెలిపారు. కేవలం విదేశీ ఆయుధాలను రీబ్రాండింగ్ చేయడం ద్వారా కంపెనీ ఎలా లాభపడుతుందో అదానీ డిఫెన్స్ వెబ్‌సైట్ వెల్లడిస్తుంది. అయితే శిక్షణ, పెన్షన్లు, యువ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి ఉద్దేశించిన కీలకమైన నిధులు అగ్నివీర్ వంటి పథకాల ద్వారా దారి మళ్లించబడుతున్నాయని రాహుల్ ఆరోపించారు. ఈ ద్రోహం జాతీయ భద్రతతో రాజీపడుతుంది. మన యువత భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తుందని గాంధీ అన్నారు. 'అదానీ గ్రూప్ పెంచిన విలువలను రక్షించడానికి వ్యవస్థను తారుమారు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాధవి బుచ్ అధ్వర్యంలోని సెబీ వంటి సంస్థల సహకారంతో 'అదానీ బచావో సిండికేట్' ఎలా అభివృద్ధి చెందుతుందో గతంలో మేము బహిర్గతం చేశాము' అని రాహుల్ తెలిపారు. కార్పోరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా క్రమబద్ధీకరణ ,సంస్థాగత సమగ్రత క్షీణించడంపై బుచ్ పాత్ర తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుందని గాంధీ అన్నారు. 'ఎక్స్' ద్వారా చేసిన పోస్ట్‌లో రాహుల్ ఏమన్నారంటే.... "గుత్తాధిపత్యం బచావో సిండికేట్! విమానాశ్రయాలలో గుత్తాధిపత్యం. ఓడరేవులలో గుత్తాధిపత్యం. సిమెంట్‌లో గుత్తాధిపత్యం. అధికారంలో గుత్తాధిపత్యం. రక్షణలో కూడా గుత్తాధిపత్యం. అదానీ ఏ రంగాన్ని కోరుకున్నా, సిండికేట్ అతనిని గుత్తాధిపత్యం చేయడానికి ప్రయత్నిస్తుంది." అన్నారు. ఈ గుత్తాధిపత్య సిండికేట్ వెనుక ఎవరున్నారో కూడా అందరికీ తెలుసునని ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దే రాహుల్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

పర్యావరణహిత టపాసులే మేలు

డిప్యూటీ సీఎం పవన్, హోం మంత్రి అనిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సాధ్యమైనంత వరకు పర్యావరణహిత టపాసులతోనే దీపావళి జరుపుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత ప్రజలకు సూచించారు. మంగళవారం మంగళగిరిలోని ఉపముఖ్యమంత్రి కార్యాలయంలో శాంతిభద్రతలు, దీపావళి నేపథ్యంలో ముందస్తు భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. 185 అగ్నిమాపక స్టేషన్లు, సిబ్బంది ఎక్కడ ప్రమాదం జరిగినా అప్రమత్తంగా ఉండాలన్నారు. బాణసంచా అక్రమ తయారీపై 100 లేదా 101 నంబర్లకు ఫోన్ల ద్వారా పోలీస్, ఫైర్ వ్యవస్థలకు ఫిర్యాదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద గ్రామం తరహాలో బాణసంచా పేలుడు ఘటనలు జరగకుండా మరింత అప్రమత్తంగా ఉండాలని, వాయు కాలుష్యం దేశవ్యాప్తంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. విజయనగరం జిల్లా గుర్లలో డయేరియాకు సంబంధించి తాజా పరిస్థితులపై ఉపముఖ్యమంత్రి ఆరా తీయగా, అక్కడ డయేరియా కేసులు అదుపులోకి వచ్చినట్లు హోంమంత్రి వివరించారు. ఇటీవల రాష్ట్రంలో విమానాలలో బాంబు బెదిరింపులపైనా పవన్ ఆరా తీశారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నిర్వహణను ఆయన ప్రశంసించారు. తన నియోజకవర్గంలోని పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం సహా ముఖ్యమైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రాధాన్యం కల్పించాలని పవన్‌ను హోంమంత్రి కోరారు.

2025 చివరకు బందరు పోర్టు పూర్తి: పార్థసారథి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బందరు పోర్టు నిర్మాణం 2025 డిసెంబర్ నాటికి పూర్తి అవుతుందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈ పోర్టును 'క్యాపిటల్ పోర్టు'గా అభివృద్ధి చేయనున్నట్లు మంగళవారం ఒక ప్రకటన చేశారు. మచిలీపట్నం మంగినపూడి వద్ద 1,145 ఎకరాల్లో గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణం పనులను 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రారంభించగా, వైసీపీ ప్రభుత్వం దాన్ని పక్కన పెట్టిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పోర్టుల నిర్మాణంపై పట్టుదలగా ఉందన్నారు. ఆరు పెద్ద పోర్టుల పనులు రాష్ట్రంలో వేగంగా జరుగుతున్నాయని, నాలుగు కొత్త పోర్టులు సిద్ధం అవుతున్నాయన్నారు. తీర ప్రాంత ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతమున్న ఆరు ఓడరేవుల నుంచి ఎగుమతులు గణనీయంగా పెరగడంతో ఏపీ తన జల రవాణా సామర్థ్యాన్ని బలోపేతం చేసే ప్రయత్నం కొనసాగుతోందన్నారు. నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం పోర్టును రూ.3,736 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారని మంత్రి తెలిపారు. సాగరమాల ప్రాజెక్టు కింద కాకినాడ యాంకరేజ్ పోర్టులో రూ.91 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఓడరేవుల అభివృద్ధి, తీర ప్రాంత బెర్తులు సహా వివిధ ప్రాజెక్టులకు సంబంధించి ఏపీ నుంచి రూ.3,300 కోట్ల విలువైన 29 కొత్త ప్రతిపాదనలు పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖకు అందాయని కేంద్రమంత్రి సోనోవాల్ పార్లమెంటుకు తెలిపారని మంత్రి పార్థసారథి వెల్లడించారు.

విమాన చార్జీలు నియంత్రించండి

అన్ని పార్టీల ప్రతినిధులతో అజమాయిషీ అవశ్యం

రామ్మోహన్ నాయుడుకు నారాయణ లేఖ

న్యూఢిల్లీ: దేశ, విదేశాలతో అమరావతిని అనుసంధానం చేయలనుకోవడం అభినందనీయమేగానీ విమాన చార్జీలను నియంత్రించడం కూడా ముఖ్యమేనని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఇదే విషయంపై ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు ఒక లేఖ రాశారు. సంవత్సర కాలంలో విమాన చార్జీలు 40శాతం పెరిగిపోవడాన్ని గుర్తుచేశారు. డిమాండ్ పెరుగుతున్నది కాబట్టి విమాన చార్జీలను కూడా అమాంతం పెంచేస్తామంటే సమంజసం కాదన్నారు. ప్రైవేటు విమానయాన సంస్థలు లాభాల కోసం ప్రయాణికులను దోచేస్తున్నాయని లేఖలో నారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు, విమానయానానికి అధిక డిమాండ్ దృష్ట్యా ప్రైవేటు సంస్థల దోపిడీ సాగుతోందని వ్యాఖ్యానించారు. డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పటికీ చార్జీలను ఒక పరిమితికి మించి పెంచరాదన్నారు. ప్రభుత్వ రంగ ఎయిర్‌వేస్ లేక ప్రయాణికులపై అధిక భారం పడుతోందని నారాయణ వెల్లడించారు. అన్ని పార్టీల ప్రతినిధులతో కూడిన రెగ్యులేటరీ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవడం వల్ల విమాన చార్జీలను నియంత్రించేందుకు వీలు ఉంటుందని సూచించారు. 'పౌర విమానయాన శాఖ పరిధిలోని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) దేశవ్యాప్తంగా విమానాశ్రయాలు నిర్మిస్తోంది. ఇందుకోసం ప్రభుత్వ నిధులు అంటే ప్రజా ధనాన్ని వినియోగిస్తోంది. ఎయిర్‌పోర్టులు, రన్‌వేల నిర్మాణం... భవిష్యత్ విమానాశ్రయాల కోసం విలువైన భూములను విమానాశ్రయాలు, రన్‌వేలు, ఇతర మౌలిక వసతుల కోసం ప్రభుత్వం కేటాయిస్తోంది. ప్రైవేటు విమానయాన సంస్థలు ప్రభుత్వం నిర్మించిన విమానాశ్రయాలను వాడుకుంటున్నాగానీ టీ, కాఫీ లేక స్నాక్స్ వంటి కనీస సౌకర్యాలు ప్రయాణికులకు కల్పించరు. ప్రయాణికుల్లో మధుమేహులు ఉంటారన్న విషయాన్ని పరిగణలోకి తీసుకోరు. ప్రభుత్వ విమానయాన సంస్థలు లేక ప్రైవేటు వారి దోపిడీ రాజ్యం సాగుతోంది. యజమానాలు ఇష్టారాజ్యంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. కాబట్టి విమాన చార్జీలను నియంత్రించడం అవసరం. చార్జీలు నిర్ణయించే యంత్రాంగంగా అన్ని పార్టీల ప్రతినిధులతో రెగ్యులేటరీని ఏర్పాటు చేసుకోవడం సముచితం. ఈ దిశగా మీ నుంచి చర్యలను ఆశిస్తున్నాం' అని లేఖలో నారాయణ పేర్కొన్నారు.

బలమైన పార్టీ నిర్మాణమే నేటి కర్తవ్యం

ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-నంద్యాల : బలమైన పార్టీ నిర్మాణమే నేటి కర్తవ్యమని, కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ నంద్యాల జిల్లా సమితి సమావేశం సీపీఐ నంద్యాల పట్టణ కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ సీపీఐని గ్రామీణ స్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు. రానున్న రోజుల్లో జరగబోయే సీపీఐ శత జయంతి ఉత్సవాల జయప్రదం కోసం అందరూ పని చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని అనుసరించి పేదలకు పట్టణంలో రెండు సెట్లు, గ్రామాల్లో సెంట్లు ఇవ్వాలన్నారు. నవంబరు 18న సచివాలయ స్థాయిలో అర్హత కలిగిన పేదలతో అర్జీలిచ్చే ఆందోళనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రామాంజనేయులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు జిల్లా కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, కె.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనగణనతో పాటు బీసీ గణన

చంద్రబాబుకు బీసీ సంఘాల నేతల వినతి

వరద బాధితులకు రూ.10 లక్షల విరాళం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దేశవ్యాప్తంగా జరగనున్న జనగణనలో బీసీ గణన కూడా చేపట్టాలని బీసీ సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఏపీ అధ్యక్షులు కేసన శంకరరావు నేతృత్వంలో బీసీ ప్రతినిధుల బృందం సీఎంను ఉండవల్లి నివాసంలో కలిసి 10 అంశాలతో కూడిన వినతిపత్రం అందించింది. అమరావతి రాజధానిలో జ్యోతిరావ్ పూలే స్మృతివనం ఏర్పాటు చేయాలని, బీసీ రిజర్వేషన్లను దామాషా ప్రాతిపదికన పెంచేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కోరారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా, దామాషా ప్రకారం రిజర్వేషన్లతో పాటు విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో బీసీలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల్లో బీసిలకు 34 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని, బీసీలపై పెట్టిన తప్పుడు క్రిమినల్ కేసులు మాఫీ చేయాలని విన్నవించారు. బీసీ నేతలు లేవనెత్తిన అంశాలను సావధానంగా విన్న సీఎం...వారి సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బీసీ నేతలు వరద బాధితుల సహాయార్థం రూ.10 లక్షల చెక్కును ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించగా... చంద్రబాబు అభినందించారు.

జగన్ రైతు బీమాపై మాట్లాడటం హాస్యాస్పదం

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అయిదేళ్ల పాలనలో పంటల బీమాను అస్తవ్యస్తం చేసిన వైఎస్ జగన్... రబీలో సాగు చేసిన రైతులను అసలు రైతులుగానే పరిగణించలేదని, ఇప్పుడు పంటల బీమా గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతులపైనే పంటల బీమా ప్రీమియం భారమా?, చంద్రబాబు...! రైతుల ఉసురుపోసుకోవద్దు అంటూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వైస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం చేసిన విమర్శలకు అచ్చెన్నాయుడు స్పందించారు. ఐదేళ్ల పాటు రబీలో సాగు చేసిన ఒక్క రైతుకూ బీమా అమలు చేయని జగన్ అసమర్థ ప్రభుత్వంలో రైతులు ఎంతో తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఐదేళ్ల పాటు రైతులు సొంతంగా బీమా చెల్లించే సౌలభ్యం కూడా చేశారని అన్నారు. రైతులకు ఉద్యాన రాయితీలు లేవని, సూక్ష్మ సేద్యం లేదని, సకాలంలో ఎరువులు అందలేదన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని ఎన్‌డీపీ ప్రభుత్వంలో తిరిగి రైతులకు అన్ని రాయితీలు అందుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

లైబ్రరీ సైన్స్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ సర్టిఫికెట్ కోర్సులో చేరాలనుకునే అభ్యర్థులు నవంబరు 1 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పౌర గ్రంథాలయ సంచాలకులు ప్రసన్నకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు నెలల కాల వ్యవధి అంటే... డిసెంబరు 1 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకూ రాష్ట్రంలో గుర్తింపు పొందిన మూడు శిక్షణా సంస్థల్లో ఈ కోర్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పీఎస్ స్కూల్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ (విజయవాడ), రాయలసీమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ (గాంధీనగర్, కడప), వావిలాల సంస్థ లైబ్రరీ సైన్స్ (అరండల్ పేట, గుంటూరు) శిక్షణా సంస్థలో ఆంగ్ల మాధ్యమంలో 40 సీట్లు, తెలుగు మాధ్యమంలో 40 సీట్లు చొప్పున మొత్తం 240 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఈ శిక్షణా సంస్థల్లో చేరడానికి ఆసక్తి కలిగిన వారు రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ పరీక్ష లేదా దానికి సమానమైన కోర్సు ఏదైనా యూజీసీ గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నందు ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు. కోర్సులో ప్రవేశానికి అభ్యర్థుల ఎంపిక అర్హత పరీక్షలలో పొందిన మార్కుల ఆధారంగా జరుగుతాయని తెలిపారు. ఒకేషనల్ కోర్సు ద్వారా ఇంటర్ పూర్తి చేసిన వారు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులు కాదని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ నుంచి దరఖాస్తును నవంబరు 1 నుంచి 15వ తేదీ వరకూ పొందవచ్చని, పూర్తి చేసిన దరఖాస్తులను నవంబరు 18వ తేదీలోగా సమర్పించాలన్నారు.

అమరావతి, విశాఖలో గోల్ఫ్ కోర్సులు

సీఎం చంద్రబాబుతో కపిల్‌దేవ్ భేటీ

ఏపీకీ అంబాసిడర్‌గా ఉండేందుకు అంగీకారం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్.. ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి ఉండవల్లిలో సీఎం చంద్రబాబును కలిశారు. రాష్ట్రంలో గోల్ఫ్ కోర్స్‌ల ఏర్పాటుపై చర్చించారు. క్రీడలపై సీఎం చంద్రబాబు నాయుడు చాలా ఆసక్తిగా ఉన్నారని, గోల్ఫ్ గురించి ప్రత్యేకంగా చర్చ జరిగిందని సమావేశం అనంతరం కపిల్‌దేవ్ తెలిపారు. తాను ఇండియన్ గోల్ఫ్‌కు అధ్యక్షుడిగా ఉన్నట్లు చెప్పారు. అమరావతి, విశాఖ, అనంతపురంలో గోల్ఫ్ కోర్స్‌ల ఏర్పాటుపై చర్చించినట్లు వెల్లడించారు. భూమి ఎక్కడ ఇస్తారనే నిర్ణయం ప్రభుత్వానిదేనని, స్పోర్ట్స్ సిటీలో ఇస్తే సంతోషిస్తానని చెప్పారు. సీఎం నుంచి హామీ అనేకంటే ఆయన ఆశీర్వాదం ఉంటుందనడం సబబుగా ఉంటుందని కపిల్ అన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఏపీకీ అంబాసిడర్‌గా ఉండాలని కోరగా కపిల్ దేవ్ అంగీకరించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రితో కపిల్ దేవ్ క్రికెట్, గోల్ఫ్ సంబంధిత అంశాలపై చర్చించి, సలహాలు సూచనలు ఇచ్చారన్నారు. గోల్ఫ్ కోర్స్ అమరావతిలోనే కాకుండా కియా పరిశ్రమ ఉన్న అనంతపురంలోనూ ఏర్పాటు చేసే అంశంపై చర్చ జరిగిందన్నారు. తొలుత అనంతపురంలో, ఆ తర్వాత అమరావతి, వైజాగ్‌లలో గోల్ఫ్‌కోర్స్‌లు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని ఎంపీ చెప్పారు. క్రికెట్ తర్వాత ఖరీదైన క్రీడ గోల్ఫ్ అని ఆయనన్నారు. గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా చైర్మన్ కపిల్‌దేవ్ త్వరలో గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ మొదలు పెడతారని, ఈ లీగ్‌లో ఏపీ జట్లు ఉండాలని కోరుకుంటున్నామన్నారు. రెండేళ్లలో గోల్ఫ కోర్స్‌లు పూర్తి సమయానికి క్రీడాకారులు కూడా సిద్ధంగా ఉండేలా చూస్తామన్నారు.

జగన్ అసమర్థతతో విద్యుత్ రంగం నిర్వీర్యం: జవహర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఐదేళ్ల పాలనలో విద్యుత్ రంగాన్ని భ్రష్టు పట్టించిన మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు తమపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని మాజీ మంత్రి కేఎస్ జవహర్ అన్నారు. ఆయన మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి పత్రిక ప్రకటన విడుదల చేశారు. జగన్ అసమర్థ పాలనతో విద్యుత్ రంగంలో రూ.1,29,503 కోట్ల నష్టం వాటిల్లిందని అందులో వ్యాఖ్యానించారు. ట్రూ అప్, ట్రూ అప్ ఫ్యూయల్ అంటూ కొత్త పేర్లతో వడ్డించిన చార్జీలతో ప్రజలపై రూ.32,166 కోట్ల భారాన్ని మోపారన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని హామీ ఇచ్చిన జగన్... ఐదేళ్లలో తొమ్మిది సార్లు చార్జీలు పెంచారని విమర్శించారు. జగన్ హయాంలోనే 2022-23 సంవత్సరానికి సంబంధించి రూ.8,114 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనలు డిస్కంలకు సమర్పించిన విషయాన్ని గుర్తు చేశారు. జగన్ అధికారంలోకి వచ్చినప్పుడు మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఉన్న ఏపీ, ఆయన స్వార్థం, అరాచక, అవినీతితో నాశనమైందని దుయ్యబట్టారు. ఏపీ జెన్‌కో కేంద్రాల నుంచి కొనుగోలు చేయకుండా కమీషన్ల కోసం అధిక రేట్లకు కొనుగోలు చేసి విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిలో జగన్ చేసింది శూన్యమని, గత పీపీఏలనూ రద్దు చేశారని విమర్శించారు. పీపీఏలలో అక్రమాలు జరిగినట్లు ఆధారాలు లేవని కేంద్రం స్పష్టం చేసినా జగన్ పెడచెవిన పెట్టారన్నారు. దేశంలో తొలిసారిగా విద్యుత్ సంస్కరణలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని జవహర్ రెడ్డి పేర్కొన్నారు.

సల్మాన్, జీశాన్‌కు బెదిరింపులు... నిందితుడి అరెస్టు

ముంబై: మహారాష్ట్ర మాజీమంత్రి బాబా సిద్దిఖీ కుమారుడు, ఎమ్మెల్యే జీశాన్ సిద్దిఖీని చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. జీశాన్ కార్యాలయానికి గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. ఆ కాలర్ పెద్దమొత్తంలో డబ్బు డిమాండ్ చేశాడని, ఇవ్వకపోతే ఎమ్మెల్యేతో పాటు బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌ను చంపేస్తామని బెదిరించాడని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. శుక్రవారం సాయంత్రం ఈ కాల్ వచ్చినట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి తాజాగా ఒక అరెస్టు చోటుచేసుకుంది. నోయిడా ప్రాంతంలో 20 ఏళ్ల వ్యక్తిని అరెస్టు చేశారు. ముగ్గురు దుండగులు ఆరు రౌండ్లు కాల్పులు జరపడంతో బాబా సిద్దిఖీ ప్రాణాలు కోల్పోయారు. దుండగులు ఆయనపై కాల్పులు జరుపుతున్న సమయంలో నవరాత్రి ఊరేగింపులో బాణసంచా కాలుస్తుండటంతో కాల్పుల శబ్దం బయటకు వినిపించలేదు. ఇది ఒక కిరాయి హత్యని, వ్యాపార లావాదేవీల్లో గానీ, మురికివాడ అభివృద్ధి ప్రాజెక్టులో విభేదాల వల్ల గానీ జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. సిద్దిఖీని తామే చంపామని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. తండ్రితో పాటు కుమారుడిని చంపేందుకు కాంట్రాక్టు ఇచ్చినట్లు షూటర్లు విచారణలో పేర్కొన్నట్టు పోలీసువర్గాలు వెల్లడించాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.